ತೆಲುಗು ವೀರಚರಿತ

M. MORIAL
V.R NARLA
D. PHR II
Acc. No.

C

894.8274
P P A

ಪಿ. ಪ್ರಭಾಕರ ಶರ್ಮ

తెలుగు మెలుగులు

(వ్యాస సంపుటి)

A MEMORIAL
V.R NARLA
D. P. R. I.
Acc. No.
10401
V. V. NARLA LIBRARY

★

శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి.

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10401

మెనెజరు, మణి మంజరి
హైదరాబాదు.

[redacted] ముద్రణము.
తృతీయ ముద్రణము : 1960
750 ప్రతులు

894.8274
PRA

★

వెల : 2-75

★

ముద్రణ :
నాగార్జున ప్రింటింగ్ వర్క్స్,
కాచిగూడ, హైదరాబాదు.

A0UA102B114

తొలిపలుకు

జీవితమెల్ల స్వీకరించుకొని యనుభూతివిశేష మొకటి యమృతమధురమై యస్వాద్యమై యుండుటచే నేడు నాకు సాహిత్యరసాస్వాద ముప్పనచప్పనగా దోచుచు నుత్సాహము గొల్పకున్నది. నేనిట్లుండగా ఎప్పుడెప్పుడో పత్రికలలోను (భారతి, వేంకటేశ్వరప్రాచ్యవిద్యాపరిషత్సంచిక, గృహలక్ష్మి), రేడియో లోను ప్రకటితములు, అప్రకటితములు నగు నా వ్యాసములను. ఇతరరచనములను కొన్నింటినేని గ్రంథరూప మున ముద్రణమునకు దెత్తుముగా కని పూని చిరంజీవులు రామచంద్ర కోదండరామాదులు మదీయులు కావించిన కార్య మిది.

వారు నాతో యోచించియే ఏవో కొన్ని విభాగములు కల్పించి వ్యాసములను వేర్వేఱుగా సంకలనము చేసి సాహిత్య పరిసక్తములను గొన్నింటిని మాత్రమే యిప్పుడిట్లు ముద్రణ మున కిచ్చిరి.

అంతలో అమాంతముగా పురుషోత్తమవియోగదుర్వ్యా గమున భువనమెల్ల నల్లకల్లోలము కాగా నిరుత్సాహనిహ తుడనై యారంభించిన ఈభాగము ముద్రణము పారము ముట్టుచున్నను నేను దానివంకకైన గన్ను వాల్పనయితిని.

ఇందు అప్పటప్పట నా పునఃపర్యాలోకము లేకపోవు టచే గలిగినచ్యుతులను పరిశిష్టముగా తుదికి జతకూర్చితిని. (ఆ పరిశిష్టము నీముద్రణమున గ్రంథమందే చేర్చితిమి. ప్రకా.)

ఆప్తుల యౌత్సుక్యమునకు లోఁగి కావించిన నా యీ ముద్రణ యత్నము స ప్ర యో జ న మో, కాదో నిర్ణయింప సహృదయలోకము ప్రమాణము.

నా యెడ, సాహిత్యగురువర్యులగు శ్రీ తిరుపతి వేంకటేశ్వరుల దివ్యప్రతిభానుగ్రహమును, పాశ్చ్యలిఖిత పుస్తకశాల యాశ్రయానుగ్రహమును సదా సాహిత్యజ్యోతులు గొల్పు జగాదివ్యటీలు! వానిని బురస్కరించుకొనియే నా సాహిత్య యాత్ర సాగెను. ఆ యుభయమునకు జే!జే!

తిరుపతి,
1948 జూన్ 29

వేటూరి ప్రభాకరశాస్త్రి.

ವಿ. ಪ್ರಭಾಕರ ಶಾಸ್ತ್ರಿ

మనవి

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు జీవించియుండగనే ఈ వ్యాససంపుటి వెలువడినది. ఆంధ్రప్రజల మన్ననల నన్ని విధముల నందుకొనినది. పత్రికలలో నచ్చటచ్చట మరుగుపడి యుండిన ఈ తెలుఁగు మెఱుఁగుల నిట్లు తొల్దొల్త గ్రంథరూప మున వెలుగులోనికిఁదెచ్చి తమ గ్రంథమాలలో నొక కుసుమ ముగా విరియఁజేసిన ఆంధ్ర గ్రంథమాలాధికారులు శ్రీ శంభు ప్రసాదుగారికిని, ఆదరముతో స్వీకరించియానందించిన యాంధ్ర విద్వల్లోకమునకును మేమెంతో కృతజ్ఞులము.

1948 లో అచ్చువేసిన ప్రతు లెన్నడో ముగిసిపోయినవి. కాని నేఁటిదనుక తెలుఁగుమెఱుఁగులను పునర్ముద్రించిలోకమున కందింపఁజాలకపోయినందుకు మ మ్మాంధ్రలోకము మన్నించు గాకని కోరుచున్నాము. నేఁటి కాయవకాశము మాకు లభించి నది. ప్రభాకరకరస్పర్శచే మున్నువికసించిన సాహితీకుసుమ మిప్పుడీ క్రొంగ్రొత్తరూపమున మిమ్మలరించుచున్నది.

ఆమోదించి యానందింతురుగాకని కోరుచున్నాము.

ప్రకాశకులు.

విషయానుక్రమణిక

వ్యాసము		పుట.
౧.	తెలుఁగుఁదనము : తెలుఁగుసంపత్పితాయము ...	౧
౨.	ఆంధ్రభాషావతారము ...	౧౦
౩.	ఆంధ్ర కల్పవృక్షము ...	౧౪
౪.	ప్రాచీనగ్రంథముల పలుకుబడికి మనపై చెల్లుబడి ...	౩౬
౫.	తెనుఁగు తేటదనము ...	౩౭
౬.	ఆంధ్రకవిత - పురాణయుగము ...	౪౫
౭.	ఆంధ్రకవిత - ప్రబంధయుగము ...	౭౮
౮.	అరసున్న ...	౯౨
౯.	వింతనిఘంటువులు ...	౯౮
౧౦.	గ్రింథగ్రింథులు ...	౧౦౮
౧౧.	అవీ, ఇవీ ...	౧౩౬
౧౨.	తెలుఁగున ప్రథమావిభక్తి 'ండు' ఎట్టుపుట్టినది? ...	౧౫౯
౧౩.	ఎఱ్ఱాప్రెగడరామాయణము ...	౧౬౫
౧౪.	కవితాపారమ్యము ...	౧౭౧
౧౫.	ఆంధ్రలిపి సంస్కారము ...	౧౮౮

తెలుఁగు మెలుఁగులు

—

తెలుఁగుఁదనము-
తెలుఁగు సంప్రదాయము

తెలుఁగువారన్నను, ఆంధ్రులన్నను ఒకరే అన్న యెఱుకతో మాటాడుచున్నాను. తెలుఁగు సంప్రదాయ మన్నను తెలుఁగుతనమన్నను, ఆంధ్రసంప్రదాయమన్నను ఆంధ్రత్వమన్నను ఒకటే అని నా తలఁపు.

"ఆంధ్రద్రవిడకర్ణాటా మహారాష్ట్రాశ్చ గుర్జరాః"- ఈ అయిదుజాతులవారును పంచద్రావిడు లని ప్రాచీనులు పేర్కొన్నారు. ప్రాచీనకాలమునందు, ఇప్పటికిఁగూడ, ఈ యయిదుజాతులవారికిని ఆచారవ్యవహారములు, ఆహార విహారములు, కవితాగానములు, కులమర్యాదలు కొంత కొంతసరిపోలుచునే ఉన్నవి. ఔత్తరాహులయిన పంచగౌడులకు "సారస్వతాః కాన్యకుబ్జా గౌడా ఉత్కలమైథిలాః" అని పేళ్లు. వారు చాల విధములందు పంచద్రావిడులతో భేదింతురు. పంచ

ద్రావిడులలో నేఁడు, ఆంధ్ర ద్రవిడ కర్ణాటులు మాత్రమే అత్యధికసంబంధముగలవారుగా ఉన్నారు. కాని, ప్రాచీన కాలమున, అనఁగా రెండువేలయేండ్లకుముందు, సాతవాహనులును ఇక్ష్వాకులును పాలించిననాళ్ళలో మహారాష్ట్రులు, గుర్జరులు కూడ ఈ మూఁడుజాతులతో చాల సన్నిహితసంబంధముగలవారై యుండెడివారు. ఆంధ్రుల నేఁటి యాహార సంప్రదాయమే పంచద్రావిడులయు నాహారసంప్రదాయమని శంకరాచార్యాదులు రచించిన పూజాస్తోత్రములలోని నైవేద్య క్రమవర్ణనశ్లోకములనుబట్టి గుర్తింపవచ్చును. శాల్యన్నము, నెయ్యి, పప్పు, కూరలు, పచ్చళ్ళు, దప్పళము, పెరుగు ప్రధానాహారపదార్థములుగా శ్లోకము లున్నవి. ఇప్పటికిని ఆంధ్రుల యాహారపద్ధతి ఇదేకదా.

ప్రాచీనకాలమున తెలుఁగువారికి పైఁటలు లేవు. అవి మహారాష్ట్ర గుర్జరుల సంబంధమున, అప్పటి ఆంధ్రరాజధాని యయిన ప్రతిష్ఠానము (పైఠాన్)నుండి నాగరకతతో వ్యాపించినవి. పైఠాన్ పదభవమే పైఁట. ఆంధ్రస్త్రీవర్ణనమున సాతవాహనసప్తశతిలోను, ఇతర సంస్కృతకావ్యములందును కుచసౌభాగ్యము ప్రధానముగా వర్ణితమగును. మంకుకుని కావ్యమీమాంసలో ఆంధ్రస్త్రీలనుగూర్చి యీ శ్లోకమున్నది:

"కేశాః సపుష్పగండూషా జఘనే మణిమేఖలా,
హ్రీర్గోరక్తోఽంశుకం శుభ్రం వేషః స్యాదంధ్రయోషితామ్."

సదు క్తికర్ణామృతాదులలోఁగూడ ఆంధ్రస్త్రీవర్ణనములున్నవి.*

పువ్వులను పుక్కిలించు కొప్పు, మణిమయమయిన యొడ్డాణము, రక్తహారము, తెల్లచీర ఇది తెలుఁగునెలఁతవేషము అని పై శ్లోకమున కర్థము. భర్తృమేణ్ఠాది సంస్కృతకవులు ఆంధ్రులను గూర్చి చెప్పిన శ్లోకములకు ఆంధ్రస్త్రీలు సౌందర్యవతులని, నృత్యగానప్రియలని, అమాయికలని అర్థసారము. ఆంధ్రుల సంగీతసాహిత్యములతో తొలుత మహారాష్ట్ర కర్ణాటకుల కధికసంబంధ ముండెడిది.

---

*సదుక్తికర్ణామృతమునను౦డి —

వాచో మాధుర్యవర్షిణ్యో నాభయః శిథిలాంశుకాః,
దృష్టయశ్చలద్భ్రూకా మండనా న్యన్ధయోషితామ్.(భర్తృమేణ్ఠస్య)

ఆమూలతో వలితకున్తలచారుచూడః
చూర్ణాలకప్రకరలాంఛితభాలభాగః
కష్టానివేశనిబిడీకృతనీవి రేష
వేష శ్చిరం జయతు కున్తలకామినీనామ్. (రాజశేఖరస్య)

వాక్ సత్త్వాంగసముద్భవైరభినయై ర్నిత్యం రసోల్లాసతో
వామాంగ్యః ప్రణయన్తి యత్ర మదనక్రీడామహానాటకమ్,
అత్రాన్ధ్రీ స్తవ దక్షిణేన త ఇమే గోదావరీస్రోతసాం
సప్తానామపి వార్నిధిప్రణయినాం ద్వీప్తానరాళశ్రియః.(రాజశేఖరస్య)

మానసోల్లాసమునను౦డి —

కాశ్చి త్కుంతలకామిన్యః కుటిలీకృతకున్తలాః,
కాశ్చి ద్ద్రవిడకామిన్యః ప్రకాశితపయోధరాః
మహారాష్ట్రస్త్రియః కాశ్చిత్ లంబలోలకభూషితాః
ఆంధ్రనార్యో వరాః కాశ్చి దపసవ్యోత్తరీయకాః
గుర్జర్యో వనితాః కాశ్చి దాపాణిక్యతకంచుకాః.

సంగీతమున ఆంధ్రదేశి సంప్రదాయభేదములు కొన్ని మతంగువి బృహద్దేశిలో వివరింపఁబడినవి. తెలుఁగువారిలో వివాహములందు మంగళసూత్రము కట్టుట అనాది యాచారము. ఈ యాచారము ఉత్తరదేశీయులకు లేదు. ఆర్యుల గృహ్యసూత్ర గ్రంథములలో లేనేలేదు. ప్రాచీనకాలముననుండి ఆంధ్రస్త్రీలకు వివాహములందు తాటియాకును చుట్టగాఁజుట్టి పసుపుపూసి నూలిబొందుతో కట్టి వధువుకంఠమున వరునిచే మూఁడుముళ్ళు వేయించుట యాచారము. కనుకనే దానికి తాళిబొట్టని పేరయ్యెను. తాళి యనఁగా తాడియే. అట్లే ఆంధ్రస్త్రీలు చెవులకు కమ్మలను, అనఁగా తాటియాకులనే చుట్టిపెట్టుకొనుట యాచారము. 'తాటాకు' పదమే సంస్కృతమున తాటంక మయినది. దానికి తెలుఁగున 'చెవాకు' అనికూడ పేరున్నది. తాటియాకులను చెవుల కమ్మలని ధరించుట, తాళిబొట్టు కట్టుకొనుట తెలుఁగువారినుండి కడమ ద్రావిడులకు సంక్రమించినవి. ఇట్లనుటకు తాళి, తాటంక, కమ్మ, చెవాకు పదములే సాధకములు. తాడి కమ్మ తాటాకులు తెలుఁగుపదములే కదా. తెలుఁగువారికి తాడిచెట్టు కల్పవృక్షము! తెలుఁగువారిలో మాలలు, మాదిఁగలు, రెడ్లు, వెలమలు, కమ్మలు, కాపులు, కోమట్లు, రాచవారు, వెలనాట్లు, వేఁగినాట్లు, తెలుగాణ్యులు, నియోగులు మొదలయిన యంతర్విభాగములు గల యష్టాదశ జాతుల ప్రజలలో సామాన్యధర్మములుగా నీ క్రిందివి కానవచ్చును.

"ఆతిథ్య గౌరవంబును,
స్వాతంత్ర్యప్రియత, స్వల్పసంతోషము, దు
ర్నితివిహీనత, నైచ్యా
పేతత్వము నంధ్రులందు పేర్వడు గుణముల్.
ఓర్వరు మాయమర్మము స
ముజ్జ్వల ధీమహిమంబు పేర్వడన్
నేర్వరుగాక విద్దియలు,
నెయ్యము తియ్యము చూచుకొంద్రు, లో
గర్వము తక్కువే, యయిన
గండ్రితనంబునఁ గానవత్తు, రా
యుర్వపురుజ్జ్వలుల్ బలస
మున్నతు లెన్నఁగ నాంధ్రపుత్రకుల్."

తెలుఁగువారి స్వరూపస్వభావములతోపాటు భాషా కవితా గాన రీతులలోని ప్రత్యేక లక్షణములుగూడ పేరొక్కనఁదగినవి. తెలుఁగువారి శబ్దోచ్చారము తక్కిన ద్రావిడుల యుచ్చారముకంటె సుందరమయినది. కనుకనే "తెలుఁగు తేట" అన్న నానుడి యేర్పడినది. తెలుఁగుదేశపు శీతోష్ణస్థితులు మంచివగుటచే తెలుఁగువారి ముఖముద్ర స్పష్ట వికాసము గలది. వారి ఆహారవిహారములు బలిషములగుటచే దృఢగంభీరరీతులు గలది వారి యుచ్చారము. వేదోచ్చారమున నాంధ్రద్రవిడులే భారతదేశమంతటికిని ప్రఖ్యాతిగన్నవారు. తెలుఁగుభాష కున్నన్ని యక్షరములు తక్కిన యే ద్రవిడ భాషకుఁగాని లేవు. తెలుఁగుపలుకులు ప్రియికముగా అజం

తము లగుటచే ప్రతిపదము విభిన్నముగా వ్యవహరింప వీలగును. ద్రుతపుచ్ఛము కొన్ని పదముల కుండుటచే నది తర్వాతి యజాదిపదములతో సుఖసంధ్యుచ్చారము గూర్చునదై హృద్యత గొల్పుచున్నది. గసడదవాదేశము, సరళాదేశము శబ్దముల కటూచ్చారమును దొలఁగించుచున్నది. ద్రవిడపదముల యచ్చమెత్తదనముగాని, సంస్కృత పదముల ప్రౌఢ గాఢ క్లిష్ట వాక్చరములుగాని లేక, యరవమెత్తదనమును, సంస్కృతపు బింకమును గొంతకొంత కూర్చుకొని, దేశి తత్సమ తద్భవ పద పౌష్కల్యముతో తెలుఁగుభాస ద్రావిడభాషా కుటుంబములో లేఁబ్రాయపు జిలిబిలిపలుకుల పొలఁతియై వన్నె కెక్కినది. ఇటు వంటి భాషాపరికరముగల తెలుఁగువారి కవితయు కొంత విశిష్టలక్షణములు గలది. తెలుఁగుకవిత ప్రాయికముగా సంస్కృతానుకారియేయైనను నందులో నెంతో విశిష్టతకూడ కలదు. నన్నయ, తిక్కన, ఎఱ్ఱన యను కవిత్రయము గోదావరి, కృష్ణ, పినాకిని యను నదీత్రయమువోలె తెలుఁగువారికి జీవనాధార మయినది. గోదావర్యాది నదీత్రయము శాఖోపశాఖలతో కాల్వలై పాయలై పాటి తెలుఁగునేలనెల్ల పాడిపంటలతో సుక్షేత్రపఱిచినట్లు, కవిత్రయకవిత శ్రీనాథ పోతనాది సర్వాంధ్రకవిపరంపర యొక్కయు హృదయక్షేత్రములందు రసధార పాఱించి దివ్యకావ్యసస్యములను పండించినది; నేఁటి నవకవిహృదయక్షేత్రములందును పాఱుచు పండించుచున్నది. కవిత్రయము వారు దైవభక్తులు, సదాచారులు, ఉత్తమపండితులు. వారి రచనలలో జుగుప్సితము, నీతిదూరము నగు కూర్పుతీరు కానరాదు. వారి దివ్యకావ్యసృష్టి సర్వాంధ్రకవిమండలికిని

మేలుబంతియై సత్కావ్యసంపదాయము కొనసాగించుచున్నది.నన్నయ ధర్మోపాఖ్యానములు, నన్ని చోడని దేసిమలుఁగులతెలుఁగులు, తిక్కన మర్మకవితలు, ఎఱ్ఱన కృష్ణ బాలక్రీడాది వర్ణనసౌభాగ్యములు, పోతన భక్తికవితామృత ధారలు, శ్రీనాథుని యాంధ్రదేశ శిసౌందర్యవర్ణనా, శయ్యా సౌభాగ్యకల్పనాహ్లాదములు, పెద్దనతిమ్మనల మనోజ్ఞ ప్రబంధ సృష్టులు, సూరన రామకృష్ణుల శాలీన నిగమశర్మాది కథా కల్పనా విశేషములు, సోమ రంగనాథ గౌరనల ద్విపదరచనా సారస్యములు, సుమతి భాస్కర వేణుగోపాలాది శతకకవితా చమత్కారములు, వేమన్న వినోదవిమర్శపుటూటవెలఁదులు తెలుఁగువారికి నిస్సామాన్య సాహిత్య భాఁడాగారములు. తెలుఁగువారి భక్తిమయ జీవితమునకు పోతరాజు, త్యాగరాజు, గోపరాజులు జీవగట్ట లయినత్రిమూర్తులు. ఈ త్రిమూర్తులలో కడపటి యిద్దఱి గేయములు తెలుఁగువారి కమృతధారలు. తెలుఁగు కవులలో ప్రాచీనులు కొందఱు తెలుఁగుదేశము యొక్కయు, తెలుఁగు ప్రజలయొక్కయు విశిష్టతను వర్ణించిరి. ప్రధానముగా శ్రీనాథుఁడు కాశీ, భీమఖండములలోను, జక్కన విక్రమార్క-చరిత్రలోను, సోమనాథుఁడు పండితారాధ్య చరిత్ర లోను, అజ్జరపు పేరయ ఉడయనంబివిలాసములోను ఆంధ్ర దేశ సౌభాగ్యమును వర్ణించినారు. అజ్జరపు పేరయకవి ఉడయ నంబి విలాసములో ఆంధ్రప్రజలను గూర్చి వర్ణించిన వర్ణనలే కొన్ని యిప్పుడు వినిపించుచున్నాను—

"భామ విను శ్రీమదాంధ్రభూభాగమనెడు
తారహారంబునకు సొంపు దనరుచున్న
మధ్యమణి చందమున మహామహిమదాల్చి
భూరి విభవంబు బెజవాడ పురవరంబు.

క్రొత్తబియ్యము కాయగూర లొబ్బట్లు సై
దంపు బూరెలు పంచదార తొలలు
వడలు నల్లంబు మీఁగడల తియ్యని పెర్గు
కమ్మని సిరివాలు గసగసాలు
చిఱుసెనగపప్పును తఱుచు వీడ్యంబులు
కంబళ్లు నంబళ్లు కంచుకములు
ఇంగువ జిలకఱ్ఱ నెనసిన మిరియంబు
సుంచివాసన నెయ్యి మాటదురుసు
తఱుచు రణశీల, మొప్పు గంధాక్షతములు
నంద మింపొందు శిఖలు, నొయ్యారి నడలు
కలిగి కాంతలు పురుషులు కలసి సిరుల
చెలఁగు నయ్యాంధ్రదేశంబు చెలువుగాంచె.

కదళీఫలంబులు ఖండశర్కరయును
పెనుపచ్చిపోకలు పనసతొలలు
మామిడిపండ్లు కమ్మని గోఘృతమ్ముము
వంకాయ చెంకాయ వలుపు పప్పు
బహువిధభక్ష్యముల్ పరమాన్నమును బ్రేళ్లు
కంద పెండలములు కాయగూర

లమృతోపమానంబు లైన రసావళుల్
శాల్యోదనము పెర్వు సకల రుచులు
గలుగు నూరుఁగాయలు బానకములు నప్ప
డములు వగుగులు వడియముల్ శ్రీమముదీర
ననుభవించిరి వేదశాస్త్రార్థవాద
ములకు నలరుచు కోనభూస్థలమునందు."

తెనుఁగుతనమును గూర్చి నా చిన్ని పద్దెము:

"ఆంధ్రభాష యమృత మాంధ్రాక్షరంబులు
మురువ్రలొలుకు గుండ్ర ముత్తియములు
ఆంధ్రదేశ మాయురారోగ్యవర్ధకం
బాంధ్రజాతి నీతి ననుచరించు."

౨

ఆంధ్ర భాషావతారము

అఖండస్ఫోటమై వెలయు శబ్దబ్రహ్మము ధ్వని తాదా త్మ్యాధ్యాసచే నానాదేశములందు, నానాజాతిజనులందు బహు భాషలుగా, బహ్వర్థములతోఁ బరిస్ఫురించుచున్నది. ఆకసమున నుండి మేఘ మతినిర్మల మైనయంబువును వర్షింపఁగా నది యుప్పుఁబట్టులందు, రేవడి చెలికలందు, మహౌషధీమయము లగు నరణ్యములందు, రసధాతుభరితములగు పర్వతములఁదును బడి తత్తాదాత్మ్యముతో భిన్నరూపములను, భిన్నరుచులనుబొందుచు జాలువాటి కోళ్లు, సెలయేళ్లై, వంకలై, వాఁగులై, నదులై, మహానదులై ప్రబలములై న భేదములఁ బడయుచున్నది. భాషల పుట్టుపూర్వోత్తరములు గూడ నిట్టివే.

సహ్యాపర్వతమునఁ దొలుత జాలువాఱుటలో సమాన లక్షణములు గలవై యున్నను కృష్ణా కావేరీ నదులు ఆంధ్ర దేశమునకును, అటవి దేశమునకును సాగనుసాగను విభిన్న లక్షణముల వెలసివేఁసి వేఱువేఱు తీరులను, వేరులను బడసి నట్లుగా ఆంధ్ర ద్రవిడ కర్ణాట భాషలు తొలుత (ఆంధ్ర ద్రవిడ కర్ణాటులని నేఁడు విభిన్నులుగా నున్నవా రొకప్పు డొక్క చోట నొక్క సంఘముగానుండి వెడలి వేఱుపడినవారే యని నా నమ్మకము.) నొక్కటిగానే యుండి కాలక్రమమున భిన్న

భిన్న దేశములఁ జెంది భిన్నభిన్నత్వములఁ బడసినవి. ఆంధ్రద్రవిడ కర్ణాటభాషల నేఁటి స్వరూపము లెంత భిన్నములుగా నున్నను, పూర్వపూర్వమును బరిశోధించుచుఁ బోవనుబోవను వాని భేదములును దక్కువ తక్కువ లగుచుండుట తెలియనగును. ఇట్లు చూడఁగా రెండువేల యేండ్లకుఁ బూర్వ మీ భాషల పృథగ్భావము విస్పష్టలక్షణములతో వెలసియుండకపోవుట గోచరించును.

వర్షోదకము నేలపైఁ బడినప్పుడు మట్టితోఁ గలసి వండువాఁటి తేటదనము, తేలికదనము లేక కలుషమై, యస్వరసమై యుండునట్లు భాషకూడఁ దొలుత శబ్దరూపోచ్చారణాదులందుఁ దేటదనము, తేలికదనము, హృద్యత లేక క్లిష్టమై యుండును. కాలక్రమమున నా నీరు ఏళ్ళలోఁ గోళ్ళలోఁ బడి నదులై ప్రవహించుచుఁ దేటవాఁటి నడుమ నడుమ గుంటలలోఁ గోనేళ్ళలో నిలువరమంది ప్రసన్నమై రుచ్యమై యొప్పును. అట్లే భాషకూడఁ గాలక్రమమున సాధూచ్చార సంస్కారమంది, అందందు గ్రంథములందు నిబద్ధమై నిలువరమంది, స్వచ్ఛమై, యాస్వాద్యమై వెలయుచుండును. వ్యవహారప్రవాహమున భాష వడివడిగాఁ బరిణామ మందుచుండును గాని యది గ్రంథనిబంధము నందిన పిదపఁ గొంత కట్టుదిట్టమును బడసి నిలుకడఁ జెందును. ఆవలఁ దత్పరిణామము పూర్వమంతత్వరగా సాగదు. ఆంధ్రద్రవిడ కర్ణాటభాషల యారంభ మొక్కటియే యైనను, సంస్కృత ప్రాకృతసంబంధ మల్పముగాఁ బడసి గ్రంథములందు నిబద్ధమై నిలువరమంది లక్షణపరిష్కారములను బడయుటలో

నఱవము మొదటి దయినది. ఆ నిలువరముమీఁదను, ఆ లక్షణ పరిష్కారములమీఁదను నాఁగక ఇంకను గొంతయుచ్చార వ్యవహారమునఁ బరిణామమును బొందిపొంది సంస్కృతప్రాకృతముల సాహాయ్యము నధికముగాఁ జెందిచెంది పెంపొంది గ్రంథములందు నిబద్ధమైనది కన్నడము. ఈ రెండింటి కింకను దర్వాత నీ రెండింటి లక్షణ పరిష్కారములతో నిల్వక యింకను నుచ్చారసంస్కారములఁ బడసి, సవరనయి యందచందముల నంది సంస్కృత ప్రాకృతముల సరససాహాయ్యమున నభ్యుచ్చ్రి యముఁ గాంచి గ్రంథములందు నిబద్ధమైనది తెలుఁగు. దక్షిణ హిందూదేశ సమష్టిదేశ భాషావధూటి పసిప్రాయపుఁబలుకు లఱవము; ఎల ప్రాయపుఁ బలుకులు కన్నడము; నెఱతనపుఁ బలుకులు తెలుఁగు. ద్రవిడ కన్నడములు తెలుఁగుకంటె వయసునఁ బెద్దవేకాని చిన్నదయినను తెలుఁగుభాషాకన్య కంద చందములు, పలుకు పొంకములు హెచ్చు. అఱవ పదములకును దత్ప్రత్యయములకును, కర్ణాట పదములకును దత్ప్రత్యయములకును నుచ్చారణమునఁ దోఁచు కార్కశ్యము నాఁటనాఁట దొలఁగి తొలఁగి సవరనయినయుచ్చారణమును బడసిపడసి తెలుఁగు పదములును, ప్రత్యయములును వెలసినవి. ఉచ్చారణ సుందరములయిన తెలుఁగుపలుకుల పూర్వ పూర్వ పరిణామ క్రమదశలలో ద్రవిడకర్ణాటపదరూపములు రెండునుగాని, రెండింట నేదే నొక్కటి గాని పొందియుండుట పెక్కుచోట్లఁ గాననగును.

పై యుభయభాషా సంబంధము లేనివి యచ్చపుఁ దెలుఁగుఁబలుకులు, ప్రత్యయములు గొన్ని యున్నవి. ఇవియే

కాక, సంస్కృతప్రాకృతోభయభాషోచ్చారణక్రమపరిణామముల బొందినవియు, ప్రాకృత మాత్రోచ్చారణ క్రమపరిణామములఁ బొందినవియుఁ గూడఁ బెక్కుపలుకులు, ప్రత్యయములు తెలుఁగునగలవు. ఇట్టివెల్లను గూడి సుకుమారోచ్చారసంస్కారములను బడసిపడసి వానికంచె వైలక్షణ్యమును బొంది మన తెలుఁగు వెలుఁగొందుచున్నది. మీఁదఁ బేర్కొన్న విషయమున కుదాహరణముగా నొక పదమును బరిశోధించి చూపుదును.

'నూనె'—ఈ పదము 'నూవు', 'నెయి' అను పదముల సమాసము. 'నూవులనెయి'—అనగా 'నూవులసారము' అని అర్థము. ఇందు 'నూవు' అనుపదము ద్రవిడ కర్ణాట భాషల సంబంధ మేమాత్రమును లేని యచ్చపుఁ దెలుఁగుఁబలుకు. నూవులకు అఱవమునను, గన్నడమునను 'ఎళ్' అని పేరు. నెయ్' అను పదము ద్రవిడమునను, కర్ణాటకమునను గూడఁ గలదు. కాని యది కర్ణాటకమున 'నే' 'నేయ్' ఇత్యాది రూపములఁ గూడఁ బొందియున్నది. తెలుఁగున ఉచ్చారణపరిణామములలో నసుందరమయిన హలంతత్వము దొలగిపోయి 'నెయి', 'నెయ్యి', 'నేయి', 'నేయు', 'నై', 'నే' అను రూపములు వెలసినవి. 'నెయ్' అను రూపమునకంచె నీ రూపము లుచ్చారణ సుందరములు. తెలుఁగుభాష హలంతత్వము నేవగించును గాన 'నెయ్'ని అజంతముగాఁ జేసికొనుటలో 'ఇ'ని జేర్చుకొనఁగా 'నెయి' అయ్యెను. 'నెయ్' పదము అజాదిపదములు పరమయినపుడు 'నెయది' అను రూపము ఉచ్చారణసహము గాదు గాన, 'నన్+అది=నన్నది,' 'అన్+అతఁడు=అన్న

తఁడు' అను రూపము లందినట్లు, 'నెయ్యది' ఇత్యాది రూపముల నంది, అట్టి సంధినుండి పదచ్ఛేదముఁ బడయుటలో 'నెయ్యి' అను రూపమును బొందెను. ఏకలఘుపూర్వక హల్మాత్రము గల శబ్దములు ఉచ్చారణపుష్టి గలిగియుండవు గావున హలు చ్చారణబలము పూర్వహ్రస్వమునకుఁ దన్ని దానిని గురువు నుగాఁ జేసి యంతలోఁ దాను గరఁగిపోవఁగా 'నే' అనురూప మేర్పడెను. ఆ కరఁగిన హల్మాత్ర యకారము అజాది పద ములు పరమగునపుడు వానితోఁగలసి యకారముగా నిలువఁ గల్గుచున్నది గాన దానిపై నజంతత్వపుఁ జికిలి జరగఁగా కొంత దుర్బలమయిన యుచ్చారముగల యకారముతో 'నేయు', 'నేయి' అను రూపము లేర్పడెను. హల్మాత్రమగు యకారము దుర్బలమగుటచేతనే 'నెయ్యి' అను రూప మేర్పడినట్లు 'నేయ్యి' అను రూపము పుట్టఁజాలక పోయెను. 'నెయ్'లోని 'య్' 'ఐ' గా మాఱఁగా 'నై' అను రూపము పుట్టెను. వైరూపము లందు 'నేయి', 'నై' రూపము లర్వాచీనములు. ఇట్లు 'నేయ్' శబ్దముపై నేర్పడిన బహుసుందరపరిణామములెల్ల మన తెలుఁ గునఁ గలవు. 'చెయ్, వెయ్' మొదలగు శబ్దములు గూడ నిట్టి పరిణామములఁ బొందెను. శబ్దముల ప్రాచీనరూపములకుఁ దాఁతలనాఁటివన్న గౌరవముండగా నర్వాచీనరూపములకు హృద్య సంస్కారముల ననేకములఁ బడసి వెలసిన వన్న వేఱొక గౌరవ విశేషము గలదు. ఆంధ్రుల కాచారవ్యవహారస్వరూప స్వభావాహారదేశలక్షణాది బహుకారణములచేఁ గల్గిన భిన్న భిన్న లక్షణముల కనుగుణముగా నేర్పడిన శబ్దరూపములను మీఁదఁ జూపితిని. 'నెయ్'శబ్దము తెలుఁగులో నిన్నిహృద్య

రూపముల నందినది గాని యిది 'నూవు' శబ్దముతో సమాస మందినప్పుడు కొన్ని ప్రాకృతభాషాసంబంధ సంభవములైన వికారములకుఁ గూడఁ బాల్పడెను. 'నూవు' శబ్దము తొలుత 'నూవ్' అను రూపము గలది. తెలుఁగు హలంతత్వము నేవగిం చుకొనును గాన నది 'నూవు' అను రూపమును బడసెను. ఆ హల్మాత్రము కరఁగిపోవుటచే 'నూ' అను రూప మేర్పడెను. కరఁగిపోయిన యా హల్మాత్రమయిన 'వ్' అచ్చు పర మయినప్పుడు మరలఁ గానవచ్చును. 'నూ+నెయ్' పదములు రెండును సమసింపఁగా, 'నెయ్' పద మెన్ని రూపములతో నున్నదో, అన్ని రూపములతోను ఆ సమాసముండుట న్యాయ్యము. అనఁగా 'నూనెయి', 'నూనెయ్యి', 'నూనే', 'నూనేయి', 'నూనేయు' 'నూనై' ఆను రూపములు గూడ నుండవలె ననుట. కాని యట్టిరూపములు తెలుఁగున పుట్టలేదు. దానికిఁ గారణ మేమనఁగాఁ 'నూనె' యనుసమాసపదము 'నెయ్' పదము మీఁదఁ బేర్కొన్న పరిణామముల నెల్లఁ బడయుటకుఁ బూర్వమే పుట్టి రూఢమైనది. అప్పుడు 'నూ+నెయ్' అని యుండి తెలుఁగునకుఁ బ్రియముకాని కడపటి హల్మాత్రము లోపింపగా సమాసదశలో నాపదము గురులఘు ఘటితమగుటచే 'నెయ్' 'నే' రూపమును బడయనక్కఱలేకపోఁగా 'నూనె' అయ్యెను. కరఁగిపోయిన కడపటి హల్మాత్రపు 'య్' అచ్చుపర మయినప్పుడు మరలఁ గానవచ్చును గాన 'నూనె'+'అది' కలసినపుడు 'నూనెయది' అయ్యెను. ఇట్టి యకారమునే తెలుఁగువై యాకరణులు 'యడాగమ' మని పేర్కొనిరి. ఇట్లు 'యడాగమ' మని పేర్కొనఁబడుచున్న స్థలములనేకము లట్టి పదాంత యకార

హల్మాత్రము ద్రవించిపోఁగా నచ్చు పరమయినపుడు మరలఁ గానవచ్చుటను బట్టి యేర్పడినవే. ఱట్టి దేశి శబ్దముల రూప సాజాత్యమును బట్టి యకారపుచ్ఛము లేనివయినను తెలుఁగునఁ జేరిన సంస్కృతప్రాకృత శబ్దములకును నట్టి యడాగమము పుచ్చెను: 'రమ+అది=రమ యది' ఇత్యాదులు.

పైనిఁ బేర్కొన్నవిధమున నూనె పదము తెలుఁగు సంప్రదాయపరిణామమునుబట్టి పుట్టియుండఁగా దాని మీఁద 'నూనియ' అను రూపము ప్రాకృతభాషా సంప్రదాయ మునుబట్టి పుట్టెను. 'కన్నియ' 'వన్నియ' 'దీవియ' మొదలయిన శబ్దములు కన్యకా, వర్ణక, దీపికా శబ్దాదులనుండి ప్రాకృత సంప్రదాయమునుబట్టి పుట్టి తెలుఁగునఁ జేరినవి. వీనికి 'కన్నె' 'వన్నె' 'దీవె' రూపములును గలవు. వీని పోలికనుబట్టి 'నూనె' శబ్దమునకుఁగూడ 'నూనియ' అను రూపమువచ్చెను. నూనె, నూనియ శబ్దములు పుట్టినతర్వాత వాని సాదృశ్యముచే 'తేన్' అని యజువమున రూపముగల 'మధు' వాచక శబ్దము తెలుఁగున 'తేనె', తేనియ' అను రూపములఁ జెందెను.

ద్రావిడ కర్ణాట ప్రాకృతభాషల పలుకుబడి నూనె శబ్దముమీఁద నెంత చెల్లెనో పై పరిశీలనమువలనఁ దెలియవచ్చెను. కాని యిందు సంస్కృతపు పలుకుబడి కూడ హెచ్చుగాఁగలదు. ఎట్లనఁగా 'నెయ్' అను పదము దేశి పదమని కొందఱన్నను 'స్నేహ'మను సంస్కృతపదమునకు వికృతియని కొందఱందురు.

ద్రవిడ భాషలో 'నెయ్' పదము 'సారము' అని యర్థము గలది. క్షీరములనుండి యెత్తిన సారమగు ఘృతమునకే తర్వాత నది రూఢమయినది. 'నూనె' యను సమాసమునఁ జేరుటచే నెయ్ 'స్నేహ' వాచకమైనది కాని యది స్నేహశబ్ద వికృతి కాక దేశిపదమే యగునని కొందఱు.

మఱియు, నూనె ఘను నర్థమునఁనే సంస్కృతమున 'తైల' పదము గలదు. తైలపదము శబ్ద నిష్పత్తిని బట్టి నూవుల సారమునకే వాచకమయినను స్నేహసామాన్యమునకును చెల్లు చున్నది. తిలతైల, ఐరండతైల భల్లాతక తైలాదులు చూడఁదగును. నూనె పదముగూడ నిట్లే తిల స్నేహవాచకమే యయి నను, స్నేహ సామాన్యమునకును జెల్లుచున్నది.

నూవులనూనె, కొబ్బరినూనె, వలిసెలనూనె ఇత్యాదులు చూడఁదగును. అఱవమునఁగూడ నూనెకు 'ఎళ్ నెయ్' 'ఎణ్ణెయ్' అని పేరు. ఆదికూడ స్నేహసామాన్య వాచకమే. 'తేఙ్గాయెణ్ణెయ్' ఇత్యాదులు చూడఁదగును. నూనెపదము తైల పదమువలె తిలస్నేహ వాచకముగానే పుట్టుట, అది స్నేహ సామాన్యమునకు వాచకమగుట సంస్కృతభాషా వ్యవహార సంప్రదాయ సంస్కారమును దెలుపుచున్నది.

3

ఆంధ్రకల్పవృక్షము

నా చిన్ననాఁటి మాట. మా గ్రామమున ఒక సంపన్న గృహస్థుఁడు తన గొప్ప తాటితోఁటను నఱికించి, ఆ తోఁట భూమికి కృష్ణ్యనుకూలత కల్పించినాఁడు. ఏమికర్మమో కాని కొలదికాలమునకే యాతని యింట నమంగళము లనేకములు కలిగినవి. ఊరి పెద్దలందఱు "తాటిచెట్టనఁగా భూలోక కల్పవృక్షము. అట్టి తాటిచెట్లను ఎన్నింటినో, ఎన్ని తరాలనాఁడు నాటినవానినో నఱికించినాఁడు; చెడినాఁడు" అన్నారు. నేను పదేండ్లబాలుఁడను. మా నాయనగారిని "ఇంకను కొబ్బరి చెట్టునో, మామిడిచెట్టునో అంటే అనవచ్చునేమో కాని తాటి చెట్టును 'భూలోక కల్పవృక్ష' మనుట యేమిటి" అని అడిగి నాను. ఆనాఁడు వారు చెప్పిన విషయమునే ప్రధానపఱుచు కొని, యిటీవల దానికి పోషకబలకముగా నాకు గోచరించిన విషయములను కూడ చేర్చుకొని యీ వ్యాసము రచించు చున్నాను.

పూర్వము ఆంధ్రదేశమున ప్రతి గ్రామమునను తాటి తోఁపులు ధర్మార్థము తప్పకుండ నాటు సంప్రదాయముండెడిది. ఊరి పెద్దలు ఎనుబది తొంబది యేండ్లు ముసలిపోయిను కల

వానిని వెదకి పట్టుకొని వానిచే తాటిగింజలు నాటించువారు. ఆ నాటినవాఁడు నాటిన తాడి కాపుపట్టులోఁగా తప్పక చని పోవునని ప్రతీతి. నాటిన తాటిచెట్టు ఇర్వదై దేండ్లకుఁగాని కాపుపట్టదు. నాటినవాఁ డంతదాఁక జీవింప వీలులేనివాఁడు గావుట కంత ముసలివానిని వెదకువారు. "ముతాడి" అనఁగా మూఁడు తాటిచెట్ల తరములు చూచినవాఁడు. వాఁడు దీర్ఘాయుష్మంతుఁడు. తన యెఱుకలో నాటిన తాటిమొలక పెరిగి, పండ్లుపండి, ఆ పండ్లగింజలను మరల నాటి, అవి పెరిగి పండ్లుపండి, వాని విత్తనములను మరల నాటి అవి పెరిగి పండ్లు పండుటకు, వాని ననుభవించుటకు మనుష్యుఁడు దీర్ఘాయుష్మం తుఁడు కావలెను. మంచి పంటలు పండని, నీటివసతి లేని యెగుడుదిగుడు నేలలుకూడ తాటితోఁపులకు పనికివచ్చును. నాటిన తాటిమొలకలకు నీళ్ళు పోయనక్కఱలేదు. మొక్క లెదుగుదాఁకనైన కాపు కాయనక్కఱలేదు. తక్కువ నేలలోనే దగ్గఱదగ్గఱగా ఎక్కువ మొక్కలు నాటవచ్చును. విత్తనము నాటినది మొదలుగా కాపుపట్టినదాఁకకూడ వానికై ధన వ్యయము ఏమియు చేయనక్కఱలేదు. నాటిన తర్వాత రెండు మూఁడేండ్లనుండి ఆకులు, మట్టలు మొదలగువానివలన యుప యోగము లుండును. పూర్వకాలమున నొక గృహస్థుఁడు కొన్ని తాటిచెట్లు కలవాఁడైతే కట్టుబట్టతప్ప తక్కిన జీవి తావశ్యకవస్తువు లన్నియు తాటిచెట్లనుండి సేకరించుకొని జీవ యాత్ర గడపుకోఁగలుగువాఁడు. కాపురమునకు నిట్రాడు గుడిసె వేసికొన్నచో తాడి దూలము నిట్రాడవును! గోడలు పెట్టి కట్టు ఇల్లైనచో తనాబీలు, దూలములు, స్తంభములు,

కొమరులు, గుజ్జులు, వాసాలు, పెండెలు అన్నింటికి తాటి ప్రమాను పనికివచ్చును. పైకప్పుకు తాటియాకులు పనికివచ్చును. కట్లు కట్టుటకు తాటినార పనికివచ్చును. ఇంట పఱచుకొనుటకు తాటియాకు చాపలు, సామానులు నిలువచేసికొనుటకు నానారకాల పెట్టెలు, బుట్టలు తాటియాకులతో చేయవచ్చును. నీళ్ళు చేఁదుకొనుటకు తాటియాకుతో బొక్కెనలను చేయవచ్చును. తాటినార చేతాళ్ళు మొదలగు ప్రాళ్ళు పేనుటకుపయోగపడును. తాటి మాఁకులను రెండుగా చీల్చి నీళ్లు పాఱుటకు దోనెలుగా చేయవచ్చును. ఈనెలు తీసికోసి కుట్టిన యాకులు విస్తళ్లుగా నుపయోగింపవచ్చును. తాటిముంజెలు, తాటిపండ్లు, తాటి (నిలువచేసిన పేసము) చాప, బుఱ్ఱగుంజు, తాటి తేగలు, తాటిబెల్లము, తాటికల్కండ, తాటిపానకము, తాటికల్లు ఆహార పానీయములకింద పనికివచ్చును. తాటిపండ్లు శిష్టులు ఆహారముగా నుపయోగింపరాదని నేఁటివారు కొంద అందురు. కాని దానికి పరిమాణము నే నెఱుఁగను. మున్ప్రాశమములో మునులు తాటిపండ్లను ఫలహారముగా నుపయోగించువారనుటను కాదంబరిలోని యీ కిందివాక్యము నిరూపించుచున్నది. జాబాలి మహర్షి యాశ్రమవర్ణనమున "ఉటజాజిర పరికీర్ణశుష్యచ్ఛ్యామాక ముపసంగృహీతామలక, లవలీ, లవంగ, కర్కంధూ, కదళీ, లికుచ, చూత, పనస, తాళఫల, మధ్యయనముఖరవటుజన" మిత్యాది.

తాటిమాని తుండ్లు జాతిజోళ్ళపై కుందులుగా నుపయోగపడును. తాటియాకులతో గొడుగులు గావింతురు.

తాటీ యీనెలు. జవటలు, జీబులు చీపుళ్లగును. గులకచండ్లు, ఎండుమట్టలు, జీబులు మొదలగునవి యెల్ల వంటచెఱకున కుపయోగపడును. ఈ పేర్కొన్న యుపయోగములెల్ల పామరనాగరకసాధారణ మైనవి.

ఇక తాటిచెట్టు ప్రాచీనాంధ్రుల నాగరకతకు జీవరథ. ఆంధ్రుల విద్యావిజ్ఞానములెల్ల తాళవత్రిగ్రంథ రక్షితములై యున్నవి. తాటియాకులను చక్కగా నీనెలు తీసి, చుట్టలు చుట్టి, పేడనీళ్ళలో తేలికగా నుడుకనిచ్చి, నీడనార్చి నేఁడు కాగితముల రీములు నిల్వచేసికొన్నట్లు పూర్వులు గ్రంథములు వ్రాసికొనుటకై 'అలేఖము'లను పేర నిలువచేసికొనెడివారు. జాబులను, భారత భాగవతాది గ్రంథములను వ్రాయుటకు నీ తాటియాకుల నుపయోగించువారు. శతాబ్దములదాఁక నీ తాటాకు గ్రంథములు చెడిపోక యుండెడివి. 'జాబు'కు 'కమ్మ' అను పేరు తాటియాకునుబట్టి వచ్చినదే. ఈ తాటాకులను స్త్రీలు కర్ణాభరణములుగాను, కంఠాభరణములుగాను (మంగళ సూత్రము), చేతులలోను జబ్బలలోను మంత్రాక్షరములు గల రక్షాబంధములుగాను పూర్వముపయోగించువారు. 'తాటంక' పదమునకు పాణిని సూత్రములలో నిష్పత్తిలేదు. తర్వాత 'ఉణాది' సూత్రములలో దానికి వింతగా నిష్పత్తి కల్పింపఁబడినది. తిరుపతిలో కపిలతీర్థాది పుణ్యతీర్థములందు సువాసినులకు మూసివాయనములిచ్చునపుడు ఆ మూసివాయనపు సామగ్రిలో తాటియాకుల చుట్టలనుగూడ ఉంచుదురఁట! ఆ చుట్టలు కంఠ, కర్ణాభరణ స్థానీయములు.

ఇవిగాక యింక నెన్నేని ప్రయోజనములను మన పూర్వులు తాటిచెట్టువల్ల పడయువారు. తాటిచెట్టు (నేఁడు కాకపోవచ్చుఁగాక) పూర్వకాలమున తెలుఁగువారికి కల్పవృక్ష మనుట సంగతమే కాదా?

ఎఱ్ఱాప్రెగ్గడ హరివంశములో తాటిచెట్టు నిట్లు వర్ణించి నాఁడు.

"వ. అప్పుడు—

శా. కాలాహుల్ బుజుతావిచిత్రియగు భో
గశ్రేణి శోభిల్లఁ బా
తాళం బొక్కట నిర్గమించి వికస
ద్దర్వీవికాసంబుతోఁ
గేళిం గ్రాలెడినో యనంగఁ దనువుల్
గృష్ణంబులై యొప్పఁగా
ఖేలన్మార్ధము లైన తాళతరువుల్
కృష్ణుండు వీక్షించుచున్.

మ. క్రిమిపాకంబునఁ గెంపుతోడి నలుపె
క్క న్నిక్కుటంబైన గం
ధము దిక్కుల్ సురభీకరింప రస మం
తర్గామియయ్యు న్వెలిం
గమియం గాఱుచునున్న చాడ్పున విలో
కప్రీతి గావింప హృ
ద్యములై యున్నవి చూచితే ఫలము లీ
తాళద్రిమశ్రేణులన్.

తే. వీని నింపార గోవులు నేను గూడి
యెలమి యెలయ నాస్వాదింతు మెతం యేని
వేడ్క యయ్యెడు రాల్పుము వేగవేగ
బ్రాకి నీ లావు వెరవును భాసితముగ.

క. ఎక్కఁ దడవు తాడుల మొద
లక్కజముగఁ బట్టి యూఁతు నవె యేటికొనుం
డెక్కుడుగఁ బండ్లు మీ రొ
క్కొక్కని గుడువంగఁ జనుచు నుద్ధతలీలన్.

తే. ఒక్క తరవాయి దొరఁకొని యొకటి నొకటిఁ
బృథుభుజాదండములఁ బట్టి పెలుచ నూఁచెఁ
బెఱుక విఱువను నొల్లక యుఱక వన్య
హస్తి నిజహస్తమునఁ జెరలాడునట్లు."

తాటిపంటిని గూర్చి శ్రీనాథుని పద్యమొక్కటి—

గీ. "సంజకెంపును దిమిరపుంజంపు నలుపు
గమియ బ్రహ్మాండభాండంబు గరము మెఱసె
పరమపరిపాకదశ వృంతబంధ మెడలి
పతనమగు తాటిపంటితోఁ బ్రతిఘటించి."

తాటితోఁపుల వెలయించుట మహాపుణ్యకార్యముగా
ప్రాచీనులు తలఁచిరనుటకు ఆర్నాలేండ్లనాఁటి శాసనములు
రెండు:—

(దక్షిణహిందూదేశ శాసనముల ఓవ వాల్యూంలో ఱవ పేజీ).

౬౭౪ నెం. పిఠాపురము శాసనము:—

"...తల్లి ధరణి, మొదలుగాన యీ తాటి యెవ్వరు నాంటిరి వారు భూమి పఱిజలకు బుద్ధిన్ని మతివిశేషమున్ను ధర్మమున్ను చిఱుకుదురుగాను యీ తాడాకులనే పంచాంగములు, పురాణములు, శాస్త్రములు ధర్మకర్తలు వాఱిసి చదువంగాను అందున్నుండుంగాని బుద్ధిమాంటలం జెప్పరాదు గాన సకళధర్మాలకున్ను తాంటివృక్షమే మూలము."

(అదే పేజీలో ౬౭౫ నెం. శాసనము)

"సీ. నిండె నెవ్వనికీర్తి నిఖిలలోకంబులఁ
జంద్రికా విష్ఫార సాంద్రిగరిమ
ఉండె నెవ్వనియింటఁ బుండరీకాక్షుని
పాఱిణవల్లభయైన పద్మనయన
పండె నెవ్వని కృపాపాథోధి నిలయెల్ల
ధాన్యసంపూర్ణ వదాన్యయగుచు
మండె నెవ్వని కోపమహిమానలంబుచే
నరివీరగేహంబు లక్షణంబు

సౌమ్య సంవత్సరం మొదలుగాను పిఠాపురపు (సీ)
మ [అ?] రస్తున్న కుక్కుటేశ్వరంవాడ గయపట్టుగాన
యిది పుణ్యభూమి అని "చత్వారి పుణ్యతీర్థాని దుర్లభాని
దురాత్మనామ్, కేదార మర్కతీర్థంచ ప్రయాగఃకుక్కుటేశ్వరః"
ఈ పుణ్యస్థలమునందును [శివ] లింగమున్న సూర్యదేవ...
యా:లింగమున్న వారణాసి విశ్వేశ్వరలింగమున్న గవిరిదేవ
[త]ను సహితమైన ప్రతిష్ఠలు అయిదు చేయించి ఱాళ్ళ
కట్టించెను. ద్వాపరయుగమునాండు గొంతిదేవి ప్రతిషగాన
మాధవయ్య నగరు సున్నము చేయించెను. లక్ష్మీ దేవమ్మను
ప్రతిష్ఠ చేయించి ఱానగరు కట్టించెను. నాలుగు లతులున్న,
అఱవై వేలు తాళ్ళు నాటించెను. ఇటువంటి ప్రతిష్ఠలున్న
విష్ణుప్రతిష్ఠలున్న చేయించిన పుణ్యపురుషుడు గాన వాసిరెడ్డి
పోతినేండు జేయును (జ) దేవేంద్రుండవును—

మంగళమహా శ్రీ శ్రీ."



ప్రాచీన గ్రంథముల పలుకుబడికి మన పై చెల్లుబడి

కవిత్వము, సంగీతము, నృత్యము, చిత్రరచన ఏ దేశములో ఏజాతిలో పెంపొందుచుండునో ఆ దేశము, ఆ జాతి పాపప్రవృత్తులకు దూరమై ఉండునని, భగవదనుభూతికి దగిన పరిపాకముగలదై ఉండునని విజ్ఞులందురు. తెలుగుజాతి, తెలుగుదేశము పైకళలలో ముందడుగు వేయుచున్నదనియే నా నమ్మకము.

భారతదేశములోని అన్ని దేశభాషల సాహిత్యములును సంస్కృతభాషాసాహిత్యసంపద నాస్వాదించి జీర్ణించుకొని పుట్టి పెరిగినవే. మన తెనుగు సాహిత్యవాహినిలోకూడ తెలుగునాటివారి పలుకులతీరులు, తలపులతీరులు, కూర్పులతీరులు, ఫణితులతీరులు ఊట లూరగాఊరగా స్వతంత్రరచన లను సొనయేళ్లు కొన్ని జాలువాఱుచున్నను, సంస్కృతసాహిత్య ప్రవాహముకూడ అందులో ప్రధానముగా సాగుచునే ఉన్నది; నేటికిని. రేపటికిని ఉండగలదు.

'వెన్నవలెం గరంగు సుకవిత్వము' చెప్పినవారు శ్రీ శివశంకరశాస్త్రిగారు 'వకుళమాల' అని హృద్యకావ్యము నొక

దానిని కూర్చినారు. ఆ వకుళమాలలో గూడ భట్టుమూర్తి గారి యీక్రిందిపద్యపుసువాసన గుబాళించుచున్నది.

కమనీయద్యుతిధామమా విమలముక్తాదామమా సేమమా
కమలామోదకు, తత్సఖిసమితికిం గల్యాణమా తన్మరా
ళ మయూరీ శుకశారికల కెల్లన్ భద్రమా తెల్పుమా
ప్రమదారత్నము పేరుగా నెద నినున్ బాటించి ప్రార్థించెదన్.

కాళిదాసకవి మేఘసందేశమని క్రొత్తతీరు కావ్యము రచింపగా, హనుమత్సందేశమును మనసులో ఉంచుకొని రచించె నన్నారట నాటి విద్వాంసులు.

నన్నయభట్టుగారు మొదలుకొని చిన్నయసూరిగారి దాక ఎన్నికగన్న ఆంధ్రకవులు రచించిన ప్రబంధముల పలు కుబడి విద్యావివేకములు గల యాంధ్రప్రజల హృదయములపై విశేషముగా సాగుచున్నది.

రాములు, లక్ష్మణులు, భరతులు, రావణులు, విభీషణులు, సీతలు, కౌసల్యలు, కైకలు, మందరలు, ధర్మరాజులు, ఉత్తర కుమారులు, ప్రహ్లాదులు, హిరణ్యకశిపులు, గుణనిధులు, నిగమశర్మలు, వరూథినీప్రవరులు, కరటకదమనకులు, సుగాత్రీ శాలీనులు, ఆషాఢభూతులు, కీలోత్పాటులు మొదలగువారు పురాణపురుషులు, ప్రబంధపురుషులు నేడును అనేక స్థలములలో అనేకులు గుర్తింపబడుచున్నారు.

సామెతలు గ్రంథములలోని కెక్కినట్లు గ్రంథములలోని పద్యములుకూడ లోకవ్యవహారములలోని కెక్కినవి. అసలు

ఆంధ్రప్రజల నిత్యవ్యవహారములలోనే కవిత్వగానములు కల గలుపై యున్నవి. ఆంధ్రభాష పుట్టుకయే కవితా గానాత్మకము.

వినాయకచతుర్థి, నవరాత్రములు అను పండుగనాళ్ళలో బాలకులచే పద్యములు పాడించుట, ప్రబంధములు చేతఁబట్టించుట నే నెఱుఁగుదును.

ధర సింహాసనమై నభంబు గొడుగై త ద్దేవతల్ భృత్యులై
పరమామ్నాయములెల్ల వందిగణమై బ్రహ్మాండ మాగారమై
సిరి భార్యామణియై విరించి కొడుకై శ్రీగంగ సత్పుత్రియై
వరుసన్ నీ ఘనరాజసంబు నిజమై వర్ధిల్లు నారాయణా.

ఇత్యాది పద్యములు నేను చాల పసిప్రాయమున నేర్చుకొన్నవి. వివాహములలో రుక్మిణీకల్యాణ పద్యములను ముత్తయిదువలు ఆనందభైరవిరాగముతో నాలాపించుచుండుట అనేకులెఱుఁగుదురు. బడిపిల్లలు వాటపద్యాలు, ఆటవిడుపు పద్యాలు అను పేర ప్రబంధ పద్యములు వల్లించుట పల్లెటూళ్ళలో పరిపాటి. పెళ్ళిళ్ళలో వరునిచేత తాటాకుల మీఁద, ఇటీవల కాగితాలమీద "శ్రీయును కులమును రూపము ప్రాయము శుభలక్షణంబు"—ఇత్యాది పద్యములను వ్రాయించుట ఆచారము. తెల్లవాఱుగట్ల ప్రబంధములలోని దశావతారపద్యములను పలువురు పల్లెటూళ్ళలో పారాయణము చేయుచుందురు. రంగనాథ రామాయణ ద్విపదలే రామాయణపు బొమ్మలాటలలో తోలుబొమ్మలాటఁ వారు పాడు పాటలు; కనుకనే పల్లెటూళ్ళలో

వారు రంగనాథ రామాయణమును బొమ్మలాట రామాయణమనుచుందురు. పైవుల శుభాశుభ సమయములలో బసవపురాణమును పారాయణ చేయుదురు. వానలులేనప్పు డూరిపెద్దలు విరాటపర్వమును పురాణము చెప్పింతురు. ఇవి సాహిత్య ప్రయోజనములకే కాక మతసంప్రదాయ వ్యవహారప్రయోజనమునకై కూడ పర్వడిన ఆచారములు.

పాత్రసంశుద్ధి కాజ్యం బుపస్తరించి
యూరకుండిరి యిది యేమియొక్కొ వీరు
కానరా విప్డు శాకపాకములు నెదుర
మనకు నిజమయ్యె నల చందమామఘుటిక.

శ్రీనాథుని భీమఖండములోని పద్యపద్యము "చంద మామరావే, జాబిల్లిరావే" అన్న పసిబాలకుల పాటనుబట్టి పుట్టినది.

బాలకుల పాటతో పై పద్యార్థము మిళితమై ఉన్నది.

నా చిన్ననాఁటి ముచ్చట ఒకటి: ఏదో అల్లరిచేయఁగా మాయమ్మ నన్ను గట్టిగా కొట్టినది. నేను ఎక్కడనో ఉన్న మా నాయనగారిదగ్గఱ కేడ్చుచు వెళ్ళితిని. నాగొడవ వెళ్లబోసికొంటిని. నే నిఁక ఇంటికి రానంటిని. అమ్మ మొగము చూడనంటిని. కాశీఖండములోని గుణనిధి కథ చెప్పి మా నాయనగారు అందలి పద్య మిది చదివి వినిపించి అర్థము చెప్పిరి.

అరుణగభ స్తిబింబ ముదయాద్రిపయిం బొడతేర గిన్నెలో
పెరుగును వంటకంబు వడపిం దెలునుం గుడువంగఁ బెట్టు ని
ర్భరకరుణాధురీణ యగుప్రాణము ప్రాణము తల్లియున్న దే
హరహర యెవ్వరింకఁ గడుపారసి పెట్టెద రీప్సితాన్నముల్.

అమ్మప్రేమ ఆకళింపునకురాఁగా తలగోఁకుకొనుచు పడుపు దిగమ్రింగుకొని నే నింటికి వచ్చితిని.

తెలుఁగురచన లనఁగా చిన్ననాఁటనుండియు నాకు బులుపాటము. తెలుఁగు పద్యములు వినుటకై చెవి కోసికొను వాఁడను. గుజ్జనగూళ్ళతోపాటు తెలుఁగురచనల తీయఁదనమును గూడ మా నాయనగారు నన్నాస్వాదింపించినారు. మా తోఁబుట్టువును అత్తవారింటికి అనిపిన సందర్భమున ఒకనాఁడు శ్రీనాథుని శృంగారనైషధములోని ఈ క్రింది పద్యము చదివి అర్థము చెప్పినారు:

ఉభయవంశలలామ మయ్యుత్పలాక్షి
అత్తవారింటి కరిగెడు నవసరమున
మాతృజనక సభోజన భ్రాతృవిరహ
మధిపతిప్రేమ జలరాశి కౌర్వమయ్యె.

అర్థ మాలోచించినకొలఁది ఈ పద్యము నా కానందము గొల్పసాగినది. శ్రీనాథుని రచనలమీఁద నాకు చిన్న నాఁటనుండియు ఆదర మిట్టి పద్యములు వినుటచేతనే.

ఈనడుమ మా యింట నొక వివాహము జరిగినది. భోజన సమయమున నసాళమంటు తాళింపు పొగరుగల పెరుగు పచ్చడిని ఆస్వాదించి నవ్యాంధ్రకవిమిత్రు లొకరు చదివినా రీ శృంగారనైషధపద్యమును :

మిసిమిగల పుల్లఁపెరుగుతో మిళితములగు
నావపచ్చళ్లు చవిసూచి రాదరమున
చుఱ్ఱుమని మూర్ధములు దాఁకి యొఱ్ఱఁదనము
పొగలు వెడలింప నాసికాపుటములందు.

ఇరువది యేండ్ల క్రిందట ప్రాచీనగ్రంథ సంపాదనకై తెలుఁగుదేశము ఊరూర 'టూరు' చేయుచు చాలకాలము విద్వద్గోష్ఠి జరిపినవాఁడను గనుక, ప్రాచీన గ్రంథార్థముల పలుకుబడి పల్లెటూళ్లలో ఎంత చెల్లుబడిఅగుచు ఉన్నదో నేను ఎఱుఁగఁగల్గినాను. కొన్ని యెఱుకలు వివరింతును.

ఒక సంపన్నగృహస్థునియింట ప్రాచీన గ్రంథములున్న వని విని అడిగి ఆహూతుఁడనై వారియింటికి వెళ్ళితిని. ఆ యింటి యజమానునికి ధర్మపత్ని సమానురాలు, కళావంతు రాలు, ప్రేయసి ఇంటనే ఉన్నది. నే నక్కడికి వెళ్ళఁగానే ఆమె మనుచరిత్రలోని యీ క్రింది పద్యమును సాదర ముగా, సంగీతముతో, సముచితహస్తాభినయముతో చదివినది.

వానిది భాగ్యవైభవము,
వానిది పుణ్యవిశేష, మెమ్మెయిన్
వాని దవంధ్యజీవనము,
వానిది జన్మము వేఱుసేయ కె

వ్వాని గృహాంతరంబున భ
వాదృశ యోగిజనంబు పావన
స్నానవిధాన్నపానముల
సంతసమందుచుఁ బోపు నిచ్చలున్.

నే నన్నాను : "తల్లీ నన్నొక యోగిని జేసితివి. తంటా లేదుగాని, నీ వల్లభుని వాస్తవప్రివరునిగాఁ జేయుట సందర్భ పడలేదమ్మా !— "

ఆమె అన్నది : "అయ్యగారూ ! నేను ప్రేమించినది వాస్తవముగా వాస్తపప్రవరునివంటివారినే. నా యేకాంత ప్రేమకు వశ్యులయిన యీ సహృదయులుకూడ వాస్తవ ప్రవరులనియే అనుకొనుచున్నాను. అయ్యో ! పాపము ! వరూధిని మాయాప్రవరుని ఎఱుఁగనే యెఱుఁగదు గాదండీ ! ఎంత ద్రోహము !

అయ్యా, ఇది చిత్తగించండి !

సీతాదేవిని రావణాసురుఁడు రామవేషము వేసికొని వచ్చి అమాంగళ్యపఱిచినట్లు ఏ కవి అయినను కథ కట్టినచో విజ్ఞుల కందరికిని వెఱ్ఱులు, వేకులు ఎత్తవండీ ! అంత రోతగానే కాదండీ ఉన్నది యిక్కడి సందర్భమూను ? ప్రవసునిమీఁదనే ప్రాణములర్పించి ఉన్న వరూధినిని, అంతకుముం దామెను ప్రేమించి ఆమెచే ఛీఛీ అని చీవాట్లుతిన్నదొంగ ప్రవరవేష ముతో వచ్చి చేటుకూర్చుట చండాలముగా లేదండీ ! వరూధిని

వెలయాలందురు! ఆమె ప్రవరుని ఏమి వెలకయి ప్రేమించి నది! వేషధారి ప్రవరుఁడు ఏమి వెల యిచ్చి ఆమెను కొనుక్కొన్నాఁడు! ఆంధ్రకవితాపితామహుని అనుగ్రహము అట్లున్నదే!" అన్నది.

నేను "చాల చుఱుకుగా ఉన్నదే సల్లాపము" అనుకొనుచు, "సంస్కృతము బాగుగా చదువుకొన్నట్టున్నావమ్మా" అన్నాను.

"మా నాయనగారు విద్వాంసులు. వారు నేర్పఁగా కావ్య నాటకములు కొన్ని చదువుకొన్నానండీ!" అనుచు నామె కాళిదాసు కవీంద్రునిమీఁదకూడ కంకరఱాళ్లు విసరసాగినది.

"చూడండి! శాకుంతలములో దుష్యంతునికి రంగప్రవేశము ఎంత సంతాపజనకముగా ఉన్నదో".

"తానేదో వేఁటకువచ్చినాఁడు. ఆశ్రమమున కణ్వ మహర్షి లేఁడు. ముగ్ధలు ఋషికన్యలు చెట్లకు నీళ్లుపోయుచున్నారు. అక్రమముగా ఆశ్రమప్రాంతమునకు వెళ్ళి, ధీరోదాత్తుఁడుగా పొగడ్తగాంచవలసిన మహారాజు దొంగచాటుగా నక్కఉండి ఆకన్యలను తొంగిచూచుట, 'సతాంహి సందేహపదేషు' అని తన తప్పును ఒప్పునుగా తానే పొగడుకొనుట మర్యాదగా ఉన్నదండీ! శకుంతల ముఖాన తుమ్మెదవ్రాలఁగా ఆపన్నురాలిని రక్షించి రాజధర్మము నెఱపఁబోవుచున్నట్టు

దర్పాలు పలుకుకొనుచు వంకరతలఁపుతో రంగప్రవేశము చేయుట బాగుగా ఉన్నదండీ ?" అన్నది.

నే నిఁక శ్రుతి మించుచున్నది అనుకొని సంస్కృతాంధ్ర రచనలలో ఆమెకుఁగల సాహిత్యచాతుర్యమునకు సంతోషము వెల్లడించి వచ్చినాను.

ఇంకొక ముచ్చట.

ఒక పూరియిల్లు ; చిన్నది ; తలుపు ఓరవాకిలిగా వేసి ఉన్నది. లోపల ముసలమ్మ వడ్లు దంచుచున్నది. రోఁకటిపోటుతో పాటు.

"ఓరామ ఓరామ ఒయ్యారిరామ !

ఓరామ ! ఓరామ !

ఓరామ ! ఓరామ !"

అనుచు ఉచ్ఛ్వాసనిశ్వాసములతో రామనామస్మరణ జోడించుచున్నది. మధ్యాహ్నము ఒంటిగంట వేళ. ఇంట నామె ఒక్కర్తెయే. తాటాకు పుస్తకా లేవో ఉన్నవనఁగా చూడవెళ్ళినాను. ఇంటిలోనికి అడుగు సాగక వాకిటనేఉన్నాను. కొంతసేపటికి దంపుడుముగియఁగా చేటలో దంచిన బియ్యము చేర్చుకొని చెఱుగఁబోవుచు ఈ క్రింపిపద్యము చదివినది :

కలఁడందురు దీనులయెడఁ
గలఁడందురు పరమయోగిగణముల పాలన్

ప్రాచీన గ్రంథముల పలుకుబడికి మనపై చెల్లుబడి
కలఁడందు రన్నిదెసలను
కలఁడు కలండనెడువాఁడు కలఁడో లేఁడో!

నాలుగవ చరణము గద్దించుచు మటి ముమ్మ్రాలు చదివి నది. ఇదేసందర్భమురా అనుకొని 'ఉన్నాఁడమ్మా' అనుచు నేను లోపలికి వెళ్ళినాను. ఆమె ఆబియ్యముతో అటుతర్వాత వంటచేసికొని భోజనము చేయఁబోవును. ఇట్లనుకొన్నాను: "ఆహా! పోతరాజుగా రెంత పుణ్యాత్ములు. భాగవత మెంద లోనో పవిత్రాత్మలనుగాఁ జేయుచున్నదిగదా!"

ప్రొనుదొరగారి కెవఁడో దీనుఁడు ఈ క్రింది పద్యమును అర్జిగా ప్రాసి పంపుకొన్నాఁడట.

లా వొక్కింతయు లేదు, ధైర్యము విలో
లంబయ్యెఁ, ప్రాణంబులున్
తావ;ల్ దప్పెను, మూర్ఛవచ్చెఁ, దనువున్
డస్సెన్, శ్రమం బయ్యెడిన్
నీవే తప్ప నితఃపరంబెఱుఁగ మ
న్నింపందగున్ దీనునిన్
రావే యీశ్వర! కావవే వరద! సం
రక్షింపు భద్రాత్మకా!

ప్రొనుదొరగా రా దీనుని కేదో కొంత సొమ్ముతోపాటు ఆ యక్షిమీఁదనే 'ఎండార్సుమెంటు' గా ఈ క్రింది పద్యమును ప్రాసి పంపినారట:

ఏను మృతుండ నౌదు నని
యింత భయంబు మనంబులోపలన్
మానుము సంభవంబు గల
మానవకోట్లకు చావు నిక్కమౌఁ
గాన హరిం దలంపు మిఁక
గల్గదు జన్మము నీకు ధాత్రిపై
మానవనాథ! చెందెదవు
మాధవలోకనివాససౌఖ్యముల్.

(బౌనుదొరగారికి కూడ భాగవత మింత పరిచిత మయినది!

ఇన్ని ఉదాహరణములను ఎందుకు చెప్పినానన(గా, మన తండ్రితాతల పోలికచాలికలు మనలో ఏవిధముగా అనుగతములై వచ్చుచున్నవో—మనము వేషభాష లెంతమార్చినప్పటికిని — మన పూర్వుల గ్రంథములలోని భావములు, సంప్రదాయములు, రచనలు—మన మెంత క్రొత్తత్రోవలు త్రొక్కఁజూచుచున్నప్పటికిని-మనలో ఎట్లు కుదురొక్కన్నవో తెలుపుటకే. వానిని మనము విడనాడలేము; విడనాడనూ కూడదు అని యెఱిఁగించుటకే.

౫

తెనుఁగు తేటదనము

తేటతెనుఁగునుగూర్చి కొంచెమంత తెలుపుచున్నాను. ఆంధ్రద్రవిడ కర్ణాటభాషలలో తెనుఁగుమాట ప్రసన్నమయి నదిగా ఉండుటచేత 'తెనుఁగు తేట' అనియు, 'తేటతెనుఁగు' అనియు, 'తెనుఁగుతేనె' అనియు, 'దేశభాషలందు తెలుఁగులెస్స' అనియు నానుళ్లు పుట్టినవి. తెనుఁగు కీ తేటదనము, లెస్సదనములు సంస్కృతప్రాకృతముల పాళ్లు సమరసముగా కలియుటవల్లను, ద్రవిడ కర్ణాటకములకంటె తెలుఁగు మాట మార్దవ, సౌలభ్యములు కలదగుటవల్లను ఏర్పడినవి. ఈ తేటతెలుఁగు చచ్చడివాని దగ్గఱనుండి జగద్గురువుదాఁక, ఉగ్గుపాలవాఁటినుండి ఉసురుడుగుదాఁక, బాలశిశుదగ్గఱ నుండి మోక్షవిద్యదాఁక అన్ని జాతులలో, అన్ని దశలలో, అన్ని విద్యలలో, క్షణక్షణపరిణామముతో, నవనవవికాసముతో కలకలలాడుచుఁ, దొలఁకులాడుచు నున్నది. హెచ్చుకాలము లిపిరూపము పొంది నిలిచియుండ నక్కఱలేని సంభాషణాదులు, నవ్వుటాలు, తగవులు మొదలయిన వాగ్వ్యాపారములను విడిచిపెట్టినప్పటికిని లిపిరూపముపొంది కొన్ని పురుషాంతరములదాఁక ఉండవలసిన వర్తకము, దేశపాలనము, ఆచారవ్యవహారములు, దస్తావేజులు,

రాజశాసనములు, దానశాసనములు మొదలయినవానిలోను, దేశము, భాష ఉన్నంతకాలము ఉండవలసిన కథలు, కళలు, పాటలు, పదాలు, నాటకములు, నానా శాస్త్రములు, కావ్యములు మొదలయినవానిలోన భాషాప్రవాహము పాయలు వాటి పాఱుచు, మాఱుచు, తేఱుచు కావ్యసరస్సులలో నిండార్లుగా నెలకొనుచు నుండును. భాష కున్న ప్రయోజనము లన్నింటిలోను ప్రౌఢకావ్యరచన పరమ ప్రయోజన మనవచ్చును. భాష చెందు క్రమపరిమాణపు మెట్లలో ఉత్తమ కావ్యరచన కడపటి మెట్టు. వాడుక భాష అను ముడిసరకునుండి ఉత్తమకావ్య మను సున్నితపు మేల్మిసరకు తయారవుచుండును. అయినను భాషాప్రయోజనము లన్నింటికిని ఈ మేలిమిసరకు ఉపయోగపడదు. వాడుకభాష మంచినీటివలె బహు ప్రయోజనము కలది; కావ్య భాష పంచదారపానకమువలె పరిమిత ప్రయోజనము గలది.

ప్రౌఢకావ్యప్రయోజన మొకటి విడనాడినచో, దక్కిన భాషాప్రయోజనము లన్నిటిలోను వాడుకభాషయే ఓలలాడుచు నున్నది. కొందఱు సంస్కృతాంధ్ర కవీశ్వరులు శాసన కావ్యమను పేరుతో ప్రాఢగద్య పద్యరచనలలో వెలయించిన ప్రాచీనశాసనము లెన్నియో వాడుకభాషలో నున్నవి.

ఇంకను ప్రాచీనకావ్యవ్యాఖ్యానములు, కథలు, శాస్త్రగ్రంథములు, వ్యవహారగ్రంథములు, దేశచరిత్రలు చాల చాల వాడుక భాషలోనే ఉన్నవి. వాని నన్నిటిని ఉదాహ

రించుట కిక్కడ చోటు చాలదు. శ్రీ గిడుగు రామమూ ర్తి పంతులుగారి గద్యచింతామణిలో చూచుకోవచ్చును. ఇంకను పద్యగంధులయిన బాల కథలు, పొడుపు కథలు, నానుళ్లు, పలుకుబళ్లు, సామెతలు, స్త్రీల పాటలు పదాలు, పనిపాటుల వారి పాటలు పదాలు, వృద్ధుల వేదాంత వైరాగ్యపు పాటలు పదాలు, ఎట్టిగొల్లలు, పిచ్చుకుంట్లు, పంబవారు మొదలగువారు పాడు దేశికథారచనలు—అన్నియు వాడుకభాషలోనే ఉన్నవి. ఇవికూడ వాఙ్మయములో చేరునా అని పండితులు కొందఱు పరిహసించు చుందురుగాక ! వాని రుచిని గుర్తింపఁగల్గుటకుఁ గూడ నొక యనుభావవిశేష ముండవలెను. ఒక్క తార్కాణ చూపుచున్నాను. చల్లపల్లి జమీందారుగారి పట్టాభిషేకోత్సవపు నాళ్ళలో వారి కోటలో రాత్రిలు నాటకములు. పాటకచ్చేరీలు, బోగమాటలును, సాగుచుండెడివి. కోటవెలుపల మాల దాసరుల వీథినాటకములు, తోలుబొమ్మలాటలు సాగుచుండెడివి. వచ్చిన పండితులందఱును కోటలోని ఆటలు, పాటలు, నాటకములు చూడఁ బోవుచుండెడివారు. మా గురువులు శ్రీ చెళ్లపిళ్లశాస్త్రిలు గారు కోటవెలుపల మాలదాసర్ల వీథి నాటకములు చూడఁబోవువారు. రాత్రి తా మాస్వాదించిన రసానుభవమును మర్నాఁడు పునశ్చరణచేయుచు ఆనందిం చుచు మాకు వినిపించి మమ్ము ఆనందింపఁ జేసెడివారు. వారు గుర్తించి చెప్పినప్పుడే వాని రుచి నసేకులు గ్రహింపఁ గలిగెడివారు. వా రీమధ్య పత్రికలలో లోకాభిరామాయణము లను మంచి వాడుక పలుకుబళ్ళతో ముంచెత్తినారు.

ఆంధ్రభాషలో ఆదికాలమునాఁటి కావ్యరచన ముడి సరకుభాషతో, దేశిచ్ఛందోరచనతో ప్రజాసామాన్యమునకు సులభముగా ఉండెడి దనియు, అదియే ఇప్పటి పాటలుపదాల వాడుక భాష అనియు నా నమ్మకము. నన్నయభట్టారకునికి పూర్వము శాసనములలో సీసగీతమధ్యాక్కర పద్యములు కనఁబడుచున్నవి. వానిలో మధ్యాక్కరను నన్నయాదులయిన ఆదికాలపు ఫ్రౌఢకవులు కొందఱే కొంచముగా పాటించినారు. ఆదికాలపు మధ్యాక్కర ఒకటి ఉదాహరించుచున్నాను:

"స్వస్తి నృపాంకుశాత్యంతవత్సలసత్యప్రతిజ్ఞ
విస్తర శ్రీయుద్ధమల్లుఁ డనవద్యవిఖ్యాతకీర్తి
ప్రస్తుత రాజాశ్రయుండు త్రిభువనాభరణుండు సకల
వస్తుసమేతుండు రాజసల్కభూవల్లభుం డర్థి."

ఇందులో కొన్ని యక్షరములను జేర్చినను తీసివేసినను పద్యము పద్యముగానే ఉండునట్లు రచన ఉన్నది. పఠన ఘణితి తాళగతి కలదిగా గోచరించుట లేదు. సంగీత రుచి గుర్తించిన తెలుఁగుకవులు ఈ పద్యమును ఎందుకు పాటించినారా అని సందేహించుచుండువాఁడను. అర్వాచీనకవులు దీనిని అందు కనియే విడిచి పెట్టినారు కాఁబోలును. ఒకనాఁడు మాయింటిలో మా అమ్మగారు ప్రాఁతకాలపుపాట లేవో పాడుచుండగా వినుచున్న నాకు అం దొక పాటఘణితి చాల అనందజనక మయినది. నేఁటి కావ్యరచనల కనుకూలింపఁ జేసికొందమని

గణవిభజన చేసి చూతునుకదా అది మధ్యాక్కరలక్షణము కలదయి యున్నది. మధ్యాక్కర పథనఘణితి నాకపుడు తెలియ వచ్చినది. దానిమాదిరి చూపుచున్నాను, చూడుఁడు:

"అంతట రాములవారూ - అంగన సీతను గూడి
సంతసమందుచు వేగా - స్వపురమునకు చనుదెంచి
తమ్ములతోడను గలసీ - నెమ్మది రాజ్యములేలే
ధర్మముతో ప్రజలెల్లా - తామరతంపరలైరి."

ఇందు రెండు ఇంద్రగణములు, ఒక సూర్యగణము, రెండు ఇంద్రగణములు, ఒక సూర్యగణము - వెరసి ఆఱు గణములు కలది ఒక చరణము. మూఁడవ గణము కడపటి సీస చరణదళమువలె మధ్యాక్కరచరణము మధ్యకు విఱుగును. ఆదికాలపు కవులు పాటించిన సీస ద్విపద గీత పద్యములు కొంచెము మార్పులు చెందియు, చెందకయుకూడ స్త్రీబాల పామరాదులు పాడు పాటలలో, పదాలలో కానవచ్చుచున్నవి. స్త్రీలు పాడు శ్రావణమంగళవారపు పాట సీసపద్యమే.

"శ్రావణామాసాన శుద్ధపాడ్యమినాఁడు
మహాలక్ష్మి ముత్యాల చీర గట్టి"

అని దాని మొదటి చరణము. మఱియు ద్విపద అను ఆదికాలపు రచన అనేక ఘణితిప్రభేదాలతో పాటలలో,

పదాలలో చేరిఉన్నది. ఒకటి రెండు ద్విపదఘణితిప్రభేదములు చూపుచున్నాను:

"ఒకరూ కట్టిన చీరా ఒకరూ కట్టారూ
ఒకరూ తొడిగిన రైకా ఒకరూ తొడగారూ
ఒకరూ పెట్టిన నగలూ ఒకరూ పెట్టారూ
వార్నీ పొసగింపా నా వశమూ కాదనెనూ."
ఇది ద్విపదవికారమే.

"వెన్నెలబైలనే వేలసంఖ్యలనూ
పందిళ్ళు వేయించీ పరమాపావనులూ"
ఇదియు ద్విపదయే.

ఇట్లు ఒక ద్విపదయే పలురసములలో, పలుఘణితులలో వాడుకభాషలో పలు పాటలుగా వెలసినది.

ఆదికాలమునాఁటి పాటల పరిభేదములను కొన్నింటిని పాల్కురికి సోమనాథుఁడు పేర్కొన్నాఁడు. వాని నన్నింటిని ఇక్కడ వివరింపఁగుదురదు.

సంస్కృతాంధ్రములలో పౌరాణభాషామయములైన భారతరామాయణాదులను చదివి తత్కథాపరియోజనము ననుభవించువారికంటె వాడుకభాషలో పాటలు పదాలుగా నున్న భారతరామాయణ కథలను బొమ్మలాటలలో, వీధి నాటకములలో వినియు, చూచియు ఆ ప్రయోజనము ననుభవించు ప్రజలు దేశములో చాల హెచ్చు. పైతీరున లోక

సామాన్యమునకు అర్థముకాఁదగినదియు, తేట తెలుఁగని, దేశి తెలుఁగని, జానుతెలుఁగని, అచ్చతెలుఁగని ప్రాచీనులు పలు తెఱఁగులతో వేర్కొన్నదియు అయిన వాడుకభాషలో ఉన్న యందచందములు వ్యాకరణముతో దిద్ది తీర్చిన పౌఢ గ్రాంథిక భాషలో పనుపడ వని ప్రాచీనులే వేర్కొన్నారు. తిరుపతిలో ౧౫, ౧౬ శతాబ్దులలో ప్రఖ్యాత కవీశ్వరులై సంకీర్తనాచార్య లనఁబరగిన తాళ్ళపాకవారు వందలకొలఁది పాటలను, పదాలను వాడుకభాషలోనే రచించినారు. పాటలు, పదాలలో వాడుక భాషయే యుండఁదగినదనియు, దానిని పౌఢవ్యాకరణ ప్రకారము దిద్దితీర్చుట పువ్వును సలిపి వాసన చూపించుటవంటి దనియు 'సంకీర్తనలక్షణ' మను లక్షణగ్రంథములో వా రిట్లు చెప్పినారు:

"పల్లవనారీమ్మేచ్ఛా
ద్యుల్లాసమనోజ్ఞ బంధురోక్తులు చవులై
చెల్లును గ్రామ్యములై నను
హల్లీసకముఖ్యనాటకాదికఫణితిన్.

జగతిఁగల చెల్లుబళ్ళి
నగినగి భాషించునట్టి నానుడిపలుకుల్
తగ దన రహి చెడుఁ బువ్వుల
సొగసుడుగున్ బిసిగి కంపు చూపినభంగిన్."

ఈ లక్షణముచొప్పున యక్షగానములను నాటక ప్రభేద ములలో ఉండు దేశిచ్ఛందోరచనావిశేషములను వేర్కొనుట కిక్కడ చోటు చాలదు. ఇంకను వాడుకభాషలో, ద్విపదలలో

కాటమరాజుకథ, పల్నాటికథ, కుమారరామునికథ, మఱి
క్రొత్త తరపుఁబదములయిన బొబ్బిలికథ, దేశింగురాజుకథ,
లంకాసారథి మొదలయిన రసవదర్చనలు ఎన్ని యో ఉన్నవి.

దేశము నలుముఖములను గాలించి మంచిమంచి పలుకు బళ్ళను, కథలను, సామెతలను, పాటలను, పదాలను, వింతశబ్ద జాలములను సేకరించవలెను. అచ్చు రాకముందు అన్నిరకాల రచనలు తాటాకులమీఁదను, నోటివాడుకలమీఁదను నెలకొని ఉండెడివి. అచ్చువచ్చిన తరువాత ప్రాయికముగా ప్రౌఢకావ్య రచనకే పరిపోషము కలుగుటచేత, ప్రాఁతకాలపు దేశిరచన లెన్నో అడగారిపోఁజొచ్చినవి. ఆంధ్రభాష యందచందములు సరిగా గుర్తించుటకు వీని సర్వే యత్యావశ్యకము.

౬

ఆంధ్రకవిత-పురాణయుగము

—

నన్నయతిక్కనలు

పురాణముల రచనము, ఆ రచనముల చెల్లుబడి ప్రబలముగా సాగిన కాలఖండమును పురాణయుగమని వర్తమానులు వ్యవహరించుచున్నారు. అటువంటి కాలఖండములను యుగము లనుటకంటె శకములనుట వ్యవహారార్థానుగుణ మనుకొందును. ఇట్లు మార్చిన పురాణశకము, ప్రబంధశకము అని కాని, మఱొకవిధమున కవులనుబట్టి పేర్కొన్న నన్నయశకము, తిక్కనశకము అని కాని అనుట యవును. అందఱును ఇప్పుడు 'యుగ' మనియే వ్యవహరించుచున్నారు గాన నేనును ఆలాగే అనుచున్నాను. ఆంధ్రపురాణరచన సంస్కృతపురాణరచనాను సారిగా సాగినది గాన ఆంధ్ర రచనా పద్ధతిగ వివరించుటకు ముందు సంస్కృత సంప్రదాయానుస్మరణము కొంత ఆవశ్యకమే అవును. సంస్కృతపురాణములు తద్రచనాకాలమునాఁటి విద్వద్విజ్ఞానమునకు సర్వస్వములు. వేదములలో సర్వవిద్యలును అంకురప్రాయములుగా ఉండఁగా పురాణములలో అవి కొంత కొంత విరివిగా వెలసె ననవచ్చును. "సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో

మన్వంతరాణిచ, వంశానుచరితం చేతిపురాణం పంచలక్షణమ్"
అని సృష్టివిధము, ప్రళయముల తీరు, రాజవంశముల చరిత్రలు,
మన్వంతరకథలు, మహర్షుల చరిత్రలు మొదలగువానితో
పురాణము లుండునని లక్షణము ఉన్నను, పురాణములలో
ఇంకనుఎన్నో దేశచరిత్రలు, వైద్యము, జ్యోతిషము, నీతి,
ధర్మ కామశాస్త్రములు, వ్యాకరణాలంకారసాహిత్యాది శాస్త్ర
సంప్రదాయములు మొదలయినవి కొంతకొంత సంగ్రహము
గాను, కొన్ని చోట్ల విరివిగాను కూడ వర్ణితములై ఉన్నవి. అగ్ని
పురాణములో వ్యాకరణము, వైద్యము, జ్యోతిషము మొద
లయిన వెన్నియో ఉన్నవి.

ఇట్టి పురాణములు సంస్కృతభాషామాత్ర పరిజ్ఞానము
గల జనసామాన్యమునకు కూడ అర్థము కాఁదగినట్లు సులభ
భాషలో, ప్రాయికముగా సులభమైన అనుష్టుప్ఛందస్సులో
తేలిక వాక్యాన్వయములతో తేటగా ఉండును. వ్యాసులవారి
రచనలలో తఱచుగా 'చ, వై, తు, హి' అని పాదపూరణపు
పొల్లుపదము లున్నవి అనికూడ పండిత పరిహాస మున్నది. పురా
సామాన్యరచన ఇట్లు ఉండు ననుట సంగతమే కాని, కొన్నిపట్లు
పురాణములలోనివే, సంప్రదాయపరిజ్ఞానము లేనిచో ప్రౌఢ
పండితులకు కూడ కొఱకరానికొయ్యలు, ఉక్కుసెనగలు అనఁ
బగినవిగా ఉన్నవి. పురాణములలోనికెల్ల భారత భాగవతములు,
రామాయణము ప్రధానమయినవి. రామాయణ భారతములు
కావ్యేతిహాసము లనఁబడినను, పురాణములనికూడ సామాన్య
వ్యవహారమున్నది. తెలుఁగున అని పురాణములే అనుచున్నాము.

ఉక్కసెనగలు పై మూఁడు గ్రంథములలోను, అందులో మఱి భారతమున ఉన్నవి. భారతములోని ఉక్కసెనగలకు వ్యాసఘట్టములని పేరు. మచ్చు చూపుచున్నాను:

పశ్యః పశ్యతి పశ్యన్త మపశ్యన్తంచ పశ్యతి,
అపశ్యన్తావ (త్వాదృ?) చక్షుష్ట్వాత్ పశ్యాపశ్యాన పశ్యతః.
చతుర్భిశ్చ చతుర్భిశ్చ ద్వాభ్యాం పంచభిరేవచ,
హూయతేచ పునర్ద్వాభ్యాం స మే విష్ణుః ప్రసీదతు.

ఈ విధముగా పురాణములు వివిధవిషయములతో, వివిధ రచనలతో అరణ్యములవంటివై ఉండును. అర్వాచీనములయిన కావ్యనాటక ప్రబంధాదిరచనలు పురాణారణ్యముల నుండి ఉద్ధరించి సేకరించి తీర్చిదిద్ది నాటిన యుద్యానములవంటి వనఁదగును. పురాణములలో కావ్యనాటక ప్రబంధాదిరచనల పొలుపులు సుకుమారదృశ్యములై ఉండునుగాని, కావ్య నాటకాదులలో పురాణ రచనములలోని శాస్త్రీంశ భీకర దృశ్యములుండవు. ఇటువంటి సంస్కృత పురాణ ఫక్కి ననుసరించి తెలుఁగు పురాణరచన వెలసినది. నన్నయ మొదలుకొని శ్రీనాథునిదాఁకఁగల కవుల యాంధ్రగ్రంథరచన పురాణయుగ రచన యనఁదగినది. ఆకాలమున పాఁయికముగా ఆంధ్రమున పురాణరచనలే వెలసినవి. కవిత్రీయము, మారన, పాల్కురికి సోమనాథుఁడు, భాస్కరాదులు, నాచనసోమన, శ్రీనాథుఁడు, పోతన, సింగన పురాణకవులలో పఱిధానులు. పురాణకవిరచనలను గూర్చి పరిసంగించినప్పుడీ యందఱవిషయమును రావల

సినదే అయినను ముందు ముఖ్యులయిన భారత కవిత్రయము వారినిగూర్చి మాత్రమే యిప్పటి నా ప్రశంస.

కవిత్రయమువారు దైవభక్తులు, సదాచారులు, ఉత్తమ పండితులు. కవితాతపస్సు చేసి వారు కాంక్షితార్థములను అంతర్వాణియుద్బోధములతో నందుకొని కావ్యరచన కావించి నారు. తర్వాతి సర్వాంధ్ర కవి కుటుంబములకు వారి పవిత్ర వాక్కులు నిక్షేపములయి దొరకిన బంగారునక్కలు. ఆ మువ్వుర రచనములతో తెలుఁగున వెలసిన మహాగ్రంథము భారతము. దాని మూలగ్రంథము అయిదువేలయేండ్లనాఁటి భారతీయ చరిత్రాంశములు గల పాత్ర గ్రంథమే అయినను సర్వప్రపంచమునను దాని పలుకుబడి చెల్లుబడి అగుచునే యున్నది.

వ్యాసకృతిని మహాభారతమును నన్నయ యిన్ని లక్షణములు గలదానినిగా వర్ణించినాఁడు:

"ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని
యధ్యాత్మవిదులు వేదాంత మనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రం బని
కవివృషభులు మహాకావ్య మనియు
లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహమని
యైతిహాసికు లితిహాసమనియు
పరమపౌరాణికుల్ బహుపురాణ సముచ్చ
యంబని మహిఁగొనియాడుచుండ

వివిధవేదత త్త్వవేది వేదవ్యాసుఁ
డాదిముని పరశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై
పరగుచుండఁ జేసె భారతంబు."

ఇట్టి సంస్కృత భారతమును,

"సారమతిం గవీంద్రులు ప్రసన్న కథాకవితార్థయుక్తిలో
నారసి మేలునా నితరు లతురరమ్యత నాదరింప నా
నారుచిరార్థసూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారత సంహితారచన బంధురుఁడయ్యె జగద్ధితంబుగాన్."

నన్నయ పై తీరున సర్వశాస్త్రార్థకలితముగానే కాక భారతమును ప్రసన్నరచనతో మహాకావ్యలక్ష్యముగాఁగూడ తెనిఁగించిన శ్లేర్పడును. కనుకనే యాతనికి వాగనుశాసన బిరుదము కల్గెను. సంస్కృతమున పురాణములు, కావ్యనాటకాదులు అన్నియు వెలసినపిదప ఉపక్రమించిన దగుటచేత తెలుఁగుపురాణరచన తసలోనే సంస్కృత సర్వకావ్యరచనా చమత్కారములను ఇముడ్చుకోవలెనను యత్నముతో సాగినది. ప్రాచీనుఁడు గణపతిదేవుఁడనుకవి "ఆంధ్రకావ్యపథము దీర్చిన నన్నయభట్టుఁ గొలుతు" నన్నాఁడు. నన్నయభారతము చదివినచో అందులో భాషాకవితాలక్షణపరిష్కారములను ప్రయత్నపూర్వకముగా నన్నయ లక్ష్యీకరించినట్లు కాననగును.

"పాయుక పాకశాసనికి భారత ఘోరరణంబునందు నా
రాయణు నట్లు వాణసధరామరవంశ విభూషణంబు నా

రాయణభట్టు వాఙ్మయఘురంధరుఁ డీ కృతి కిష్టుఁడుఁ సహా
ధ్యాయుఁడునై నవాఁ డభిమతంబుగఁ దోడయి నిర్వ
[హింపఁగాన్."

ఈ పద్యము ద్వితీయ తృతీయ చరణములందు నారా యణ పదము "ర" యతి ఖండాఖండములుగా స్వరవ్యంజన ములతో రెండు దెఱఁగుల నుంచుట లక్షణ విశేష నిరూప ణార్థముగదా! ఇట్టి వెన్నేని విశేషాంశములను నన్నయ రచ నలో చూపవచ్చును.

శరత్సమయమున సరళముగా సమపద్రేశమున పద్య హించు తెలినీటి తేటవాకవలె నన్నయరచన సుపసన్నమై, చాటుమాటులు లేనిదై, కరతలామలకముగా తనలోఁగల సర్వార్థములను పద్యక్తముగా గుర్తింపనిచ్చునదై, సుఖపద్రే శమై, సుస్వాద్యమై నిర్వకద్రగతితో నెగడుచుండును. వ్యాస భారత రచనలో 'చ, వై, తు, హు' లున్నట్లు అక్కడక్కడ నన్నయరచనలో 'మానుగ, పాయక, పర్వగ, ఇమ్ముల' మొద లగు పాదపూరణపు పొల్లు పదములుండును. గ్రంథగ్రంథులు నన్నయరచనలో నుండవు. నన్నయ్యశయ్య వంటిపురాణశయ్య- కావ్యగౌరవముకలది - భాగవతకర్త కొక్కనికేతక్క మటి యితర పురాణయుగాంధ్రకవుల కెవ్వరికి దక్కలేదు. నన్నయ్య పురాణశయ్యాసౌభాగ్యమునకు లక్ష్యము నొక్క గీతపద్యమున గుర్తింపవచ్చును:

"ఎల్లవారు నెఱుఁగ నొల్లని ధర్మువు
బేల నీకుఁ దెలుప నేల వలసె?
చిఱుతవాని కింత దఱుసంటి పలుకులు
సన్నె వృద్ధజనము లున్నచోట?"

రాజసూయమహాధ్వరము జరుగునపుడు భీష్ముఁడు ధర్మ రాజుతో 'నఖిలలోకపూజ్య నచ్యుతుఁ బూజింపు' మనఁగా శిశుపాలుఁ డుపాలంభనపరుండయి యధోక్షజు నాక్షేపించుచు ధర్మ రాజు కిట్లనుచున్నాఁడు:

"అవనీనాథు లనేకు లుండఁగ విశిష్టాచార్యులార్యుల్ మహా దివిజుల్ పూజ్యులు పల్వు రుండఁగ ధరిత్రీనాథ! గాంగేయ దు ర్వ్యవసాయంబునఁ గృష్ణు గష్టచరితున్ వార్ష్ణేయుఁబూజించి నీ యవివేకం బెఱిఁగించి తిందఱకు దాశార్హుండు పూజార్హుఁడే?"

ఈ పద్యమున ననుపాసము, నతురసౌభాగ్యము, శయ్యయొయ్యారమునుమాత్రమే కాక దాశార్హుఁడు= పల్లెలు బోయలు మొదలగువారికిఁ దగినవాఁడు, వారిలో విహరింపఁదగినవాఁడు, లేక భృత్యతకు, నౌకరీకి తగిన వాఁడు శ్రీకృష్ణుఁడు పూజార్హుఁడగునా యనియు నాక్షే పము. దాశార్హ పదమునకు రెం డర్థము లున్నవి. పల్లెకారీ లకుఁ దగినవాఁడనియు, నౌకరీకిఁ దగినవాఁడనియుఁ జెడ్డ యర్థము. దశార్ణదేశభవుఁడని మంచి యర్థము.

"ఇతనికిఁ గూర్తురేని ధన మిత్తు రభీష్టములైన కార్యముల్
మతి నొనరింతు రిష్టుఁడని మంతురు గాక మహాత్ములైనభూ
పతులయు విపశ్చిముఖ్యుల సభన్ విధిదృష్టవిశిష్టపూజనా
యతికి ననర్హానర్హుఁడని యచ్యుతు నర్చితుఁజేయఁబాడియే?"

ఇక్కడ ధర్మరాజుతో భీష్ముఁడు అచ్యుతుఁ బూజింపు మనునప్పు డుపయోగించిన యచ్యుతపదమునే శిశుపాలుఁడు వెక్కిరింపుగా నర్థాంతరమునఁ బునఃప్రయోగము చేసినట్లు నన్నయభట్టు రచించి గంభీరభావము గల్పించినాఁడు. అతఁడు విధిదృష్టవిశిష్టపూజనాయతికి ననర్హుఁడు. ఇట్టి యీయచ్యుతుని నర్చితునిఁజేయుట పాడిగాదు అని శిశుపాలుని భావము. భీష్ముని పలుకులలోని యచ్యుతపదమునకు ఆ చ్యుతుఁడు అని యర్థాంతరము గలుగుట ప్రాచీన వ్యాకరణసంప్రదాయ సమ్మతము. ఈ పద్యమునఁగూడ నతిరరమ్యత, యనుప్రాస చమత్కృతి దైవాటియున్నవి. ఈ శిశుపాలకథాఘట్టమెల్ల శబ్దార్థగాంభీర్య కలితమై రసోత్తరమై యున్నది.

"అవమాన్యున్ సభలోన మాన్యుఁడనిసౌహార్దంబునం గౌరవ
స్థవిరప్రేరణ నిన్నుఁ బాండుతనయుల్ తప్పంగఁ బూజించి ర
య్యవివేకాస్పదులైన పాండవులుమోహాంధుండు భీష్ముండుఁగే
శవ! నీవుం గడగుండు నాకునెదురై సంగ్రామరంగంబునన్.'

ఇందు నాల్గవచరణమున 'కే' యనికేక, 'శవ నీవుంగడ గుండు' అని నింద. ఇట్టిచోట్లనెల్లఁ బలుకుబడిలోనే యర్థ విశేషములు పదచ్ఛేదభేదముచేఁగల్పించి గంభీర భావభేదములకు

రుడితిస్ఫూర్తి గూర్చుట నన్నయ్యనై పుణ్యము. కారకాన్వయ కౌటిల్యముతో నర్థవిశేషములను సాధించుట నన్నయ తీరు కాదు.

భారతకథోపాఖ్యానాదులలోని పాత్రముల భావములు, సంభాషణములు చాల ప్రాతకాలపువి గావున, గొన్ని చోట్ల వ్యంగ్యవక్రోక్త్యాదికవితా కౌటిల్యములు లేనివిగా, నమాయికములుగా నున్నవి. అట్టివానిని తెలిగించుటలో నన్నయ తిక్కనలు విభిన్నరీతుల నాశ్రయించిరి. నన్నయ తననాటికే వెల్లివిరిసియున్నవయినను కావ్యాలంకారశాస్త్రసంప్రదాయముల నంతగా జొప్పింపక మూలగ్రంథముగ్ధతామాధుర్యములఁగాపాడినాఁడు. తిక్కన యాయాపాత్రములఁ దననాఁటి వానినిగా గొన్నిచోట్లఁ గావ్యౌచితీనిర్వహణార్థమై మార్చుకొని తన నాఁటి కావ్యాలంకారశాస్త్రసంప్రదాయముల కనుగుణముగాఁ గథానిర్వహణము కావించినాఁడు. నన్నయ రచన మూలానుసారియై, మౌగ్ధ్యమాధుర్యమనోజ్ఞమై, యార్షమై యున్నదనుట కొకటి రెండుదాహరణములు :

నన్నయ శకుంతలోపాఖ్యానరచన కావ్యాలంకారౌచితీరీతినిఁజూడఁగా గ్రామ్యతాదోషజుష్ట మనఁదగియుండును. వ్యాసుఁడే దాని నిట్లు రచియించినాఁడు. అమాయికములై న సత్యకాలపు మునిపల్లెల పిల్లల ముగ్ధమధురసంభాషణములను మూలానుసారముగా తెలిఁగించుటే లగ్గని నన్నయ భావించి యట్లు రచించియుండును. తిక్కన యగుచో నాపట్టుల వ్యంగ్యవక్రోక్తికల్పనాశిల్పముల నెట్టుకొల్పి నవ్యకాలికరీతిని కావ్య

శయ్యతో కల్పించి యుండెడివాఁడేమో! నాటక రూపమున నా కథ నట్లే కాళిదాసు మార్చివేసినాఁడు కదా!

"ఏను కచుం డనువాఁడ మహోనియమసమన్వితుఁడ బృహస్పతిసుతుఁడన్" అని చెప్పుకొని శుక్రుని శుశ్రూషించిన కచుని శుక్రపుత్రియైన దేవయాని వేఁడిమించి యిట్లు కోరినది:

"నీవును బ్రహ్మచారివి వినీతుఁడ వేనును గన్యకన్ మహి దేవకులావతంస రవితేజ వివాహము మీకు నాకు మున్ భావజశక్తి నైనయది పన్నగ నన్నుబరిగ్రహింపు సం జీవనితోడ శుక్రు దయ జేయుము నాకుఁ బ్రియంబునావుడున్."

అని కోరి కచునిచే నిరాకృతయైన దేవయాని దైవ కృతముగాఁ బిదప యయాతిమహారాజుపాణిగ్రహణము కావింపఁగా నన్న తీరు మౌగ్ధ్యమాధుర్యభాసురమేకాని నవ్య కావ్యోచితీరితిని రోతగొల్పునదే. ఇట్టి సందర్భమునసే, అనఁగా మాయావటుఁడు పార్వతిని భార్యవు గమ్మని కోరు సందర్భ మున శృంగారరసభావశ్లేషచమత్కారగర్భితముగా-

"కియచ్చిరం శాన్యసి గౌరి, విద్యతే
మమాపి పూర్వాశ్రమసంచితం తపః,
తదర్ధభాగేన లభస్వ కాంక్షితం
వరం త మిచ్ఛామి చ సాధు వేదితుమ్"

అని కాళిదాసు రచన కావించినాఁడు. శ్రీనాథుఁడు దానిని దెలిఁగించుటలో కాళిదాసుమార్గమును వీడనాడి

అలంకారశాస్త్రసంప్రదాయవాసనల నెఱుఁగనివారినిగానే పార్వతీవటులను భావించి నన్నయచ్ఛాయనే అనుగమించినాఁడు.

"ఏనును బ్రహ్మచారిఁ దరళేక్షణ నీవును గన్య వెంతకా
లానకు నీకుఁ బెండ్లియె ఫలంబగునేని విచారమేల స
మ్మానముతోడ నన్నమునిమాన్యవిహాముగమ్ము లెమ్మికా
దేని తపంబులోని సగమిచ్చెద మాను తపోభిమానమున్."

నన్నయ భారతభాష నాగమసూత్రిస్మృతిభాషనుగా భావించుచోఁ దిక్కనభాషను గాళిదాసకావ్యభాషనుగాఁ బరిగణింపవచ్చును. నన్నఁడు దొక ఋషిమార్గము. తిక్కన దొక రసమార్గము.

"విలువిద్య నొరులు నీ క
గ్గలముగ లేకుండ నిన్నుఁ గఱపుదు ననిమున్
బలికితిరి నాకకా దీ
త్రిలోకముల కధికుఁ జూచితిమి యొకయెఱుకన్".

ఈ పద్యమున నాల్గవ చరణము తొల్త జగణపు టుయ్యాల యూపులో తర్వాతికవు లనేకులు హాయిగా ఊగ సాగినారు. ఈ యూపులో పింగళి సూరన్న ఎట్లూఁగినాఁడో గుర్తింపుఁడు:

"అపు డించుక తడ వన్యో
న్యపాణి సంస్పర్శ సంభృ తానంద స్తం

భపరీతాత్మత నుండిరి;
పరిపఁచమంతయును మఱచి పతియుఁ సతియున్."

శ్రీనాథ పెద్దనాది కవీశ్వరులు చంపకోత్పలాది పద్యములలో మూఁడు నాల్గు చరణముల నొక సంస్కృతసమాసపు జాడింపున జాడించి హాయిహాయి మనిపింతురు. ఈ హృద్య పద్యవిద్యకు నన్నయ ఆద్యగురువు.

"అలయకధర్మశాస్త్రములయందుఁ బురాణములందుఁ జెప్పను త్పలదళనేత్రి విందుమ యపత్యము మేలని కావునన్ యశో నిలయులఁ బుత్రులం బడయు నీ కొనరించెద సంగతాంగుళీ దళవిలసన్మదీయ కరతామరసద్వయ యోజితాంజలిన్."

"అనుపమ కార్ముకాది వివిధాయుధ విద్యలయందు గొవిదుం డనఁగ నజయ్యుఁడై పరగు నర్జునుఁ బోలఁగ నన్య లెందు లే రను జనఘోష ముచ్చరితమయ్యె మరుచ్చలితోచ్చవీచి ని స్వనముఖరాబ్ధివేష్టితవిశాలమహీవలయాంతరంబునన్."

"అతులవిభూతితో మణిమయాభరణద్యుతు లొప్పఁగా శత క్రితుఁడు శచీసమేతుఁడయి కాంచనచారువిమానమాలికా గతదివిజో త్తముల్ గొలువఁగా గొలువుండు వరాప్సరోంగనా యతవిలసత్కటాక్షసుమార్చితసుందరవక్త్రిచంద్రుఁడై."

రసము, భావము, రీతి అనునవి మూఁడును ముప్పిరి గొని, జిగిబిగులతో ముచ్చట్లుగొల్పు పద్యములు ఇవి మూఁడును చూఁడుడు :

"ప్రకటితకోపవేగమునఁ బద్మదళాయతనేత్రముల్ భయా
నకతరలీలఁ దాల్చె నరుణద్యుతి నుద్యతమై తిశాఖమై
శుకకుటిలలాటదేశమునఁ బొల్చె దిక్కూట తట తిమార్గగా
నుకృతి బిభంజనప్రియతనూజున కంతకమూర్తి కచ్చటన్."

"ధారుణి రాజ్యసంపద మదంబునఁ గోమలిఁ గృష్ణఁ జూచి రం
భోరు నిజోరుదేశమున నుండఁగఁ బిల్చిన యిద్దురాత్ము దు
ర్వారమదీయబాహుపరివర్తితచండగదాభిఘాత భ
గ్నోరుతరోరుఁ జేయుదు సుయోధను నుగ్రరణాంతరంబునన్."

"పిలువంగఁబడక సభలకు,
బలిమిం జని పలుకు పాపభాగుల లోకం
బులకు జనవేడి పలికెదు;
పలువా! యెఱుఁగవు పరాత్మపరిమాణంబుల్."

ఈ క్రింది పద్యపు కడపటిచరణములో విశేషణములు విశేష్యమునకుతర్వాత నుండి ఒకదానికంటె నొకటిగా గుణోత్తరములై అవిమృష్టవిధేయాంశమనియు, పతత్ప్రకర్షమనియు నెన్నికగన్న కావ్యదోషములకు వ్యతిరేకముగా కావ్యగుణోదాహరణతను కల్పించుచున్నవి.

"సుతజననోత్సవంబున విశుద్ధయశుండు యుధిష్ఠిరుండు సం
భృతహృదయప్రమోదుఁడయి పెంపున నిచ్చె సువర్ణభూషణ
పతతులు గోధనాయుతము బ్రాహ్మణముఖ్యులకున్ నిరంతర
వ్రతులకు వేదవేదులకు వారిజసంభవునట్టివారికిన్."

ఈ విధముగా నన్నయరచనలో పలుపోకల గుణ విశేషములను పరిగణింపవచ్చును. ఆయనరచన రసధారల యూటపట్టు. ఆంధ్రకవుల కాతఁడు "మధుమయఫణితీనాం మార్గదర్శీ మహర్షిః!"

నన్నిచోడాదిక వీశ్వరు లాయనచనల నెన్నిటినో పుడికి పుచ్చుకొన్నారు. నన్నయ నన్నిచోడుల పద్యము లివి రెండు చదువుఁడు :

"తడఁబడఁబడి యెడు రవమును
బడి కాలెడు రవము గాలిపలుదెఱగుల పో
స్నెడురవమును దిగ్వలయము
గడుకొని మోఁయించె నురగకాయోత్థితమై."

"గిరిసుతమై కామాగ్నియు;
హరుమై రోషాగ్నియుం దదంగజుమై ను
ద్ధురకాలాగ్నియు రతిమై
నురుశోకాగ్నియును దగిలి యొక్కట నెగసెన్"

తిక్కన, శ్రీనాథుఁడు, పోతన, పెద్దన మొదలగు మహాకవులు నన్నయరచనములలోని పల్కు పొలుపులను పెక్కింటిని బరిగ్రహించినారు. నన్నయరచన ధర్మోదాత్తము. కర్ణాటకములోని జైనభారతపుటలజడి తెలిసినవాఁడు గనుక తెలుఁగునాఁటిలో వ్యాసభారత ధర్మవిశేషములను వెలయింపఁ గోరి అతఁడు కావ్యరచనకు కడఁగినాఁడు.

భారతమునీతి శాస్త్ర గ్రంథమని ప్రఖ్యాతి గన్నది. నన్నయ భారతభాగములోని నీతిపద్యములు రీతిహృద్యములు; సౌలభ్యసుందరములు. తెలుఁగు కవులందరిలో వచన రచన నన్నయ చేసినట్లు మరి యే కవియు చేయలేకపోయినాఁడు. ఆ వచనరచనలో పలుకుబడి బహుమనోహరము. వాక్యములు సులభమయినవి. అనుప్రాసపు ధట్టింపు లందుండవు. వచన ఖండముల పరిమాణము మితమై పులకండములఁ బోలియుండును. ప్రపంచభాషలలో ఆంధ్రభాషకు, ప్రపంచ కవితలలో ఆంధ్రకవితకు ఏదేని అర్హస్థానము అబ్బుఁదగిన యోగ్యత కలదేని ఆ యోగ్యతావిస్తర భార మెల్ల నన్నయ భారతభాగమే మోయవలసిన దగును. ఆపుణ్య మూర్తికి వందనము. ఆయన కాశ్రయమిచ్చి పోషించిన చాళుక్యరాజరాజు కీర్తిపతాక చిరసాయి!

"మదమాతంగతురంగముఖ్యపదసంపన్నుండు నన్నయ్య తో
మ్మిదినూర్లేండ్లకు ముందుజూపెకవితోన్మేషంబు సర్వాంధ్రసం
పద పెంపొంద చళుక్యవల్లభుఁడు సామ్రాజ్యాభిషిక్తుండుగా
నది నాభోటికినేఁటికబ్బునటె వ్యాఖ్యానింప నాఖ్యానమున్."

నన్నయ్యతర్వాత భారత రచనమును బూరించిన తిక్కన సోమయాజి నన్నయరచనమును దిన్నగా నెఱిఁగిన వాఁడే అయినను నన్నయ్య శయ్యాసౌభాగ్యమును, ప్రసన్నతను పాటింపక, సంస్కృతభారతపు వ్యాసఘట్టములను బోలిన గ్రంథగ్రంథుల నధికముగాఁగూర్చి కవితామర్మముల నధికముగాఁ జొప్పించి పురాణరచనాసౌలభ్యమును గోల్పడినాఁడు.

వర్షాసమయమున నొడుదుడుకు నేలలనుండి సుడులు దిరుగుచు మడుగులు మాటులుగలిగి లోఁతు తేలియనీయని కలకనీటి పోటుతో పఱితిపదమును జాగఱిత్త వహించినఁ గాని దాఁటి వీలుగొల్పని వక్రగతులతో సాగు గంభీరనదీ ప్రవాహమువలె తిక్కనరచన మపరిసన్నమై వెనుకకు ముందుకుఁ దిరుగు వాక్యోపవాక్యములయు, కారకాన్వయములయు కౌటిల్య ముతోఇఁక నిండేమి విశేషము గలదో యని సహృదయులు ప్రతి పదము సందేహముతో ఆచియూచి చూచిచూచి మఱీ చదువ వలసిన తీరున చిక్కులుగొల్పుచు జిగిబిగితోనుండును. ఇది పురాణ ఫక్కికాదు. మఱీ దివ్యకావ్యఫక్కి. కవితామర్మ మిం దెక్కువ. వక్రోక్తులు, అర్థాలంకారములు, వ్యంగ్యము నిం దధికముగానుండును. ఇందుకు లక్ష్యము నొక్క గీతపద్యము నుదాహరించుచున్నాను. విరాటపర్వ ద్వితీయాశ్వాసమున కీచ కుఁడు ద్రౌపదిపై తమక మాఁపుకొనలేక నీచవాంఛను వావి డిచి వెల్లడించినాఁడు. అప్పు "డబ్బోటి కలుషించియు దుర్వా రంబైన పరిభవవికారంబు దోఁపనీయక వెరవుతోడన తప్పించు కొనవలయునని" యిట్లన్నది:

"చనునె యిమ్మాటలాడ సజ్జనుల కాఁడు,
బుట్టువులతోడ నీవును బుట్టినాఁడ
వట్లుఁ గాకయు హీనవంశాభిజాత
నైన పతివత్ని నగు నన్ను నడుగఁదగునె ?"

—"అన్నా! కీచకా! సత్పురుషులు పరస్త్రీల నిట్లు కోరవచ్చునా? అంతేకాక ఆఁడుతోడుగలవాఁడు మటీ జాగ్రత్తగా నుండవలెనుగదా! నీవు సజ్జనుఁడవు, సుదేష్ణవంటి యాఁడుతోడుగలవాఁడవు, నీవిట్టి చెట్టపలుకులు పలుకరాదే! ఇట్లు కోరఁగూడమికి నీ యోగ్యతాంశము లివి రెండే కాదు. మటీ నా యయోగ్యతాంశములును రెండున్నవి. నేను హీనవంశసంజాతను, మగనాలను; ఉన్నత వంశము గర్వించు ననియు, ఆఁడుతోడు చెడనాడు ననియు, అక్కకు కూడ నీగతి పట్టవచ్చుననియు, నీ విషయమున నీవు వెఱవవలెను. నావిషయమునఁగూడ, నీచజాతిదని, మగఁ డెఱిఁగిన దండించు నని నీవు వెఱవవలెను." అని సామాన్యముగాతోఁచు బాహ్యార్థ ము. ఇక్కడ లోఁతయిన యర్థాంతరము సున్నది.

"సజ్జనుఁడు, ఆఁడుతొడుగలవాఁడు ఇట్టి మాట లాడఁడు. ఇట్టి చెట్టలాడుచున్నావు గాక నీవట్లుగాక దుర్జ నుఁడవు, ఆఁడుతోడులేనివాఁడవు నయితివి! 'నాకు సజ్జనతా పేక్షలేదు, ఆఁడుతొడుకలిమి నేను పాటించువాఁడను గాను!' అందువేమో! (సుదేష్ణ వీనికి తగిన యాఁడుతోడే: తన పాడునడత కామెనుగూడ తోడుపఱుచుకొన్నాఁడుగదా!) అయితే నీవట్లగుదువుగాక! హీన! ఓరి నీచుఁడా! వంశాభి జాతను! పవిత్ర క్షత్రియవంశజాతను! యజ్ఞాగ్ని సంభూ తను! అయిన పతివత్నిని, అఖండపరాక్రములయిన భర్తలుగల దానను! నన్ను నటరా నీపు కోరునది! నా వంశపు యోగ్య తను, భర్తల యోగ్యతను దెలియక వదరుచున్నావు. ఈ

రెండు యోగ్యతలు నిన్ను నాశపఱుపఁగలపురా" అని యర్థాంతరము!

పాఠకులు పై రెండర్థములలో కీచక సైరంధ్రీపాత్రములను జూచి సాధారణముగా తొలి సువ్యక్తార్థమును సైరంధ్రిలో డాఁగియున్న ద్రౌపదీపాత్రనుగుర్తించి లోఁతుగా రెండవ యంతరార్థమును గ్రహింపఁ గల్గుదురు. లోఁతుగా యోచింపఁ జాలనివారు తొలియర్థమునే గ్రహింతురు. కీచకుఁడు మదనపిశాచగ్రస్తుఁడై యాత్రపాటుతో నున్నాఁడు గాన తోలియర్థమునే గ్రహింపగల్గెను. ద్రౌపది తాను భావించునది రెండవ గంభీరార్థమునే! తిక్కన యీ రెండర్థముల ననుగత పఱిచి శ్లేష ధ్వ న్యర్థచమత్కారముతో పద్యమును గూర్చి నాఁడు. పయి వద్యమున 'అయిన పతివత్ని' ననుచోటను, 'అడుగఁదగునె' అనుచోటను అర్థ విశేషములున్నవి. ('అయిన యింటివారు' ఇత్యాదులు చూచునది) అయిన = చెల్లివచ్చిన, ప్రఖ్యాతిగాంచిన – భర్తలుగలదాననని (అటువంటివారి విషయమై అడిగేదేమిటి–ఇత్యాదులు చూచునది.), ప్రశ్నస్మరణమే చేయరానిదాననని అర్థవిశేషములు. ముద్రిణములం దీపద్య మిట్లున్నదిగాని యిందు తిక్కనకూర్పు కొంత మార్పుచెంది ఉండుననుకొనుచున్నాను. 'అట్లుఁగాకయు' అనుచోట అట్లు తర్వాతి సముచ్చయపు టరసున్న – 'కాకయు' అనుచోటి 'యు'స్వారస్యమును సంపాదింపఁగల్గియే యున్నది. ఇఁక 'యు' వ్యర్థము. తిక్కన్న "అట్లుఁగాకయో హీన" అని రచన చేసి యుండును. తోలి యర్థమున "అట్లుఁగాక-అయో-హీనవంశాభి

జాతను అనియు, రెండవ యర్థమున అట్లుఁగాక - ఓహీనఅనియు ఛేదము ససిపడును.

"అని వీడఁగఁ బల్కిన న
మ్మనుజాధముఁ డంతఁ బోక మదనోన్మాదం
బునఁ దన్ను నెదిరి నెఱుఁగక
వనితకు నిట్లనియేఁ గారవంపుఁ బలుకులన్."

తర్వాతి యీ పద్యములోఁ దన్ను నెదిరిని—పాద ప్రహారముచేయుదానిని ద్రౌపదిని అనియు కవి పొసగించి నాఁడు. ఇట్లు తిక్కన భారతపురాణరచనమున ప్రబంధ పద్ధతితో వక్రోక్తిచమత్కృతులు, శ్లేషభంగులు, అనన్వయాభాసములు, గడుసు పొసగింపు కూర్పుతీర్పులు లెక్కకు మిక్కిలి యయి యున్నవి. అత్యంత శ్రద్ధతో పరిశీలింవఁగా ఒక్క విరాటపర్వ ద్వితీయాశ్వాసమునసే ఎన్నో శబ్దార్థ చమత్కారములు ప్రస్తుతపు ముద్రణములలో, ప్రాఁతలలో ఆపరిశీలితములుగా చెడిపోయినవి, చక్కఁబఱుపవలసినవి, గానవచ్చినవి.

తిక్కన దేసిపలుకుల మెలపులతోఁ గవితామర్మములతో సంస్కృతమున వ్యాసుఁడు చొప్పించినట్లు పెక్కుచోట్ల గ్రంథ గ్రంథులను చేర్చినాఁడు.

"గురుని మాట సరకుగొనమి దుశ్శీలత
పిట్టఁ బుడుక గోరుఁ బిసుకఁ ద్రుంపఁ
గరవ మరుగు టుదయకాలా స్తమయ సమ
యముల భానుఁ జూచు టాయువడఁచు."

ఈ పద్యమునఁ గవితామర్మమున్నది. క్రొత్తవారిపద్య

ముసర్థమును గు_ర్తింపఁజాలరు. వృద్ధ విద్వాంసుల మూల
మునఁనో, సంస్కృతమూలము మూలమునఁనో గు_ర్తింపవలసినది
దినియర్థము. 'లోష్టమర్ది తృణచ్ఛేదీ నఖఖాదీ చయోనరః' అను
మూలమున కిది తెనుఁగు. పిట్ట, పుడుక, గోరు అనఁగా
లోష్టము, తృణము నఖము అనువానిని పిసుకుటకును, త్రుంపు
టకును, కఱచుటకును అలవాటుపడుట ఆయువును హరించునని
యర్థము. తిక్కన దీనిని 'బెడ్డ చిదుప, పుడుక విరువ, గోరు
గరవ, మరుగుటుదయ' అని సులువుగాఁ గూర్పవచ్చును.
అయినను నిందు యథాసంఖ్యాలంకారము చేర్చి పిట్టపుడుక
గోరు అనుచోఁ బిట్టను బట్టుకొనఁగోరునట్టి యని యనన్వితా
ర్థాభాసచిత్రమును గల్పించి పాఠకులను లోఁతు యోచనకుఁ
బాల్పఱచినాఁడు. మఱియు,

"అనిన నలు గాలివాన గోవును నశేష
శబ్దముల మంత్రమును లోహజాతిఁ గాంచ
నమును మనుజుల పి్రపుండు సమధికత్వ
భాజనము లంద్రు వేదప్రపంచవిదులు."

తెలుఁగుకూర్పుమఱుఁగు లెఱుఁగనివారై నచోఁ బ్రౌఢ
సంస్కృత పండితులు సైతము ఈ పద్యమున నలుఁడేమిటి,
గాలివాన యేమిటి అనన్వితముగా నున్న వేయని యంగలార్తురు.
తిక్కన యిక్కడఁ జతుష్పాత్తులనికాని, నాలుగుకాళ్ళ జంతు
వులని కాని సులువుగా ననలేఁడా? అనఁగలఁడు కాని నలుఁడు,
గాలివాన అన్న ప్రసిద్ధ పదముల ఝుడితిస్ఫూ_ర్తికలిగి పాఠకుల
కన్వయము తోఁచి లోఁతైన యోచనతో తదాభాసచిత్రము
గోచరించునట్లు కవితామర్మ మిక్కడఁ గల్పించినాఁడు.

సంస్కృత భాగవతమును బలుతూరులు పురాణము చెప్పిన యొక ప్రౌఢ సంస్కృత పండితుఁడు ఆంధ్రభాగవత మును గూడఁ బురాణము చెప్పుచు 'ఓదమ్రతవ్వి జీవనపు టోలమునంబడి' అన్న పోతన్న పద్యమున కర్థము చెప్పఁగుదురక "యిక్కడఁ బుటోల శబ్దమున కర్థము తెలియలేదు. సంస్కృ తాంధ్ర నిఘంటువులలోఁ బటోలపద మున్నదికాని పుటోల పదము లేదు. ఇందేదో తప్పున్నది" అని చెప్పెనఁట! తెలుఁగు మఱుఁగులెఱిఁగిన సహృదయుఁ డొకఁడు "మదపుటేనుఁగు వంటి దీపదము. మదము, ఎనుఁగు సమసించినట్లు జీవనము, ఓలను అను పదములు సమసించినవి. ఓల మనఁగా నర్థ మిది" యని చెప్పి యా సంస్కృత పండితునకు సహాయపడెనఁట! ఇది యెనుబది యేండ్లక్రిందట నిజముగా జరిగినకథ! మా నాయనగారు చెప్పఁగా విన్నాను.

"నీతలపేను గంటి నొకనేర్పున శౌరికి లంచమిచ్చి సం
ప్రీతుని జేసి కార్యగతి భేదము సేయఁగఁ జూచె, దింత బే
లై తిగదే సుమేరు సదృశార్థముఁజూచియు బాష్కుఁ బాయునే
యాతఁడు క్రీడిభక్తియును నచ్యుతు పెంపును నీ వెఱుంగవే?"

శ్రీకృష్ణుఁడు రాయబారము వచ్చినపుడు విదురుఁడు ధృతరాష్ట్రునితో సంభాషించు సందర్భములోని పద్యమిది. ఇచ్చట నీతలఁపును నేనెఱుఁగుదును అను ముఖ్యార్థమే కాక అది నీ తలలోని పేనువంటిదిసుమా అను నర్థాంతరముకూడ నున్నది. ఇక్కడఁ దిక్కన యెటిఁగియే తలపేను శబ్ద చిత్ర

మును గూర్చినాఁడు. ఇటువంటి శబ్దార్థ చిత్రములను దిక్కన్న రచనమున నెన్నింటినేని లెక్కింపవచ్చును. ఆమధ్య నెల్లూరు తిక్కన వర్ధంతిసభలోఁ దిక్కన రచనా విశేషములను గూర్చి చర్చ జరిగినట్లు పత్రికలలోఁ జదివితిని. విరాట ద్వితీయాశ్వాస మున సైరంధ్రినిగూర్చికీచకుని పరిహాపములలోఁ దిక్కన యశ్లీలార్థదూషితముగా 'దీనిఁ బొందఁగాఁంచు తెఱఁగు నా కెయ్యది యొక్కొ' అని కూర్చెననియు నది కీచక పాత్రో చితమని యొకరును, 'దీనిఁబొంద' యనుచో నశ్లీలార్థము పరిగణింప నక్కరలేదని మఱికొందఱు ననిరఁట! ఇప్పుడు పరిహారములో నున్న తిక్కన విరాటపర్వముద్రణము లాఁపే డింటలోఁ బాత మిచ్చే ముద్రితమైయుండుటచే నీ యనర్థము వచ్చినది. తిక్కనరచన మిట్లుండదు. ఈ పద్యము పై నాలుగు సీసచరణములందును దీని జన్మంబున, దీని వల్లభుఁడు, దీని నామాకృతి, దీని వసించుట యని సైరంధ్రీవాచక సర్వనామము షష్ఠీసమాసగతమైయుండఁగూర్చి గీతిలో మాత్రము 'దీనిఁ బొంద' అని వ్యస్తముగా, నపక్రమముగా, నశ్లీలస్ఫోరకముగాఁ దిక్కన కూర్చఁడు. కాన ఇక్కడఁగూడ "దీనిపొందుఁ గాంచు తెఱఁగు నా కెయ్యది యొక్కొ" అనియే యుండవలెను. విరాట పర్వ ముదాహృపకులెల్లరును "దీనిఁబొంద" యనియే గ్రహించుట యనుశోచనీయము. తిక్కన బొందను ప్రయో గింపలేదు. లేఖకులు, ముదాహృపకులు పరిమాదపుబొందఁబడిరి. విరాటపర్వ ద్వితీయాశ్వాసమునఁనే తిక్కనకవితా మర్మములును, బదలాలిత్యములును, గడుసరికూర్పు నేర్పులును నెన్నో యప్రాధు లైన లేఖకపాఠకముద్రాపకుల మూలమునఁ దార్మాలై

కానవచ్చినవి. దేసి తెలుఁగు మఱుఁగులెఱింగిన ప్రౌఢాంధ్ర పండితులుగాని గుర్తింపరానివగుటచే ననేక పాఠములు తిక్కన రచనలో నట్లు తార్మారై నవి.

"తన్వంగి మవ్వంపుఁ దనులత నెసగెడు
నునుగాంతి వెల్లువ మునుఁగఁబాఱఁ
గిసలయహస్తకెంగేల నేపారు కొ
మ్మించు లేయెండ మిగులఁ బర్వఁ
గమలాస్య ముద్దుమొగంబు లేమెఱుఁగుల
మొత్తంబుపరి చుట్టు ముట్టికొనఁగ
ధవళాక్షితొంగలి తఱచుఱెప్పల చెన్ను
కప్పనుచీకటి గవియుదేర
బెగ్గలం బంతకంతకు నగ్గలించి,
యొదవి చెమ్మట, చిత్తంబు సెదరి, యెందు
మెలగఁ దలఁపేది, యా సింహబలుఁ డనంగు
పట్టి యాడెడు జంత్రంబుపగిది నుండె."

ఈ పద్యమునెత్తు గీతియందుఁగల యసమాపక క్రియల నాల్గింటిని సీసపు నాలుగు పాదములకు యథాసంఖ్యముగాఁ గూర్చుకొని యర్థమెఱుఁగఁదగును. కాంతి వెల్లువ కీచకుఁడు మునుఁగునట్లు ప్రవహింపఁగా వానికి బెగ్గల మంతకంతకు నగ్గలమైనది. లేయెండ మిగులఁ బర్వఁగా వానికిఁ జెమ్మట యొదవినది. లేమెఱుఁగుల మొత్తమను సైన్యము చుట్టు ముట్టుకొనఁగా జిత్తము సెదరినది. కనుఱెప్పల కప్పను చీఁకటి

కృష్ణుకొనగాఁ నెందును మెలఁగలేక పోయినాఁడు. ఇందు ఎత్తుగీతి పై యర్థమున కనుగుణముగా ముద్రణములందుఁ గానరాదు. మఱియు నింకొకపద్యమున, "కేలిమై నొక్కట లీలఁ గేళ్లుటీకెడు వాలుగుసోగల నేలుదెంచి" అని యున్నది, 'ఏలుదెంచి' యనుట తిక్కన ప్రయోగముకాదు. ఏఁగుదెంచు, జనుదెంచు, పుత్తెంచు, తోతెంచు ఇత్యాదిగా గత్యర్థసంబంధము లగు ధాతువులమీఁదనే 'తెంచు' ధాతువనుప్రయుక్తమగుట భాషలోఁ గానవచ్చును. తక్కిన మూఁడు చరణములలోను తెగడి, తూలంద్రోలి, ఉక్కడంచి యున్నవి గనుక యిక్కడఁ గూడఁ దదనుగుణముగా 'నేలిదించి' యని యుండఁదగును. 'ఎల్లిదించు' రూపాంతరము 'ఏలిదించు'. అవహేళనము చేసి యని యర్థము. ఇంకొకటి—

"సమదవారణము జంగమలత వెనుకొని
సరభసంబునఁ బట్టి జనువిధమునఁ
గూరిదానవుఁడు భూచారి నిర్జరకాంతఁ
బొదువ రయమ్మునఁ బోవుభంగి
ఘోరగృధ్రిము సుకుమార నాగాంగనఁ
బటుగతి నొడియంగఁ బాఱుకరణిఁ
బ్రిబలబిడాలంబు బాలశారికమీఁద
నడరి సత్వరమున నరుగుమాడ్కి—
సింహబలుఁ డత్యుదగ్రితఁ జిగురుబోఁడి
పజ్జఁ గడువడి దగిలి కోపంబు గదుర
నొడిచి తలవట్టి తిగిచి మహోగ్రివృత్తిఁ
గొంకు కొసరించుకయు లేక కూలదాఁచె."

ఈ పద్యమున ద్రౌపది కుపమానములుగా మూఁడు చరణములలో జంగమలత, భూచారి నిర్జరకాంత, సుకుమార నాగాంగన యనునవి భూలోకదుర్లభము లున్నవి. నాల్గవ చరణమునఁగూడ నట్లే కదా యుండవలెను. మఱియు మూఁడు చరణములలోను ద్రౌపద్యుపమాన పదములు ద్వితియాంతములుగా నున్నవి. నాల్గవచరణమునఁగూడ నట్లేకదా యుండవలెను. ఈ తీరునఁజూడఁగా— "పరిబలబిడాలంబు భారతీశారిక నడఁప సత్వరమున నరుగుమాఁడ్క" అని యుండుట భాగు. ఈ 'భారతీ శారిక' పదము 'భారతీదేవిముంజేతి పలుకుఁజిలుక' వంటిది.

కీచకుఁడు ద్రౌపదిఁగూర్చి చేయు నసందర్భాలాపము లలో నీకిందిది యొకటి:

"చిత్తము మెచ్చి నావలనఁ జిక్కఁగ వెండియు నాలతాంగి యచ్చొత్తినయట్లు నాకుఁ దన యుల్లము తెల్లముసేయకున్క దా నత్తఱిఁ గొత్తకాన్పగుట నడ్డము సొచ్చిన సిగ్గు పెంపు నన్ను త్తలమందఁ జేయుటకునో తలపోసి యెఱుంగనయ్యెడున్."

ముద్రణములో నీపద్యమిట్లున్నది. తిక్కన పలుకుబడి గాని, యర్థపుసొంపుగాని యిందుఁ బొందుపడకున్నది. ఇది యిట్లుండగాఁదగునని నాతలంపు:

"చిత్తము మెచ్చి నావలనఁ జక్కఁగ వెండియు నాలతాంగి యచ్చొత్తినయట్లు నాకుఁ దన యుల్లము తెల్లముసేయకున్క దా

నత్తజి గ్రొత్తకాన్పగుట నడ్డము సొచ్చిన సిగ్గుపెంపొ? న
న్నుత్తలమందఁ జేయుటగునో?తలపోసి యెఱుంగనయ్యెదన్."

రాయబార మరుగునప్పుడు కృష్ణునితో ద్రౌపది తన భంగపాటును జెప్పు పలుకులలో—

"అంతలు నేసి పోనడిచి యక్కట సంజయుచేతఁ జెప్పి పు
త్తెంతురె? యిట్టియూఁటమదింబ్రియమందె యుధిష్ఠిరుండుదా
నంతన యూళులేవురకునైదు సుయోధనుఁడిచ్చునొక్కొ? ఈ
కంత కృపావిహీనమతి నాతఁడు నేచునె యన్నదమ్ములన్."

ఇందు 'ఈకంత' అనుచోఁ గొందఱు వికటార్థములను గూడఁ జెప్పుదురు. ఇక్కడ 'ఒక్కంత కృపావిహీనమతి నాతడు నేచునె యన్నదమ్ములన్' అన్న పాఠము సుందరము. ఇంత వఱకు నేనిప్పుడు వెల్లడించిన సంస్కరణములలో నిదియొక్కటి తక్కఁదక్కిన వెల్లను తిక్కన హృదయము నూహించి నేనే చేసినవికాని వ్రాఁతప్రతులఁజూచి చేసినవికావు. ఈ తీరునఁ జూడఁగా దేసి తెలుగు మఱుఁగులలో సాటిలేని నేర్పుతో మెలఁగనేర్చిన తిక్కన సారస్వత భాండారమగు భారతభాగ మును ససిగా నుపయోగించుకొనుటకు సమర్థమైన సహృదయ పండితగోష్ఠి జరగవలెను. ఇట్టి పరిశీలనము జరుగనిచోఁ దిక్కన పద ప్రయోగ లాలిత్యము సరిగాఁ బరిజ్ఞాతము కాఁజాలదు.

తిక్కన రచనలో నింకొక వింతతీరు కూర్పును వివరించు చున్నాను. ఆంధ్ర కవితారచనమున వాక్యముల నసమాపక

ములుగా పద్యముననుండి పద్యమునకు సాగునట్లు కూర్చుట కలదు. అనఁగా నొక వాక్యము రెండు భిన్నపద్యములలో ననుగతమై యుండు నన్నమాట. పద్యావసానమునకుఁ, బద్యారంభమునకు నడుమఁ గొంతవిశ్రాంతి యుండును. ఒక వాక్య ముచ్చరించునపుడుగూడ నడుమ విశ్రాంతి యుండఁ దగును గనుక ఆకూర్పు అసందర్భముగాఁదోఁపదు. కాని రెండు భిన్నజాతివియగుపద్యములలో నొకసమాస పదమునే సంధించి కూర్చుట చాల విడ్డూరముగా నుండును. ద్విపదములు, రగడలు మొదలగువానిలోను, మాలికావృత్తములలోను నాల్గుచరణములకుఁ బద్యము ముగియుచు కాన వానిలో నట్లుండవచ్చునుగాక, భిన్నజాతిపద్యముల యవసానారంభము లలోనే ప్రధానముగా సంహిత పాటింపవలసినసమాసపదము తిక్కన రచనలో నున్నది.

"ఒకటి యడిగెదఁ గృప చిగురొత్తఁ జెప్ప
వలయు మీరు మాయింటికి వచ్చి యొక్క
పక్క కిందుగ నిరువదియొక్క దినము
లనఘ! నిదించి తదిమొదలైన నీదు-

చరితం బద్భుతము మునీ
శ్వర! దీనికిఁ గారణము విచారమున కగో
చర మెటిఁగింపు మనుడు నా
ధరణీవల్లభునితో నతండిట్లనియెన్."

'నీదు-చరితము' అన్న సమాసపదము రెండు భిన్న జాతిపద్యముల యంతాదులలో నున్నది. నన్నిచోడమహాకవి కూడ నిట్లొకచోఁ బ్రయోగించినాఁడు.

"వ..... అనేక పురుషరత్నా కీర్ణంబై వెలుంగుచున్న—
సభలో దానవదూత గాంచె విలసజ్జాజ్వల్యమానంబులై ....."
(కుమార సం. ౧౦ ఆశ్వా.)

'వెలుంగుచున్న సభలో' అన్న సమాసపదము-సంహిత గలిగియుండవలసినది- వచనావసానమునఁ గొంత గాను (వెలుంగుచున్న), ఉత్పలమాలాపద్యారంభమునఁ గొంతగాను (సభలో) విడఁబడియున్నది.

"రవిపదాహతిఁ జెడియుండు రాజువోలె
నని సరోజములొందఁ జకాహ్వాయములఁ
జెట్ట లాడుటకని వికసిల్లుటకును
వెల్లనై నట్లు చుక్కలు వెలరువాఱె." (కుమా ౮ ఆ.)

దిద్దవలెను. అర్థము కుదరక గుఱ్ఱుమిటకరించి కొట్టు కొని యెటకేల కిటు కవిపాఠము కనిపెట్టఁగలిగినాను:

"రవిపదాహతిఁ జెడి యుడురాజు వోయె
నని సరోజములొద్దఁ జకాహ్వాయములు
చెట్టలాడుట, కవి వికసిల్లుటకును,
వెల్లనై నట్లు చుక్కలు వెలరువాఱె."

ఉడురాజు=నక్షత్రాధిపతి, చందుఁడు, ఉడిగిపోవు, ముగిసిపోవు రాజు అనికూడ; ఉడుఁబోతపిండె వంటిది. విరోధియైన యుడురాజు పడిపోవుట నాకసమున కెగసి చక్రవాక పక్షులు చూచి యా సంతోషవార్తను మిత్రములైన సరోజముల యొద్దకి వచ్చి, చెట్టలాడుటకును=పడిపోయిన జందుని నిందించుటకును, మఱియు నుత్సాహముతో ఱెక్కలల్లాడు(ర్చు)టకును ననియు. అవి=మిత్రములయిన యా సరోజ

ములు, వికసిల్లుటకును = వాని చెట్టలాట కుప్పొంగుటకును, వికాసము చెందుటకును, నవమానము చెంది తెల్లపోయినట్లు చందుని మిత్రములైన నక్షత్రములు కాంతిహీనములై వెల వెలఁ బోయినవి.

కవిహృదయము పైయట్లు గోచరింపఁగా నాకవి నాకుఁ గనకాభిషేకము చేసినాఁడన్నంత సంతోషముతోఁ దోఁగినాఁడను. మటికొన్ని :

"ఆయవనీరుహోద్గతలతాంతవినిర్గతసౌరభప్రవా
హాయతసాంద్రమై ఫలితమై యొగిఁబర్విన డాయఁబోవనుం
బాయను రాకచుట్ట మధుపవ్రజమాలిక లుండె నొప్పిపు
ష్పాయుధు కాలఁజుట్టు మరుఁడాయసవప్రము వెట్టినట్టిదై."

(నవమాశ్వాసము 2-ర ప.)

దీనికి నా సంస్కరణము :

"ఆయవనీరుహోద్గతలతాంత వినిర్గత సౌరభప్రవా
హాయతి సాంద్రమై ఫలితమై మొగిఁ బర్విన డాయఁబోవనుం
బాయను రాక చుట్టి మధుపవ్రజమాలిక లుండె నొప్పి పు
ష్పాయుధుశాలచుట్టు మధుఁ డాయసవప్రము వెట్టినట్టు లై."

పుష్పాయుధశాల కధికారియైన వసంతుఁ డాయాయుధ శాలలోని కెవరికిని రాకపోకల వీలు లేకుండుటకు చుట్టును నినుపకోట పెట్టినట్లు భృంగమాలికలు పూలచెట్లను జుట్టి యున్నవి. పూచినచెట్లు పుష్పాయుధశాలలు. మధుఁడు తదధి నేత. ఇందులోఁ బుష్పాయుధకాల, మరుఁడు ఉండుట యసం గతము.

"సుజనజనై కభూషణము శూరత దుర్జనదూషణంబు స
ద్విజ విబుధాశ్రితప్రతతి వేడుకఁబోర్చిపును రాజ్యచిహ్నగా
క జలమహాభిషేకమునఁ గట్టిన పట్టము వీజనంబు భూ
భుజులక కాక యిన్నియును బుంటికినై నను లేవె చూడఁగన్."

దీనికి నా సంస్కరణము:

"సుజనజనై క భూషణము శూరత దుర్జనదూషణంబు స
ద్విజ విబుధాశ్రితప్రతతి వేడుకఁ బ్రోపును రాజ్యచిహ్న గా
క జలమహాభిషేకమునఁ గట్టిన పట్టము వీజనంబు భూ
భుజులక కాక యిన్నియును బుంటికినై నను లేవె చూడఁగన్?"

"వనధి నీ రెల్లఁ గొనిపోవఁ గని సహింప
కబ్ధితతి గిట్టపట్టిన నరుగ నోప
కోలి దొంతులు గొనిపడియున్న కారు
మొగుళులనఁ జూచి తటభూమి మొగళు లమరె."

(ఁ ఆ. ఁ–౨౦ ప.)

దీనికి నా సంస్కరణము:

"వనధినీ రల్లఁ గొనిపోవఁ గని సహింప
కబ్ధితటి గిట్ట పట్టిన నరుగనోప
కోలి దొంతులు గొనిపడియున్న కారు
మొగుళులవఁ బూచి తటభూమి మొగళు లమరె."

అబ్ధికిఁ జుట్టు నబ్ధితటి కాపలా కాయుచున్నట్లును, సముద్రములోని నీటిని మెల్లగాఁ బైపైకి మేఘము లెత్తుకొని పోవుటకుఁ జూచి యా యబ్ధితటి యా మేఘముల గిట్టలను (వానకాళ్ళను) బట్టి యీడ్చి క్రిందఁబడవేయఁగా నవి దొంతులు

గొని పడియున్న వన్నట్లు సముద్రితటమున మొగలిచెట్లున్నవి. ఆ మేఘములలోని మెఱపులా యనునట్లు మొగలి పూవులున్నవి.

"తను వసితాంబుదంబు సితదంతయుగం బచిరాంశు లాత్మగ
ర్జన మురుగర్జనంబు గరసద్రుచి శక్రిశరాసనంబు నై
చన మదవారివృష్టి హితసస్య సమృద్ధిగ నభ్రివేల నాఁ
జను గణనాథుఁ గొల్తు ననిశంబు నభీష్టఫల ప్రిదాతగాన్."
(౧ ఆ ౭ ప.)

దీనికి నా సంస్కరణము:

"తను వసితాంబుదంబు సితదంతముఖం బచిరాంశు వాత్మగ
ర్జన మురుగర్జనంబు గరసద్రిచి శక్రిశరాసనంబు నై
చన మదవారివృష్టి హితసస్య సమృద్ధిగ నభ్రివేళ నాఁ
జను గణనాథుఁ గొల్తు ననిశంబు నభీష్ట ఫలప్రిదాతగాన్."

విఘ్నేశ్వరుఁ డేకదంతుఁడు కాన సితదంతయుగంబని యుండరాదు. అచిరాంశువు = మెఱుపు. అది ఉపమానము కాన అప్పుడప్పుడు మాత్రిమే కన్పడునదిగా నుండవలెను. సితదంతముఖంబనుటలో నోరు తెఱచినప్పు డగపడుట, మూసినప్పు డగపడకుండుట దంతా[illegible] కలిగించుచు రాంశుసామ్యము సిద్ధించును.

"ముదమున సత్కవి కావ్యము
నదరఁగ వీలుకానిపట్టినమ్మును బర్మా

MEMORIAL LIBRARY V.R. NARLA V.R. NARLA D.P.R.I. Acc. No.

ద్భిదమై తలయూఁపింపని
యది కావ్యమె మలరి పట్టినదియును శరమే?"

(౧ ఆ. ౪౧)

వ్రాఁతపతిలో నీపద్య మిట్లున్నది:

"మదమున..... కావ్యము
నదరంగ విలుకాని పట్టినమ్ములనుం బరహ్మా
ద్భిదమై తలయూపింప్పని
యది గావ్యమె మరి పట్టినదియున్ శరమే."

దీనికి నా సంస్కరణము:

"ముదమునఁ గవికృతి కావ్యము
నదరున విలుకాని పట్టినమ్మును బరహ్మా
ద్భిదమై తలయూపును, బెఱు
యది కావ్యమె చెప్పఁ, బట్ట నదియున్ శరమే?"

ముదముతోఁ గవి రచించిన కావ్యమును, అదరుతో విలుకానిపట్టిన యమ్మును ఒరుని హృదయభేదనము గాపించి తలయూపించును. అట్లుకానిచో, రచించినంతమాత్రముచే నది కావ్యముకాదు. చేతఁబట్టినంతమాత్రముచే నది శరమును గాదు. కావ్యమును, శరమును రెండును బరహృదయభేదనము చేసి తల యూపించునవే కాని కావ్యము దానిని ముదముతోఁ జేయును; బాణ మదరుతోఁ జేయును. ముద్రితపతిలోని, వ్రాఁతపతిలోని పాఠములకు సరసాన్వయము కుదురలేదు.

"జా నటి పశుపతి నుఱక వి
ధాన మహోరంభుఁడైన దక్షుండను న
జ్ఞానికి మునుకొని వచ్చున
మానంబున నమర సతివిమానము వచ్చెన్."

[౨ ఆ. ౧౪౦ ప.]

దీనికి నా సంస్కరణము:

"జా నటి పశుపతి నుఱక వి
తానమహోరంభుఁడైన దక్షుండను న
జ్ఞానికి మునుకొని వచ్చు వి
మానంబన నమర సతివిమానము వచ్చెన్."

౭

ఆంధ్రకవిత-ప్రబంధయుగము

ఆంధ్రికవితాకలా కాల రత్నహారమున శ్రీ కృష్ణ దేవరాయల కాల మొక తరళ రత్నము. ఆ మహారాజు సుకృతవిశేష మెట్టిదో కాని, యాంధ్రికవిత యతని పాలన కాలమున దివ్యవైభవ మనుభవించినది. దివ్య సౌందర్యము తీర్చుగొనినది. తిన్నని తీరుల దిద్దుకొనినది. ఔచితీ నిర్వాహ మలపఱచుకొనినది. సంస్కృతమునందుఁగాని, సాటి భాషలగు కర్ణాట ద్రావిడములందుఁ గాని, కానరాని కావ్యవస్తు కల్పనపు మెల్పులను గల్పించుకొనినది. విక్రమార్కుని యాస్థానిలో నవరత్నము లున్నట్లు శ్రీ కృష్ణదేవరాయని యాస్థానియం దష్టదిగ్గజము లనఁబడెడు కవులు వెలసి, 'నభూతో నభవిష్యతి' యనఁదగినట్లు వింతతీరున మహా వ్రిబంధములు విరచించిరి. ఆనాఁటి కృష్ణరాయఁ డాంధ్రి కవిరత్నరత్నాకరుఁడు. ఆ మహారాజు దక్షిణ హిందూదేశమునకెల్ల నేకచ్ఛత్రాధిపత్యము వహించి యటు కటకమునను౦డి యిటు కన్యాకుమారిదాఁక గల దేశమెల్ల విజయయాత్రిలోఁ దిరిగి చూచినవాఁడు. కాన తన తిరిగిన దేశములలోఁ గానవచ్చు కవిరత్నములనెల్ల 'రత్న హారితుపార్థివ' యన్న న్యాయము చొప్పునఁ గొనితెచ్చికొనెను. కృష్ణాతీరమున నద్దంకినుండి మాదయ గారి మల్లనను, కడప

మండలమునను నుండి పెద్దనామాత్యుని, నెల్లూరి మండలమున నుండి నందితిమ్మనను, గుంటూరి మండలమునను నుండి పింగళి సూరన్నను, తెనాలి రామలింగని, నింక ననేక మండలముల నుండి యనేక కవులను నార్జించి తన సాహితీ సభాంగణము నలంకరించుకొనెను. 'సాహితీ సమరాంగణ సార్వభౌము' డనఁబరగెను.

దశమ శతాబ్దిలో నారంభమయి యిర్వదవ శతాబ్దిలో నేఁడు సాగుచున్న యాంధ్రకవితకుఁబదునాఱవ శతాబ్ది ప్రథమ పాదము సరిగా మధ్యస్థమేకదా! అది యాంధ్రకవితా దివ్యస్ర వంతికి గాంభీర్యము, లోఁతు చాలఁగాఁగల నట్టి నడి యేటిపట్టు! చాళుక్యరాజరాజు, తెలుఁగు చోళరాజు మనుమసిద్ధి, కాకతీయ ప్రతాపరుద్రుఁడు, రెడ్డిరాజ సమ్రుచ్చయమునను నాశ్రయాను క్రమమున సాగివచ్చిన యాంధ్రకవితకు శ్రీ కృష్ణరాయని యాశ్రయము పై విధమున ననిదంపూర్వమయిన యభ్యు దయముఁ జేకూర్చిన గట్టి పట్టుగొమ్మ.

ఎడనెడ నన్నయాదుల పురాణ రచనలలోను, నన్ని చోడని కుమార సంభవము, ఎట్టన నృసింహ పురాణము, మంచన కేయూరబాహు చరిత్రము, దొరకలేదు కాని తిక్కన విజయసేనము, శ్రీనాథుని శృంగార నైషధము, దుగ్గన నాచికేతోపాఖ్యానము మొదలగు కృతులలో రాయలనాఁటి ప్రబంధరచనావ్యాప్తి యించించుకగా మొలకెత్తినది. శ్రీ కృష్ణరాయని కాలమునఁ బర్యాప్త వైభవముతో నిండారి

వెలసిన ప్రబంధరచనా సంప్రదాయ వాహినికిఁ దత్పూర్వరచన లెట్లెట్లూటకాల్వలయినవో యించుక వివరింతును.

పదునై దవ శతాబ్దిదాఁక నాంధ్ర కవితా రచన పురాణ పరివర్తనపాత్రియమై యున్నది. కాని దానిలోఁ గవికి స్వైర విహారమును గావింప నవకాశము తక్కువ. సంస్కృత పురాణ ములు పాత్రికముగా సత్యార్థరచనాపరము లగుటచేత నందుఁ గవికల్పిత కథలలోవలె నౌచితీ నిర్వాహమంతగా నుండదు. మఱియు నా పురాణకర్తలేవో పరమార్థముల నిరూపించుటే ముఖ్యముగాఁ గొన్న వారగుటచేతను, నౌచితి నంతగాఁ బాటింపకయుఁ బోయిరి. యుద్ధగంగమున గీతోపదేశము, నారణ్య శాంత్యానుశాసనిక పర్వములలోని కథాకల్పనములుఁ గావ్య శిల్పదృష్టితోఁ జూడఁగా నౌచితీదూరము లగును. కాశీ ఖండమున నొకచోటఁ బతివ్రతా ధర్మములు చెప్పుట పరమార్థ ముగాఁ గొనుటచే లోపాముద్రతో వ్యాసుఁడుపన్యసించుటలో నౌచితీ భంగము వాటిల్లినది. ఇట్టివానిని బురాణములఁ దెలిఁ గించువారు తొలఁగించుకొన వీలుకాదయ్యెను. కావ్యమున కౌచితి జీవగఱ్ఱ! కావ్యమునకే యేమి? లౌకికమయిన సర్వ వాగ్వ్యవహారమునకును. నౌచితి ముఖ్యమేకదా! దీనిని బాటించు టకుఁ గవికి స్వాతంత్ర్య ముండవలెను. అందుకే శాకుంతలాది నాటకములయందుఁ బురాణకథలకు మార్పులును, ద్రౌపదికై 'అన్యథా వా పరికల్పయేత్' అన్న శాస్త్రమును నేర్పడినవి. ఆంధ్రకవితాసంపత్పితామహుఁడు పాత్రికముగా సంస్కృతపుఁ దీరు ననుసరించి పుట్టినది గాన సంస్కృతమునఁ బురాణములకుఁ

దర్వాత వెలసిన కావ్యనాటకముల యవతార మాంధ్రమునకును నావశ్యకముగాఁ గవులకుఁ దోఁచెను. ఆ తలఁపు చొప్పుననే నన్నిచోడ కుమారసంభవ, కేయూరబాహుచరిత్ర, క్రీడాభిరామ, హరవిలాస, శృంగారనైషధ, శృంగారశాకుంతల, ప్రబోధచంద్రోదయాదు లాంధ్రమున వెలసినవి. మహాకావ్య పద్ధతిని వెలసిన కుమారసంభవ, శృంగారనైషధాదులుగాక నాటకపరివర్తనము లనఁదగిన కేయూరబాహుచరిత్ర, క్రీడాభిరామ, శృంగారశాకుంతలాదులు గూడ శ్రవ్యములుగానే, చంపూకావ్యములుగానే తెలుఁగున రచితములై నవి. నాటకముల యందువచనభాగమెక్కువగా సంభాషణాత్మకముగా నుండును. సరిగా వానిని దెలిఁగించుటలోఁ బొడిపొడివచనములట్లే తెలిఁగింప వలసి యుండును. ప్రాచీనకాలమున దేశభాషా రచనలలో వచన రచన మీఁద నాదరము లేకుండెను. అందు రచనాశిల్ప మంతగా నుండదని యప్పటివారి తలఁపు గాఁబోలును! నియమబద్ధములు గాని పొడి వచనరచనలు తాళపత్రాదిలిపులలో వికృతిఁ జెంద కుండ సంరక్షించుట యసాధ్యముగాఁ గూడ వారు తలఁచియుండ వచ్చును. ఇవియో, కారణ మింక నేదో కాని నాటకాంధ్రీకరణమున వారట్టి పొడిసంభాషణపు వచనములఁ గూడ పద్యరచనలలోనే జరపి యా నాటకములనుగూడ శ్రవ్యకావ్యములుగానే కావించిరి. కాని శ్రవ్యకావ్యములకుఁ గల నానారసాలంకార వర్ణనాది మహాకావ్య పరికర పౌష్కల్యము నాటకాంధ్రీకరణమునఁ జూపఁబూనుట వైరస్యహేతువయ్యెను. కావ్యములలోని యలంకారవర్ణనాది పౌష్కల్య పరిగ్రహముతో, నాటకములలోని శుభాంతతా వస్తైక్య నానా రసోక్తిప్రత్యుక్తి

చాతురీ గ్రహణముతోఁ, బురాణ రచనములలోని రసైక పరములుగాని విపులాతివిపులమైన కథాఘట్టముల పరిత్యాగముతో, మిశ్ర కల్పితేతివృత్తములతోఁ బొందుపడి కావ్యములు లేని, నాటకములు లేని కొఱఁతను దీర్పఁగల రచనావిశేషమొకటి తెలుఁగున నావశ్యకమగుట నాంధ్రికవులు గుర్తించి యా యా గుణవిశేషములెల్ల కుదురుపడున ట్లీప్రబంధ రచనమును గావింపఁదొడఁగిరి. ప్రబంధశయ్య యను పేరును జక్కన పేర్కొన్నాఁడు.

శృంగార నైషధ శాకుంతలాదులందు సంస్కృత మూలానుసరణ పారతంత్ర్యముతో సమకూడిన ప్రబంధ రచనా సౌభాగ్య మీ విధముగా మనుచరిత్ర పారిజాతాపహరణా ముక్తమాల్యాదులయందు స్వతంత్రమయి సర్వహృద్యముగా విజృంభించినది. ఈ ప్రబంధములలోఁ బురాణములలో లేని యౌచితీనిర్వాహ కథావస్తు సంగ్రహణములున్నవి. మహాకావ్యములలోఁ గల నానా రసాలంకారాష్టాదశవర్ణనా పౌష్కల్యమున్నది. నాటకములలోఁగల సంభాషణాది చమత్కారము, వస్తైక్యము, కథానిర్వాహములో స్వాతంత్ర్యము, నంకాది విభాగములంబట్టి యాశ్వాసాదివిభాగములు నున్నవి. ఇట్టి ప్రబంధములు వెలయుటచే నానాఁడింక రఘువంశాదులవంటి మహాకావ్యములయుఁ, గాదంబర్యాదులవంటి గద్యకావ్యములయు, శాకుంతలాదులవంటి నాటకములయు నావశ్యకత తెల్గునకు లేకపోయినది.

ప్రబంధములలో విరివిసెందిన ప్రాచీన రచనాంకురము లను గొన్నింటిని, ప్రబంధములలో నాటక కావ్యానుకరణము లను గొన్నింటిని మచ్చున కుదాహరింతును. మార్కండేయ పురాణకథ ప్రబంధమార్గమున విరివిసెంది మనుచరిత్ర మయినది. అందు మృగవర్ణనచమత్కారమెల్లఁ బినవీరన్న శృంగార శాకుంతలములోని మృగయావర్ణనమును బట్టి పుట్టి పెరిగినది. వర్ణనలెల్లఁ గావ్యసంప్రదాయము ననుసరించి విపులముగా సాగినవి. వరూథినీప్రవరసంవాదము మేలయిన నాటక సంభాషణ చ్ఛాయను బొందుపడినది. శ్రీనాథుని కాశీఖండములోని 'గుణనిధి కథ' పాండురంగకవి నిగమశర్మోపాఖ్యానముగాఁ బెరిగినది. అంతేకాక యా కథ కందుకూరి రుద్రకవినోర నిరం కుశోపాఖ్యాన ప్రబంధముగానే విరివిసెందినది. పారిజాతాపహ రణ పద్మావతీ ప్రద్యుమ్నములు మహాకావ్య నాటక ధర్మముల కలయికతో వెలసినవి.

శ్రీనాథుని కాశీఖండ పద్యమిది—

"ముడువంగ నేర్తురు మూల దాపటికి రాఁ
జికురబంధము లీఁగ జీరువాఱఁ
బొన్న పువ్వులఁబోలు పొక్కిళ్లు బయలుగాఁ
గట్టనేర్తురు చీర కటిభరమునఁ
దొడువంగ నేర్తురు నిడుప్రేలుఁ జెవులందు
నవతంసకంబుగా నల్లిపువ్వు
పచరింపనేర్తురు పదియాఱువన్నియ
పసిఁడి పాదంబులఁ బట్టువెంప

పయ్యెదయు సిగ్గుఁ బాలిండ్లఁ బ్రాకనీరు
తఱచు పూయుదు రోలగందంబు పసుపు
బందిక త్తెలు సురతప్రపంచవేళఁ
గంచియఱవత లసమాస్తి ఖడ్గలతలు."

శ్రీ కృష్ణరాయని యాముక్తమాల్యదలో—

"వీడెంపుఁ బలుకెంపు విరిసి వెన్నెలగాయ
వరిగింజ నొకటఁ బల్వారుసఁ దోమ
నొరసి యొత్తిన మణుం గొందక మైనె ని
గ్గులుదేరఁ బసుపిడి జలకమాడ
ముదుక గాకుండఁ బయ్యెద లోనఁ గేలార్చి
కలయఁ జంటను వెంటఁ గలప మలఁద
రతిరయచ్ఛిన్న సూత్రమునఁ జిక్కక ముత్తె
ములు రాల గరగరికలు వహింపఁ

బొలసిననె యెట్టి నరునైనఁ గులము దెలియఁ
బ్రభుత సెడి పల్లవుఁడు వేదవడిన నేద
నృపతి వెలియంతిపురముగా నెన్న మెలఁగ
బాసఁ గృతి సెప్పవలఁతు లప్పద్మముఖులు."

అన్న పద్యముగా మాటీనది.

ఇట్లు పొడిపొడిగాఁ బాచీనాంధ్ర గ్రంథచ్ఛాయలు కృష్ణరాయలనాఁటి పరిబంధములలో నెన్నింటినేని గుర్తింప వచ్చును.

సర్వ ప్రబంధరచనా సౌభాగ్యములు పొసఁగియున్న "పారిజాతాపహరణము"ను బురస్కరించుకొని ప్రబంధ కవితా విశేషములఁ గొన్నింటిని బేర్కొందును. పారిజాతాపహరణ కథాకల్పన మొక ప్రశస్త నాటకకథాకల్పనము! ఎట్లనఁగా—

శచీదేవినగరిలో దేవేంద్రుఁ డుండఁగా శ్రీ కృష్ణుని దర్శించుటకై భూలోకమునకుఁ బోఁగోరి దేవర్షియగు నారదుఁడు ప్రభు వగుదేవేంద్రుని యనుజ్ఞ వడయుటకై యచటికి వెళ్ళెను. అప్పుడు శచీదేవి కల్పవృక్షపు దివ్యకుసుమములను గోయించి తెప్పించి పార్వతీ సరస్వతీ రతి దిక్పాలక పత్ని ప్రముఖ దివ్యాంగనల కా పుష్పములను పంపకములు వెట్టి పంపుచుండెను. కడమ పుష్పములను దేవేంద్రుని హజారమున శయ్యకు నలంకారముగాఁ బెట్టించుచుండెను. అపుడు సన్ని హితుఁడైయున్న నారదునికిఁగూడ దేవేంద్రుని ప్రేరణమున శచీదేవి యొకపుష్పము నొసంగెను. ఆ పుష్పము నతఁడు 'శ్రీ కృష్ణార్పణ మస్తు' అని గ్రహించి భూలోకమునకుఁ బోవుచుంటినని విన్నవించుకొనెను. దేవేంద్రుఁడది విని శ్రీ కృష్ణునకును, నాతని దేవేరులకును జాలినన్ని పుష్ప ములనీయ శచీదేవిని గోరెను. శచీదేవి యివి దివ్యకుసుమము లనియు, వీని ధరింప దివ్యులేకాని భూలోకవాసు లనర్హులనియు నీ పుష్పముల గౌరవము నిల్పు టావశ్యకమనియు, భూలోక వాసుల కివి నాచేతి మీఁదుగా నొసఁగననియు నీసడించి పలి కెను. నారదుఁడు సత్యభామ పేరెత్తియేమో సణుగుకొనుచు

హజారమును వీడి భూలోకమునకు విచ్చేసెను. ఇది విష్కంభ రూప ప్రథమాంక పూర్వకథ.

పారిజాతాపహరణమునఁ బ్రథమాశ్వాసము ప్రథమాంకము. శ్రీకృష్ణుఁడు రుక్మిణియింట వినోదించుచుండుట, యప్పుడు సత్యభామ చెలికత్తెగూడ నచట నుండుట, నారదుని ప్రవేశము, పారిజాత పుష్ప సౌభాగ్యవర్ణనము, శ్రీకృష్ణున కా పుష్పము నొసఁగుట, శ్రీకృష్ణుఁడు నారదసూచనలఁబట్టి కథా రహస్య మెల్లఁ గనుగొనుట, నారదుని కనుసైగ చొప్పున రుక్మిణి కా పుష్పము నిచ్చుట- యిత్యాదికము కథావస్తువు. ద్వితీయాంక కథావస్తువుగూడ నిందుఁ గొంత గలసియున్నది.

చెలికత్తె సత్యభామతో జరిగిన విషయము జెప్పుటచేత సత్యభామకోపము, శ్రీకృష్ణుని యనునయము, భూలోకమునకుఁ గల్పవృక్షమును బెఱికికొని వచ్చునట్లు ప్రతిజ్ఞ సేయుట, స్వర్గగమనము ద్వితీయాశ్వాసేతివృత్తము.

తృతీయాశ్వాసమే తృతీయాంకము. స్వర్గవీథులలో శ్రీకృష్ణుని పయనము, ఇంద్రసత్కారము, ఇంద్రుని హజార మునఁ గాక శ్రీకృష్ణుఁ డదితి హజారమున విడియుట, శ్రీకృష్ణ సత్కారాదికము, సత్యా శ్రీకృష్ణుల వన విహారాదికము నిందలి కథాంశము.

చతుర్థాశ్వాసమే చతుర్థాంకము. పారిజాతోత్పాటనము, ఇంద్ర శీకృష్ణ సంగరము నిందలి కథాంశము.

పంచమాశ్వాసమే పంచమాంకము. సత్యభామ తన విభునిచే పారిజాతమును భూలోకమునకుఁ గొని తెప్పించి ద్వారకానగరమునఁ బ్రతిష్ఠించుట-సత్యభామ పుణ్యకవ్రతము చేయుట-సత్యభామ శ్రీకృష్ణుని నారదునకు దానమిచ్చుట-పారిజాత పుష్పములను శ్రీకృష్ణుని పత్నులకు, ద్వారకావాసుల కెల్లరకునుగూడఁ బంచిపెట్టుట-శ్రీకృష్ణుఁడు భూలోకమున నుండునంత దాఁక కల్పవృక్షము భూలోకమున నుండు నట్లేర్పాటగుట-భూలోకవాసులకు సర్వ సౌఖ్యములు సమకూడుట యిందలి కథాంశము.

దీనిని నాటకముగా 'నారద విజయ' మని కాని, 'శచీ గర్వభంగ' మని కాని పేర్కొనఁదగును. నారద విజయ మనుటయే యెక్కువ సంగతము. విష్కంభాదిగా నేను జెప్పిన యీ కథాసూత్రమెల్ల నంది తిమ్మనార్యుఁడీ ప్రబంధమున గుర్తింపఁదగినట్లు సూచించియే యున్నాఁడు. నరకాసురు నోడించి స్వర్గమును దనవల్లభునకుఁ గైవస మొనర్చిన సత్యభామమహోపకృతిని మఱచిన శచీదేవికి నారదుఁడు కల్పించిన గర్వభంగమిది! కథామధ్యమున-

"వినుఁడు సురేశ్వరు వనపాలకులు వార్ధిఁ
బొడమిన యీ దివ్యభూరుహమున
కిందార్హిణి యెవ్వతె? యిందుర్హిండు నెవ్వండు?
తోడి యిందిరను గౌస్తుభము నెవ్వఁ

డధిపుఁడై ధరియించె నతఁడె చేగొనుఁగాక
తెకతేర యిది యేమి యొకరి సొమ్మే?
ఇదె నాము విభునిచే నీ వదాన్యనగంబు
నొడియించుకొని యేఁగుచున్నదాన
బలుకు లేటికిఁ దా వీరపత్ని యేని
మీ శచీదేవి తనదు పాణిగ్రహుఁడయిన
మఘవు నిటఁబంపి సత్యభామావిధేయు
వలన మరలంగఁ గొనుట పో వాసితనము."

అని సత్యభామ యనును.

ఈ విధముగాఁ బారిజాతాపహరణము నాటక ధర్మ మెంతో సంతనగా సవరించుకొన్న రుచిరప్రబంధము. ఇందు వాచ్యమయిన యీ కథేతివృత్తమే గాక వ్యంగ్యముగా నిం కొక కథేతివృత్తముగూడ నున్నది. వాచ్యకథలో శ్రీకృష్ణుడే వ్యంగ్య కథలో శ్రీకృష్ణదేవరాయఁడు. రుక్మిణీ సత్యభామలే తిరుమలదేవీ చిన్నాదేవులు. కవియే నారదుఁడు. ప్రియుఁడగు కృష్ణరాయని యాదర తారతమ్యముచే సతులలోఁ బొర పేర్చ డుట, ఆ పొరపును దీర్చి యానుకూల్యముఁ గల్గించి నంది తిమ్మనకవి శ్రీకృష్ణరాయని తన చెప్పుచేఁతలకు దిద్దుకొనుటయే పుణ్యకవ్రితవిధానము.

ఇట్లీ మహాప్రబంధము వాచ్యేతివృత్తమునకుఁ జాటున ధ్వనిగా నింకొక యితివృత్తమును వెలయించుచున్న ధ్వని ప్రధానమైన యుత్తమ కావ్యము. ఇందు మహాకావ్యమున

కుండవలసిన ప్రయాణోద్యాన వనవిహార జలక్రీడా దౌత్య యుద్ధాది వర్ణనలు బలవంతముగాఁ గావ్యత్వసిద్ధికై కల్పించిన వర్ణనలుగాఁ గాక నాటకకథలో నత్యావశ్యకముగా నపేక్షి తము లయిన నాటకాంగములుగానే పొసఁగుట గొప్ప చమ త్కారము! కవిస్వతంత్రుఁడై యీ కథలోఁ దననాఁటి శ్రీకృష్ణ దేవరాయల మహా రాజ్యవైభవములను శ్రీకృష్ణదేవుని వైభ వములతో జోడించి వర్ణించినాడు. ఇవి చదువుఁడు:

"అమరవిభుండు దూరమున నంబుజనాభునిఁగాంచి సంభ్రమో
ద్గమమునఁ జేతియంకుశముఖంబునఁగుంభములూఁది కుంచితా
గ్రీమచరణంబున న్మదకరిన్ డిగి యంసవిలంబి కల్పచే
లము నడుమ న్బిగించుచు నిలానిహితాత్మశిరఃకిరీటుఁడై."

ఈ పద్యము "ఎదురైనచోఁ దన మదకరీంద్రము నిల్పి కేలూఁత యొసఁగి యెక్కించుకొనియె" నన్నట్టు పెద్దనకుఁ, దనకు, నింక నితరకవులకు శ్రీకృష్ణరాయఁడు గజా రూఢుఁడై యేఁగునప్పుడు జరగుచు వచ్చిన సత్కారములనుబట్టి పుట్టినది.

"జలరుహనేత్రిఁగాంచి సరసత్వము మీఱఁగనొక్క వేలుపుం
జిలుకలకొల్కి రాచిలుకచేఁ బలికించిన సత్యభామకా
కలికి తెఱంగు శౌరి కడకన్నుల సన్నలఁ జూపెఁ గోపకం
దళకలుషాయితాక్షి వలనంబుల నా సతి దన్నదల్వఁగన్."

ఈ పద్యము శ్రీకృష్ణరాయఁడు గజారూఢుఁడై దేవో త్సవాదులం దూరేఁగునప్పు డనుభవించిన యనుభవ విశేషము లకు జ్ఞాపకముగాఁ బుట్టినది.

"కలికి నిడువాలుఁ గన్నుల
తళుకులు మణిదీపశిఖలుఁ దడఁబడ లక్ష్మీ
నిలయున కిచ్చిరి కొందఱు
నెలఁతలు మౌక్తిక విచిత్ర నీరాజనముల్."

శ్రీకృష్ణరాయని యంతఃపురానుభవముల కిది జ్ఞాపకము—

"దరమీలన్నయనంబులై గృహబహిర్ద్వారంబుల న్వ్యామకుం
జరము లండమదభ్రిమద్భ్రిమరికా ఝుంకార సంగీత వి
స్ఫురణల్ సూపుచుఁ గర్ణతాళనినదంబు ల్మించ నీమాగధో
త్కరమునంబోలుచుఁజూడనొప్పెనివెహస్తన్యాసముల్మీఱఁగన్."

రాయలవారి మొగసాలలో జరుగు ననుభూతుల కిది జ్ఞాపకము—

"తామరలవ్రేటు లాడుచోఁ దరుణు లెత్తు
కరరుహాంకిత బాహువల్లరులు వొలిచె
బిరుదవర్ణావళీ పరిస్ఫురితమైన
పల్లవాస్త్ర జయస్తంభ పటలి యనఁగ."

పొట్నూరు మొదలగు స్థలములందు రాయలవారు శాస నములతోడి విజయస్తంభముల నెత్తించుటకు జ్ఞాపకముగా నీ పద్యము పుట్టినది. ఇట్టి పద్యములనింక నెన్నిటినేని యెత్తి చూపవచ్చును.

"నిరుపహతి స్థలంబు రమణీప్రియదూతిక తెచ్చి యిచ్చుక
ప్పురవిడె మాత్మకింపయిన భోజన మయ్యెలమంచ మొప్పు త

ప్పరయు రసజ్ఞు లూహ తెలియంగల లేఖక పాఠకోత్తముల్
దొరకినఁగాకయూరక కృతుల్ రచియింపు మటన్నశక్యమే?"

అని పెద్దనాదు లనఁదగినట్లు శ్రీకృష్ణదేవరాయఁడు తన యాస్థానకవులకు రాజన మలవటీచి వారిని బోషించినాఁడు గాన వారును నప్పటి రాజులయుఁ, బ్రజలయు సుఖాను భూతుల కనుగుణముగాఁ బ్రబంధములను రజోవృత్తి ప్రధాన ములుగానే రచించినారు. పురాణకృతులలోని సాత్వికత యిందు సన్నగిల్లినది.

కాలక్రమమున నీ ప్రబంధముల రాజసత విపరీతమై వెఱ్ఱితలలు వేయఁజొచ్చినది. ప్రబంధకవితారచనపు మహా వైభవమును గూర్చియే దిఙ్మాత్రముగా నీ ప్రశంస.

ఱ

అరసున్న

తెలుఁగుభాషకుఁ దోడిభాషలగు ద్రావిడ కర్ణాటకము లందుఁగాని, ప్రాకృతులకు సంస్కృత ప్రాకృత భాషలందుఁగాని యరసున్న లేదుగదా! అట్టిచో నిది తెలుగునఁ నెప్పుడు పుట్టినది? ఎట్లు పుట్టినది? భాషాలక్షణములను బరిశీలించుచుఁ బూర్వపూర్వకాలమునకుఁ బోనుపోను ద్రావిడ కర్ణాటాంధ్రభాషల భేదము తక్కువతక్కువై మూఁడు నొక్కటిగానే యున్న కాలముగూడ నొకప్పు డుండుటను మనము గుర్తింపఁగలము. నన్నయకుఁ బూర్వకాలమున నీ యరసున్న యున్నదనుట కాధారము నాకుఁ గానరాకున్నది. నన్నయాదుల నాళ్ళనుండియే యరసున్న వెలయఁజొచ్చి నట్టు వారి గ్రంథములఁబట్టి గుర్తింపనగుచున్నది. సహజముగాఁ బదమందున్న యొక యక్షరమునకో, కొన్ని యక్షరములకో ఆదేశమై వచ్చినదిగాని నాసిక్యహల్లు ఇతరహల్లుతో సంయుక్త మయినప్పు డేర్పడిన హల్ ద్విత్వము శిథిలము కాఁగా నందలి శిథిలానునాసిక మే యరసున్నగా నన్నయాదుల కాలముననుండి మాఱె నని చెప్పఁదగును. దీని కించుక వివృతి—

ద్రావిడ కర్ణాటభాషలలో సంయుక్తహల్లులు పూర్వా
తురమునకు గురుత్వమును గల్పింపకుండఁ బెక్కులు గలవు.
అట్టివానిలో పెక్కింటి ద్విత్వము తెలుఁగుఁదనము వేర్పడి
యేర్పడిననాఁటికి మాసిపోయినది. తెగల్గుం, నెగల్గుం ఇత్యా
దులు తెగడున్, నెగడున్ ఇత్యాదిరూపములఁ బడసినవి.
హల్ ద్విత్వములో ద్వితీయహల్లు లోపించినప్పు డిట్టిరూపము
లేర్పడినవి. మొదటిహల్లు లోపింపఁగా నేఁటి మన యరసున్న
యైనది. మెఱుమ్=మెఱుపు. దీనిమీఁద బహువచన ప్రత్యయ
మగు 'కళ్' గలయఁగా 'మెఱుమ్గళ్' అయ్యెను. 'కళ్'
ప్రత్యయమే తెలుఁగుఁదనమును బడయునాఁటికిఁ బెక్కుశబ్ద
ములమీఁద 'గులు' గాను 'గలు' గాను, 'కులు' గాను 'కలు'
గాను మాఱి, తొలియక్షరములగు 'గు' 'గ''కు''క'లు ప్రాతి
పదికమునఁగలసి బహువచనప్రత్యయముగా, 'లు' మాత్రమే
మిగిలెను. అడుగులు, నుడుగులు, గొడుగులు, వెలఁగలు,
ఈఁగలు, కొలఁకులు, వలఁకులు, చిలుకలు, ఎలుకలు ప్రభృతు
లిట్టివే. క్రమముగా మెఱుమ్గళ్, మెఱుమ్గుళ్, మెఱుమ్గుళు,
మెఱుమ్గులు అను రూపము లేర్పడెను. ఇక్కడ వికల్పముగా
శిథిలద్విత్వము మేర్పడుటచే మకారమును ఊఁది పలుకుట,
తేల్చిపలుకుట యను భేదముచే రెండు రూపము లేర్పడినవి.
ప్రాకృత సంవ్రదాయమునుబట్టి వర్గానునాసికములకు సున్న
పెట్టుట యేర్పడఁగా 'మెఱుంగులు' అను రూప మేర్పడెను.
ద్విత్వము శిథిలము కానప్పుడు ప్రాయికముగా 'మెఱుంగ్గులు'
అను లిపియును, శిథిలమయినప్పుడు 'మెఱుగులు' అను లిపి
యును ఉండెను. లిపిలో అరసున్న ప్రాఁత మున్నూఱేండ్లకు

ముందు లేనేలేదు. ఈ బహువచనరూపమునననుండి ప్రత్య
యావయవమగు 'గు' ప్రాతిపదికమునఁ జేరఁగా మెఱుంగు,
మెఱుఁగు అని యేకవచన రూపములు పుట్టెను. నన్నయ
నాఁటి కీ పరిణామము ప్రబలమయి శిథిలద్విత్వ మను వ్యవ
హారము శిథిలము కాఁజొచ్చినది. ప్రాకృత సంప్రదాయము
చొప్పున వర్గానునాసికము తొలిహల్లుగాఁగల సంయుక్తా క్ష
రములందు అనునాసికమునకు బదులు సున్ననుంచు సంప్ర
దాయము పెంపొందఁ జొచ్చినది. కర్ణాటకభాషలోఁగొన్ని
శబ్దముల ద్విత్వమునకు నిత్యముగాను, గొన్నింటికి వైకల్పికము
గాను శైథిల్యముగలదు. అట్టి పదములు మన తెల్గుఁదనమును
బొందునాఁటికిఁ గొన్ని యశిథిలద్విత్వములుగానే నిలిచినవి.
కొన్నింట ద్విత్వము లోపించి మొదటిదో, రెండవదో ఏదో
ఒక హల్లే నిలచినది. కొన్నింట ద్విత్వము విడఁబడి నడుమ
నచ్చుగూడినది. కొన్నింట నాసిక్యముగాని, తొలిహల్లు
లోపించి తత్ స్థానమున నాసిక్యహల్లేర్పడినది. కర్ణాటకశిథిల
ద్విత్వములకును, తెలుఁగు శిథిలద్విత్వములకును గొన్ని భేద
ములు గలవు.

మీఁదఁ బేర్కొన్న పదములలో వెలఁగలు, ఈఁగలు,
కొలఁకులు, వలఁకులు అనువానిలో నిట్లే అరసున్నలు పుట్టినవి.
వెలఁగచెట్టునకు అజవమున 'వెలమ్' అని పేరు. 'వెలమ్‌గళ్'
నుండి 'వెలఁగలు' వచ్చెను. ఈఁగలు - ఈ పదములో 'ఈ'
ప్రాతిపదకము, కళ్ ప్రత్యయము కలసి పరిణామములఁబొంది
తెలుఁగుఁదనము వచ్చునాఁటికి ఈఁగలు బహువచన రూపము

గాను, ఈఁగ ఏకవచన రూపముగాను నయ్యెను. ఆఅవమున ఈఁగకుఁ బేరు 'ఈ' అనియే. బహువచనమున నది 'ఈగళ్' అగును. కాని యిందు శిథిలద్విత్వతల్లోపాదిక మేదియు లేదు గదా, 'ఈఁగలు' అని తెలుఁగున నరసున్న యెట్లు వచ్చెను అని ఆక్షేపము తోఁచును. పరిశీలింపఁగా నిందు శిథిలద్విత్వము కలదని యేర్పడును. మఱికకు 'ఈ' అను పేరు అది చేయు ధ్వనిని బట్టి వచ్చెను. దాని ధ్వనియగు ఈకారము అచ్చులలోని దగు తాలుజన్యమయిన 'ఈ' మాత్రమే కాదు. ఈ ఈకారము ప్రధానముగా నాసిక్యము గూడనగును. ఒక రేదేని చెప్పు చున్నప్పుడు వినువారు 'ఊఁ కొట్టుట'లో ఊకారముకూడ నిశ్లే ఓష్ఠ్యము మాత్రమేకాక నాసిక్యముగూడ నగును. ఈఁగల ధ్వనిని, ఊఁకొట్టుటను నుచ్చరించునప్పుడు ముక్కుతో నుచ్చ రింపవలసియుండును. ముక్కు మూసుకొని వీని నుచ్చరింపఁ గుదురదు. కావున ఈఁగల ధ్వనిలోని ఈ కారమునకును, ఊఁకొట్టుటలోని ఊకారమునకును అంతమునఁగల నాసిక్యధ్వని 'గళ్' పరమయినప్పుడు కవర్గానునాసికమగు 'ఙ్'గా విన వచ్చును. అప్పుడు ఈఙ్ గళ్ ఊఙ్ కొట్టు పదములు వచ్చును పూర్వోక్తవిధమున నివి వికల్పముగా శిథిలద్విత్వములై యనునాసికస్థానమున సున్నలఁ బొంది ఈంగలు, ఊంకొట్టు-ఈఁగలు, ఊఁ కొట్టు రూపములఁ బడసినవి.

కొంత కాలమునకు దీర్ఘముమీఁది సున్న నూఁదిపలుకుట మాసి తేలఁబలుకుచే నిలిచెను. కాలక్రమమున ఈంగలు, ఊంకొట్టు రూపములు పోయి ఈఁగలు, ఊఁకొట్టు రూపములే

నేఁటికి మిగిలినవి. ఱేపటికాలమున నిఁక నీ యరసున్నలుగూడ నంతరింపనున్నవి. నన్నయకుఁ బూర్వకాలమునను, నించుక తర్వాతి కాలముననుగూడ నేఁటి యర్ధానుస్వారము అనునాసిక సంయుక్తాక్షరముగా నుండుటను. నా సంయుక్తాక్షరము పూర్వాక్షరమునకు గురుత్వమును గూర్చక శిథిలముగా నుండు టను బెక్కు శాసనములు నిరూపించుచున్నవి. నన్నయకుఁ బూర్వపు శాసనములలో పండరంగ శాసనమందును, యుద్ధమల్ల శాసననుందును నీ తీరును జూడవచ్చును. నన్నయకుఁ దర్వాతి వానిలో దక్షిణ హిందూదేశ శాసనసంచయము ౪ వాల్యూంలో ననేక పద్యశాసనము లిట్టి తీరులవి గలవు. మాదిరి కొకటిరెండు పద్యములఁ జూపుచున్నాఁడను. క్రీ. శం॥ వ వాఁటి శాస నము:—

గీ. సకల వసుమతీశ మకుట లసద్రిత్న
కిరణరుచి విరాజి చరణుణ్డాయిన—

క్రీ. శం॥ వ నాఁటి శాసనము:—

క. సూరి కవిస్తుతు ణ్డనఘుండు
చారుచతుర్థాన్వయాబ్ధిచందుర్ణ్డు గుల ని
స్తారకుణ్డు సుజననిధి రిపు
వారణగజరిపుణ్డు బుద్ధవమ్మ జనించెను.

ఈ పై పద్యమున అనునాసికసంయుక్తహల్లు ఒకచోట ననునాసికస్థానమున సున్నతో నుండుట గాననగును. ఇది యనునాసికములు సున్నలుగా లిపిలో మార్పుచెందుచున్న కాలము. సున్నలుంచుట యింకనుఁ బ్రబలముగాలేదు. స్తుతుణ్డు

అనియున్న విధమునఁ గాక, తర్వాత 'అనఘుండు' అని 'ణ్డు'కు బదులు 'ండు' ఉన్నది.

నేను మీఁదఁ బేర్కొన్నవిధమునఁ దెలుఁగునఁ గల యరసున్నలు ప్రాయికముగా సంయుక్తహల్ లోపమువలన నేర్పడినవిగాఁ గుదురుచున్నవి. అరసున్నలు గల శబ్దముల నింక నీ విధమున సమన్వయించి చూచెదను.

ప్రొఫెసరు శేషగిరిశాస్త్రిగారు పూర్వము అర్ధానుస్వారమునుగూర్చి యొక గ్రంథము రచించి ప్రకటించిరి. వెనుక ఎప్పుడో నేను దానిని చూచితిని. ఇటీవల నా కది యొక్కడను గానరాలేదు. దీనిని నేను వ్రాయుటలోఁ బూర్వమెప్పుడో యా గ్రంథము చదువుటవలనఁ గలిగిన జ్ఞానవాసన యే మేని పనిచేసియుండవచ్చును. కాని వారి గ్రంథమున అర్ధానుస్వారము పుట్టుటకు నే నిప్పుడు చెప్పిన ప్రక్రియ యున్నట్లు లేదు. అతురలోపస్థానీయముగా అరసున్న వచ్చెనని వారు వ్యాసియుందు రని స్మరించుచున్నాను. ద్వితీయైథిల్యాదికమును వారు గుర్తించియుండరు. 'ఆంధ్రశబ్దతత్త్వ'మని వారు ప్రకటించిన వేఱొక గ్రంథమున నేఁ జూచితిని. అందు వారు కొలఁకులు మొదలగు శబ్దరూపములు 'కళ్' ప్రత్యయము కలయుటచేత నేర్పడినవని నిరూపించిరి. బహుకాలమునకుఁ బూర్వము వారు కొంత ప్రశస్త పరిశోధనము నెఱపి గ్రంథములఁ బ్రకటించిరి. కాని వానిమీఁద నింక నెంతో మంచి పరిశోధనము సెంపొందవలసి యున్నది.

౬
వింత నిఘంటువులు

---

౧ ఆలజాలము

"ఆలజాలంబు నీరిలో సాడుజాడ
గాలిపడగ యాకసమునఁ గ్రాలుత్రోవ
నిదురలోపలఁ గలఁదోచు నీడవిధము
గానవచ్చు నె యప్పుడ కన్నఁగాక!"

కలలోఁ గన్న పురుషుని, నా చూచినప్పుడు గుర్తింప వలసినదే కాని పిదప మరలఁ గాననగునా యని యుషతోఁ జిత్రరేఖ యను సందర్భమున, ఉత్తరహరివంశమునఁ బంచ మాశ్వాసమునఁ బై పద్య మున్నది. ఇందు 'ఆలజాలము' అన్న పదమున కర్థము గావలెను. ఈ పదము తెలుఁగున నా కన్యుత కానరాలేదు. సంస్కృతమునఁ గాదంబరిలో రెండు చోట్లఁ గానవచ్చినది.

౧. "యేషాం చ శూద్రాణాం ప్రజ్ఞా పరాభిసంధానాయ న జ్ఞానాయ శ్రుత మాలజాలాయ."

౨. "ఇత్యేతాని చాన్యాని చాలజాలాని దుర్జీవితగృహీతా చిన్త యన్తి జాగ్రత్యేవా ఒతిష్ఠమ్."

ఇందు తొలివాక్యమున 'ఆలజాల' పదమునకు ముద్రిత వ్యాఖ్యలో టీక లేదు. రెండవ వాక్యమున "ఆలజాలాని =

స్వప్నాంతర్గతప్రాయాణి" అని యర్థ మున్నది. సంస్కృత మున నింక నితరత్ర నా కీ పదము గానరాలేదు.

కన్నడమున పంపభారతమున 'బాణజాలమదు భోంక నెనోడువు డాళజాల మాయ్తెనె కడిదొట్టి' (౧౨-౬౮) అని యున్నది. పై కర్ణాటకప్రయోగమున, ఆలజాలపదము నకు ఛిన్నభిన్న మయినది, మాయమయినది అన్న యర్థము పొసఁగును. కాదంబరీప్రయోగములకు పలవరింత, చీకాకు అన్నరీతి నర్థము పొసఁగును. తెలుఁగు ప్రయోగమున కీ యర్థములు పొందుపడవు. ఔపచారికముగా నేదో యర్థము పై ప్రయోగముల కనుగుణముగఁ గుదుర్చుకొనవలెను. కాని, వృద్ధానుశ్రుతిలో 'ఆలజాలం మీనపదమ్' అని నిఘంటు వాక్య మున్నది. ఈ వాక్య మేనిఘంటువులోనిదో యెఱుఁగరాదు. నా చూచినంతవఱకు నే సంస్కృత నిఘంటువునను గానరాలేదు. ఇది నాచనసోమనపద్యమున కై యే పుట్టిన నిఘంటువేమో యనిపించుచున్నది. ఈ నిఘం టువు ప్రకారమునఁ జూడఁగాఁ పద్యమునకుఁ జక్కని యర్థము పొసఁగును. నీటిలో చేపయడుగు నడచుజాడ, ఆకసమున గాలిపడగ యాడుతోరివ ఇత్యాదిగా సుందరమయిన యర్థ సంగతి యేర్పడును.

"ఔదుంబరాణి పుష్పాణి, శ్వేతః కాకశ్చ దృశ్యతే,
మత్స్యపాదో జలే దృశ్యః, నారీచిత్తం న దృశ్యతే."

అని శ్లోక మొకటిగూడ ఆలజాలమునకు మీన పదార్థ మును బలపఱచునది గలదు. మఱియు—

"తటతట నన్నీటిమీఁద నాలజాలంబు
నిటునటుఁ జరియించదా యీఁదియీఁది
ఆటువలెనే పో తమకమందిన సంసారపు
ఘటనకై తిరిగితిమి కడగానలేక."

"ఆలపోతువానితోడ నంటిన మేనివాఁడు
ఆలగాపరులతోడ నాడినవాఁడు
ఆలజాలమై నన్నీట నలరఁ దేలినవాఁడు
ఆలపోతుకొండమీఁద ననువైనవాఁడు."

(తాళ్ళపాకవారి పదములు.)

నాచన సోమనాథుని "యాలజాలంబు నీరిలో నాడు జాడ" యన్న ప్రయోగముకంటె స్పష్టముగాఁ బై తాళ్ళపాకవారిపదములు 'ఆలజాల' మనఁగా 'మీనపద' మన్న యర్థమును సమర్థించుచున్నవి.

౨. మాఘమాసే గవామివ

"అర్జునస్య ఇమే బాణాఃనేమే బాణా శ్శిఖండినః,
కృన్తన్తి మమ గాత్రాణి మాఘమాసే గవామివ."

మహాభారతము భీష్మపర్వమున (౧౭౦-౬౪) నీ శ్లోక మున్నది. తిక్కనసోమయాజులవారు దీని నీ క్రిందివిధమునఁ దెలిఁగించిరి.

"అశనికల్పము లివి యర్జునుబాణముల్
గాని శిఖండివి గావు సుమ్ము
కర్కటి గర్భంబు కరణి గాత్రము వ్రచ్చె
నిట్టివి వానికి నెందుఁ గలవు."

'మాఘమాసే గవా మివ' అన్నదానికి 'కర్కటి గర్భంబు కరణి' తెలుఁగుసేఁత. ఈ తెలుఁగుసేఁత కనుగుణ

ముగా నొక వింతనిఘంటువు గలదు. 'మాఘమా కర్కటీ పోక్తా తదపత్యంతు సేగవా.' ఈ నిఘంటు వెక్కడిదో యెఱుఁగరాదు. కాని తిక్కననాఁటికే యిది కలదో, తిక్కన తెలిఁగింపును బట్టి పుట్టినదో యెఱుఁగరాదు. 'మాఘమాసే గవామివ' అన్న చరణమునకు సరళరీతిని 'మాఘమాపే, గవామ్, ఇవ' అన్న పదవిభాగమే తోఁచును. 'మాఘమా, సేగవామ్' అన్నది కుటిలరీతి. మాఘమా-ఆకారాంత స్త్రీలిం గము గాఁబోలును. ఈ పైశ్లోకార్థమున కీ నిఘంటువును, నీ నిఘంటువున కీ శ్లోకమును నాశ్రీయములు. సాతవాహనసప్త శతిలో మాఘమాసే, గవామివ అన్న పదవిభాగమున కను గుణ మనఁదగినది గాథ యొకటి కలదు.

"విక్కిణఇ మాహమాస—మ్మిపాఁమకో పాఇడిం వఇల్లేణ
ణిద్ధూమ ముమ్మురవ్వి అ—సామలియథణో పడిచ్ఛన్తో."

దీనికి శ్రీనాథుని తెలిఁగింపు:

"మాఘమాసంబు పులివలె మలయుచుండఁ
బచ్చడం బమ్మికొన్నాఁడు పణములకును (పసరమునకు)
ముదితచన్నులు పొగలేని ముర్ముఱములు
చలికి నొఱగోయ కేలుండు సైరికుండు." (క్రీడాభిరామము)

ఇందు మాఘమాసమున గోవులు తక్కుపధరలకును, పచ్చడములు పెచ్చుపధరలకు నమ్మకమునకు వచ్చుట చెప్పఁబడినది. మాఘమాసమున గోవులధరలు పడిపోవుట చలికాలమున వానికి వ్యాధ్యాదిబాధ లుండుటచేఁ గాఁబోలును. భారతకాలమునుండి రెండువేలేండ్లకిందటినాఁటిదాఁక మాఘ

మాసము నేఁటి ధనుర్మాసమువలె శైత్యాధిక్యము గలది గాఁబోలును.

౩. అట్టశూలాజనపదాః

పురాణములలో కలికాలవర్ణనఘట్టమున నీ శ్లోక ముండును:

"అట్టశూలా జనపదా శ్శివశూలా శ్చతుష్పథాః,
ప్రమదాః కేశశూలిన్యో భవిష్యంతి కలౌ యుగే."

ఈ శ్లోకమున కర్థ మెఱుఁగరాదు. 'అట్టశూలంబుల యగును దేశములెల్ల' అన్నరీతిని దెలిఁగింపవలసినదే. నేఁటి శైదువందలయేండ్లపూర్వకాలముఁనాటి దగు పరిసంగరత్నావళిలో నీ పురాణశ్లోకమున కీ కిర్రింది నిఘంటువునుఁబట్టి యర్థము చెప్పఁబడినది.

"అట్ట మన్న మితి ప్రోక్తం, బ్రాహ్మణశ్చ చతుష్పథాః,
కేశో యోని, శ్శివో వేదః, శూలో విక్రయ ఉచ్యతె."

౪. రఘుకులాన్వయరత్నదీపం

"శ్రీరాఘవం దశరథాత్మజ మప్రమేయం
సీతాపతిం రఘుకులాన్వయరత్నదీపమ్
ఆజానుబాహు మరవిందదళాయతాక్షం
రామం నిశాచరవినాశకరం నమామి."

ఈ శ్లోకము నిశ్శే యాపామరపండితము పఠింతురు 'రఘుకులాన్వయ రత్నదీపం' అనుట కర్థము పొసఁగదు. ఈ కిర్రింది వింతనిఘంటువు పొసఁగించును.

"అన్వయస్తు సముద్రస్స్యాత్–రత్నదీపశ్చ చంద్రమాఃఁ."

౫. వానవా

"గ్రంథగ్రంథిం తదా చక్రే మునిర్గూఢం కుతూహలాత్
యస్మిన్ ప్రతిజ్ఞయా ప్రాహ మునిర్ద్వైపాయన స్త్విదమ్.
అష్టౌ శ్లోకసహస్రాణి హ్యష్టౌ శ్లోకశతానిచ,
అహం వేద్మి శుకో వేత్తి, సంజయో వేత్తి వానవా,
తచ్ఛ్లోకకూట మద్యాపి గ్రథితం సుదృఢం మునే
భేత్తుం నశక్యతేఽర్థస్య గూఢత్వా త్ప్రశ్రితస్యచ."
—భా. ఆ. అనుక్రమణికాధ్యాయము.

'సంజయో వేత్తి వానవా' యనుచోట సరసార్థ సంధాయకముగా నొక వింతనిఘంటువు గలదు. "వానవా దీర్ఘదర్శి స్యాత్" అని యది.

౬. అక్రీతదాసః

"యస్యస్తౌతి మతిం మనీషిసదసి శ్రీనీలకంఠాధ్వరీ
కొండాజ్యోతిషికశ్చ యస్య కురుతే సమ్మాన మాచార్యస్సమమ్
యత్రానుగ్రహదృష్టి మర్పయతి చ శ్రీబాలకృష్ణో గురుః
సోఽయం దీవ్యతి చొక్కనాథమఖినా మక్రీతదాసః కవిః."

"అక్రీతదాసో జామాతా" అని వింతనిఘంటువు. రామభద్రదీక్షితుఁడు చొక్కనాథమఖికి అల్లుఁడే. కాని యీ నిఘంటు వెక్కడిదో?

౭. వల్మీకః

"వల్మీకాగ్రాత్ ప్రభవతి ధనుఃఖండ మాఖండలస్య"
అన్న మేఘసందేశవాక్యమున కర్థము కుదుర్చనుగాఁబోలును "వల్మీక స్సాతపో మేఘుః" (ఎండతోడి మబ్బు వల్మీక మనఁబడును) అన్న నిఘంటువుమక్క నెవ్వో పుట్టించిరి. వ్యాఖ్యా

తలు గొంద జీ నిఘంటువు నుదాహరించిరి. కాని యది యే నిఘంటువులోని దనిరో నా కెఱుకపడలేదు. పుట్టమీఁదినుండి యిందర్భిధనువు కానవచ్చు ననుటకు బృహత్సంహితాపర్భిమాణమును, దదనుగుణముగా "పుట్ట వెడలి నభోభిత్తిఁ బుట్టు శకర్భి కార్ముకపుఁ బెద్ద పలువన్నె కట్లఁజెట్టి" అన్న యాముక్తమాల్యదాపర్భియోగమును శ్రీవేంకటరాయశాస్త్రిగారు మేఘసందేశాంధర్భివివరణమునఁ బర్భికటించిరి. "వల్మీక స్సాతపో మేఘుఃఁ" అన్న నిఘంటువు నెవ్వఁడో యెఱుక చాలనివాఁడు సృష్టించినాఁడనవచ్చును.

ఁ. గంధర్వనగరమ్

రామాయణమునను, కాదంబర్యాది గర్భింథములందును 'గంధర్వనగర' మను పదము మిథ్యార్థమున, అనఁగా చూపట్టియుఁ జూచుచుండఁగనే మాయమగునది యన్నయర్థసందర్భమునఁ బర్భియోగింపఁబడినది. ఆకసమున నగరాకారముగా గోచరించుమేఘచిత్రములను గంధర్వనగరములనుట ప్రసిద్ధము. బృహత్సంహితాది జ్యోతిషగర్భింథములందు వాని స్వరూపవర్ణనము విపులముగాఁ గాననగును. ఈ విషయము నెఱుఁగకో యేమో పూర్భిచీనులే యెవ్వరో "గంధర్వ స్స్వప్న ఈరితఃఁ" అని నిఘంటువును గర్భింథస్థీకరించి రని శ్రీ రామకృష్ణకవిగారు వెల్లడించిరి. ఈ నిఘంటువునుబట్టి గంధర్వనగరమనఁగా 'గలలోఁ గానవచ్చిన పట్టణము' అని యర్థమగును.

ర. జీర్ణారణ్యమ్

ఉత్తరరామచరితర్భిమున—

"చిరం ధ్యాత్వాధ్యాత్వా నిహిత ఇవ నిర్మాయ పురతః,
ప్రవాసే చాశ్వాసం నభలు న కరోతి ప్రియజనః.
జగ జ్జీర్ణారణ్యం భవతిచ కళతర్వ్యుపరమే
కుకూలానాం రాశా తదసుహృదయం పచ్యత ఇవ." (౬—౩౫)

అన్న శ్లోకమున 'జీర్ణారణ్య' పదమునకు 'పాడువాటిన యడవి' అని యర్థము సంగతమగుచున్నను. సారస్య విశేషా ధాయకమని కాఁబోలును వ్యాఖ్యాతలు "జీర్ణారణ్యం శ్మశానం స్యాత్" అని నిఘంటువు నుదాహరించిరి. ఈ నిఘంటు వెక్కడిదో!

౧౦. శమీపత్రమ్

"శమీపత్రప్రమాణేన పిండం దద్యా ద్దయాశిరే,
ఉద్ధరే త్సప్తగోత్రాణి కుల మేకోత్తరం శతమ్."

పరిత్యాబ్దికశ్రాద్ధపరియోగమున పిండపరిదానకాల మున గయపిండదానపరిశంసాపరముగ నీ శ్లోకమును వైది కులు పఠింతురు ఇక్కడ జమ్మియాకంతమాత్రిము (అనఁగా నొక యున్నపు మెదుకు అగును) గయాశిరమునఁ బిండపరిదా నము చేసిన నది సప్తగోత్రిములను, నేకోత్తరశతకులములను నుద్ధరించును అని యర్థము పొసఁగుచునే యున్నను, ఏలో కొందఱు "శమీపత్రింతు కందుకమ్" అనియు, "శమీపత్రిం కుక్కుటాండమ్" అనియు శమీపత్రిపదమునకు బంతియని, కోడిగుడ్డని అర్థము వచ్చునట్లు నిఘంటువులఁ జెప్పుచున్నారు. కాని పాల్కురికి సోమనాథుఁడు—

ఆకాంత శ్రీగిరియం దొక్క జమ్మి
యాకు పట్టెడునంత యన్న మొక్కనికి

దానంబు సేయు నుద్యత్ఫలంబునకు
మాసుగా నవియ సమానంబు లనఁగ."

(పండితారాధ్యచరిత్ర, పర్వతప్రకరణము)

అని 'శమీపతత్రిపత్రిమాణ' పదమునకు 'జమ్మియాకంత' అన్నయర్థమే ప్రాచీనవిద్వత్సమ్మత మగుట గ్రంథస్థపఱిచి నాఁడు.

౧౧. ప్రసన్నవదనమ్

"శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్,
ప్రసన్నవదనం ధ్యాయే త్సర్వవిఘ్నోపశాంతయే."

ఈ శ్లోకమును వైష్ణవులు విష్ణుస్తుతిగాఁ బఠింతుఁరట దాని కిందు 'విష్ణుమ్' విశేష్యమగుట సాధకమే కాని, 'శశివర్ణమ్' 'శుక్లాంబరధరమ్' అన్న విశేషణములు బాధకము లగును. స్మార్తులు విఘ్నేశ్వరపూజలోఁబ్రథమమునవే విఘ్నేశ్వర స్తుతిగా దీనిని పఠింతురు వీరికిందు విఘ్నేశ్వరవాచకము విశేష్యము చర్వట మయినది. ఈబాధ తొలఁగుటకే యేమో యీ కిందినిఘంటువు పుట్టినది; "ప్రసన్నోమత్తవారణః" 'ప్రసన్న' మనఁగా మదపుటేనుఁగు. 'ప్రసన్న వదనుఁ'డనఁగా 'మదగజాననుఁడు.' విఘ్నేశ్వరవాచక మయినవిశేష్యపదము పయినిఘంటువుచే ఘటిల్లినది. జైను లీ శ్లోకమును శ్వేతాంబర జినదేవతాస్తుతిపర మందురఁట. ఇట్లు నానాదేవతాస్తుతిపర ముగా నీ శ్లోకము పెఱుగుచుండుటను గమనించి కొంచె విద్వాంసుఁ డొకఁడు దీనికి గార్భభస్తుతిపరముగా నర్థము చెప్పినాఁడు.

౧౨. సుందరకాండ

రామాయణమున నైదవ కాండమునకు సుందర కాండ మని పేరగుటకు పలుపురు పలుతీరుల నర్థములు చెప్పు చున్నారు, ఆ యర్థములకు నిఘంటువులఁ జెప్పుచున్నారు. "సుందరో హనుమాన్ స్మృతః" అనియు, "సుందరం త్వంగు ళీయకమ్" అనియు ఆ నిఘంటువులు హనుమంతునికి సంబం ధించిన కథార్థము గలదిగాన, మటి యంగుళీయక ప్రదాన కథాప్రధాన మయినదిగాన 'సుందరకాండ' మని పేరయ్యె నని పై నిఘంటువు లర్థము గుదుర్చును.

౧౩. మదిరాక్షి

మదిరాక్షి, మదిరాయతలోచన ఇత్యాదివిధముల సంస్కృతాంధ్రములలో స్త్రీవర్ణన ముండును. దీనికి 'మద్య పానము చేయుటచే నెఱవారిన కనులవంటి కనులుగలది' అని కొంద అర్థముచెప్పుదురు. 'మదిరో మత్తఖంజనః' అని ఒక నిఘంటువు నుదాహరించి, మదిరశబ్దమునకుఁ బొగ రెక్కిన కాటుకపిట్ట యనియు, దానివంటి కనులు గలదిగాన మదిరాక్షి యయ్యె ననియు పలువు రర్థము చెప్పుదురు. 'మదిరో మత్తఖంజనః' ఎక్కడిదో తెలియదు. కొన్ని వ్యాఖ్యానగ్రంథములలోఁ గూడ నిది గలదు. ఇటీవల ఉద్యాన పత్రికాధిపతులు శ్రీ తాతాచార్యులుగారు శృంగార దృష్టులలో నొక దృష్టివిశేషమునకు 'మదిర' మని పే రుండుటను నాట్యశాస్త్రమునుండి యుద్ధరించి చూపిరి. కాన 'మదిరో మత్తఖంజనః' అన్నది అప్రౌఢకల్పితనిఘంటు వగుట వ్యక్త మయినది.

౧౮
గ్రంథ గ్రంథులు

ఆంధ్రగ్రంథములందు ముడులువిడనిగ్రంథగ్రంథులుగాఁ గొన్ని పద్యములు, పదములు గానవచ్చుచున్నవి. అట్టివానిలోఁ గొన్నింటి కిక్కడ నాచేతనయినంతలోఁ జిక్కులు విడఁదీయఁ బ్రయత్నము చేయుచున్నాఁడను.

౧. చందమామఘుటిక

"పాత్రిసంశుద్ధి కాజ్యం బుపస్తరించి
యూరకుండిరి యిది యేమి యొక్కొవీరు?
కానరా విప్డు శాకపాకములు నెదుర
మనకు నిఁమయ్యె నల చందమామఘుటిక."

(భీమఖండము.)

కాశిలో వారముదినములనుండి తిండిలేక త్రిప్పులఁ బడుచున్న వ్యాసాదిమహర్షు లొక పెద్దముత్తయిదువ యన్న ప్రదానము చేయుదు ననఁగా ననుష్ఠానములు దీర్చుకొని కూర్చుండిరి. విస్తళ్లు వేసిరి; పాత్రాభిఘారముచేసిరి. అంతే! వడ్డనగాని, యింట వంటవాసనగాని కానరాదయ్యెను. అప్పుడు వ్యాసుడు అనుకొన్న ట్టున్నచొప్పు పయిపద్యము. ఇందు "మనకు నిజమయ్యె నల చందమామఘుటిక" అన్న పాద మున కర్థము కావలెను.

"తూష్ణీం స్థితాఃకి మేతన్న నాఽన్నాదిక మవేఱ్యతే;
సత్యాఽభూ దధునాఽస్మాకం శశాంకఘుటికాకథా."

అని పయితెలుఁగుపద్యమునకు సంస్కృతశ్లోకము. నా కిట్లుతోఁచినది: ఉడుగక మాఁతామునపట్టి యేడ్చుచున్న పసి బాలురను పెద్దవారెత్తుకొని, వెన్నెలలోని కరిగి కనువిందు గొబుపుచందమామను జూపుచు "చందమామ రావే జాబిల్లి రావే.... వెండిగిన్నెలో వెన్న పెట్టుకుని, పమిడిగిన్నెలో పాలు పోసుకుని, ఒలిచిన పండు చేతఁ బట్టుకుని, ఒలవనిపండు ఒడిలో ఉంచుకుని రావే చందమామా, ఆబ్బాయీ నీవూ ఆర గింతురు కానీ" అని పాటపాడుచు చందమామ తన కేదో తినుబండారములు తెచ్చిపెట్టునని బాలకు లూఅడిల్లియుండు నట్లు మోసగింతురు. ఇదీ శశాంకఘుటికాకథ. సంస్కృత భీమఖండమునను, తెల్గుభీమఖండమునను 'శశాంకఘుటిక-చందమామఘుటిక' ఉన్నదిగాని, ఈ నానుడి విష్ణుపురాణమున మఱొక్కమాడ్కిగా నున్నది.

"అందని పంటి కేమిటికి నట్లు నిగిడ్చెదు విష్ణుఁ డన్నయా
కందువ, చందమామగుటకల్, విను మీపని కట్టిపెట్టు"
(౨ అశ్వా.)

ఇక్కడకూడ 'ఘుటికల్' అని మార్చవచ్చును గాని అచ్చులో 'గుటకల్' అనియే కలదు. ఈ పాఠమునకు, చందమామ యేమో తెచ్చిపెట్టఁగలఁడని నోరూరఁగా బాలకులు గుటకలు మ్రింగుచుఁ జూచుచుండు టర్థమగును. భీమఖండపు

'ఘుటిక' కంటె నీ 'గుటక' సారస్యముగలది. కాని సంస్కృ
తపు 'ఘుటిక'కు 'గుటక' తెలిఁగింపుగాదుగదా!

ఈ 'చందమామగుటక' మాదిరిగా 'చందమామ
గ్రుక్కిళ్లు' అని ప్రయోగాంతరము గలదు.

"ఎలమి సుముహూర్తమునఁ దెరయెత్త నంతఁ
బ్రేమ మది మీఱఁగాఁ జందమామచెలుల
కెంపుమోవులసుధకు గ్రుక్కిళ్లు మింగ
కితి గలిగెఁ జందమామగ్రుక్కిళ్లు నాఁడు."

(తారాశశాంకము)

శబ్దరత్నాకరకారు లీపద్యము నుదహరించి 'చంద
మామ గ్రుక్కిళ్లు' అనుపదమును 'అధరామృతము'
అని యర్థము వ్రాసిరి. కాని, వారే అక్కడ "ఇట్లు,
చందమామగుటకలు, ఈయర్థమింకను విచార్యము" అని
వ్రాసిరి. అధరామృత మన్న యర్థము సంగతముగాదు.

౨. కేనము

"కేనము=ఆసూయ మొదలగు నర్థములందు నన్నిచోఁ
దుపయోగించెను. 'కేణ' క్రొత్తకన్నడమునసే కలదు గాని
ప్రాచీనకావ్యములలోఁ గానరాదు. కావునఁ దత్ప్రయోగము
గావించిన కవి ద్వాదశశతాబ్దికంటెఁ బ్రాచీనతరుఁడు
గాఁజాలడు." ఆని శ్రీ లక్ష్మీపతిశాస్త్రిగారు.

నన్నయభట్టారకునకు నూఱేండ్లపూర్వపువాఁడును,
కర్ణాటప్రాచీనమహాకవియు నగుపంపకవి తన విక్రమా

ర్జున విజయమున 'కేణ' పదమును పదవయాశ్వాసము జ
౭౭—వ, ౮౧-వ పద్యములందు రెండుచోట్ల నన్నిచోడఁ డే
యర్థమునఁ బ్రియోగించెనో ఆ యర్థముననే ప్రయోగించెను.
కాన ఇది యాంధ్రికర్ణాటకవితల యాదికాలమునననుండియు
రెండుభాషలలోను వ్యవహృత మగుచున్నపదమే యనితెలియ
నగును.

౩. కనుమారి

భారత శాంతిపర్వము (ఆశ్వా. ౧, ప. ౩౦౭) న-

"కల్లు ద్రాగిపిన పాతకం బది యగ్ని వ
ర్ణముగాఁగఁ గాఁచి పానంబు సేయఁ
గనుమారి యుఱుకంగ ననలంబుఁజొర మహా
ప్రస్థాన మాచరింపంగఁ బాయు."

అని కలదు. ఇందు 'కనుమూసి యుఱుకంగ' అని పాఠాంతర మున్నది. అది పరిగ్రాహ్యము గాదు. ఇక్కడ 'పానంబు సేయఁగను-మారి యుఱుకంగ' ఆని పదచ్ఛేదమా, 'పానంబు సేయఁ-గనుమారియుఱుకంగ' అని పదచ్ఛేదమా అని సంశయము. ఈ సంశయము నీక్రింది నాచనసోమని పద్యము తీర్చినది :

"పాయఁదగు మిమ్ముఁ గనుమారిఁ బడఁ బొసంగు
విషముఁ ద్రావుట మోగ్యంబు వెల్లిలోన
మునుఁగు టుచితము మీరెల్లఁ కనుఁగొనంగ
నాత్మవిడుచుట చను నాకు ననుచు నడలి."

(ఉత్తర హరి. అ. ౪)

పదము 'కనుమారిఁబడుట' యగుట స్పష్టము. 'కను మారిఁ బడుట' కు 'భృగుపతన' మర్థము. శాంతిపర్వపద్యము నకు మూల మిది:

"సురాపానం సకృత్ కృత్వా యోఽగ్నివర్ణాంసురాం
..... [పిబేత్,
మరుపర్వపాతం పర్వతన్, జ్వలనం హి సమావిశన్,
మహాప్రస్థాన మాతిష్ఠ ముచ్యతే సర్వకిల్బిషైఃఽ"
(శాంతి. ఆ. ౩౪.")

"మరుపర్వపాతమ్=నిర్జలదేశే పర్వతాగ్రాత్ పతనమ్)

అని వ్యాఖ్య.

శైలముపై కర్మారీశ్వర మని యొక పుణ్యస్థల మున్నది. అది కొండకొమ్ము. అక్కడనుండి భక్తులు పుణ్య లోకప్రాప్త్యర్థమై నేల కుటికి ప్రాణత్యాగము చేయుదురు. క్రిందఁ బడుచున్నవాఁడు, అంతరాళమున నున్నవాఁడు, ఉఱుక నున్న వాఁడు అన్న క్రమమున ఎడతెగకుండ శివ రాత్రినాఁ డక్కడ భక్తులు ఉఱుకుచునే యుండెడివారు.

"కరమర్థిఁ జేసి యా కర్మారి నుఱుకు
ననఘుల భవపరిత్యక్తమానసుల
నటిముటి నవలి కర్మారీశ్వరమున
నుఱుకు పుణ్యులఁ జూచి—

పడియెడు దేహంబు పడిన దేహంబు
నడిమి దేహంబు లెన్నంగఁ బెక్కాఁడు"

(పండితారాధ్యచరిత్ర)

ఈ కర్మారియే తెనుఁగున 'కనుమారి' యయినది. ప్రాకృతమున ర-లు న-లుగా మారుట కలదు.

౪. టాటాలు గుణించుట

"కర్ణాటస్త్రీలు కటారికత్తి యలచే
రాపాడఁగా బట్టఁగాఁ
డాటా లీడ గుణింపరాదు పెఱచో
టంబోలెఁ బై పాటునన్."

(క్రీడాభిరామము)

తెలుఁగునాట తెలివితక్కువవానికి 'తద్దన్న' అనియు మనసు మెత్తనివానికి 'పప్పమ్మ' అనియు, గడుసరివానికి 'టట్టణ' అనియు, బూకరింపునకు 'చచ్చ' అనియు నాసుళ్లున్నవి. తవర్గము దంత్యము ; చవర్గము తాలవ్యము ; టవర్గము మూర్ధన్యము ; పవర్గము ఓష్ఠ్యము. 'తద్దన్న' వట్టి మాటకారియే కాని కార్యకారి కాఁడు. పల్లుబిగింపేకాని కార్యపు సొంపు లేనివాఁడు (దంత్యముగాన). 'పప్పమ్మ' నే 'వెఱ్ఱిపప్ప', 'వెఱ్ఱిపప్పమ్మ' అనియు నందురు. వట్టి మెత్తనివాఁడు గట్టిగా మాఱాడను, మాటాడను నేరనివాఁడు (ఓష్ఠ్యముగాన). 'చచ్చ'

బూకరింపు (తాపల్యముగాన). 'టట్టణ' ఉద్ధతుడు—బిట్టబిగిసి నెత్తికెక్కి మాటాడువాఁడు (మూర్ధన్యముగాన).

ఈ యర్థమునకు సాధకముగాఁ గర్ణాటభారతమున పఁపకవిప్రయోగ మున్నది:

"పన్నతర నడువ నుడియ
లెక్కన్న భుజార్గళమె సాల్గు మెనెమే ణ్ముగనిమే
ణెన్ననుడి 'టారడాధణ'
మెన్నం బెసపువుదు రాజసూయంబేళల్."

భీముని భాషణము 'టారడాధణ' అనఁబడినది. ఉద్ధతము, కఠినము అని. క్రీడాభిరామప్రయోగములగూడ టాటాలు గుణింపరాదు' అనఁగా, గడుసరి దుడుసుఁదనములు సాగింపరాదని యర్థమగును.

ఈ. అధ్వానము

హరవిలాసమున రతివిలాపములో—

"న-న్నతిదుఃఖాన్విత డించిపోవఁ దగునా
యధ్వానపుం బట్టునన్"

అని కలదు. 'అధ్వానము—అమార్గము' అని శబ్దరత్నాకరకారు లనిరి. 'అరణ్యము' అని కర్ణాటనిఘంటుకారు లనిరి. ఈ యర్థము లెట్లు వచ్చినవో వారు లక్ష్యము లుదాహరింప లేదు. కర్ణాట పంపభారతమున 'అధ్వానపదపరిశ్రాంత' అని

యున్నది. తన్మూలపాఠకులు 'అధ్వానము—మార్గము' అని యర్థము వ్రాసిరి. అది సంస్కృతసమాసమున నున్నది. శ్వ—శ్వాన శబ్దములవలె అధ్వ—అధ్వాన శబ్దములు సంస్కృతము ననే కలవేమో! అధ్వశబ్దము తత్సమరూపమున అధ్వానము కాఁబోలును! 'అధ్వానము' తత్సమ మనుకొన్న శ్రీనాథ ప్రయోగమునకు సాధుత్వము, నర్థము నిర్బాధములగునుగాని కర్ణాటప్రయోగము రక్షితముగాదు. తెనుఁగున 'అధ్వాన్నము శత్రుమధ్యము' అని నానుడి యున్నది. తోవలో వంటచేసి కొని తినుట, శత్రువు లప్పుడు చుట్టిముట్టియుండుట దాని కర్థము. కాని సంస్కృతమున 'అధ్వాంతశాత్రవః=మార్గ సీమారిపుః' అని ప్రయోగమును, అర్థమును వాచస్పత్యాది నిఘంటువులలోఁ గాననగును.

తెలుఁగునఁగల 'తలపొలము' పదమున కీ 'యధ్వాంత' పదము సరియయిన సంస్కృతము.

"సాదు రేఁగెనేని
న్వీను తలపొలమునన కాని నిలువదు సుమ్మీ"

అన్న తిక్కన్న ప్రయోగమునకు 'సాధువయిన పస రముచెలరేఁగినదా అది యెందాఁక బోఁగలదో అందాఁక బోయికాని నిలువదు' అన్న యర్థము సంగతము. ఊరిబాట ముగియునట్టి పొలిమేరపట్టు 'అధ్వాంతము - తలపొలము' తిక్కనప్రయోగమున కర్థ మిదేయని నిరూపించుట కీ క్రింది ప్రయోగము కాటమరాజుకథలోనిది సాధకము :

"తలపొలమునకుఁ బాజి నిలఁబడ్డ గోవ్రులను
కలవిలుచుకొన్నట్టు కాదు కయ్యంబు."

తిక్కనభారతము, కాటమరాజుకథ రెండును నెల్లూరి కావ్యములే. 'తలపొలము' పద మక్కడ వాడుకకలది కాఁబోలును!

ఓ. కనకస్వామి

బసవపురాణమున——

"జాలిఁ బడి కనకసాములు దమక
వేలిచికొన్నయావిధమగుఁ దమకు"

అని యున్నది. శివాలయములలో శివనివేదితాన్నా దికము నర్చకు లక్కడి బోయల కారగింపనిచ్చుట బసవేశ్వరుని పూర్వకాలపు సంప్రదాయము. బసవేశ్వరుఁడాసంప్రదాయము మాన్పించి, యర్చకులచే నారగింపించెను. బోయలు తగవు సాగించిరి. "శివునికి విషము నివేదింతుము, అది మీ రారగింపఁగలరా?" యని బసవన బోయల నడిగెను. "ప్రసాద మారగించి బ్రదుకఁగోరుమముగాని ప్రసాదము విషముచేసినఁ దినుచత్తుముగదా?" అని బోయ లనెడుపట్టునఁగల ద్విపద యది. బసవపురాణము ముద్రించునాఁ డీద్విపద యర్థము నాకు స్పష్టపడలేదు. 'కనకస్వాములు' అనఁగా రసవాదము (బంగారము) చేయువారనియు, తత్ప్రక్రియ సరిగా తెలియక తప్పుప్రయోగములు చేసి వారు తమ శరీరములనే కాల్చుకొనుచుండుట

జరుగునుగాఁబోలు ననియు నేనప్పు డనుకొంటిని. ఇటీవల కర్ణాటవిద్వాంసులు శ్రీ శేషయ్యంగారు కర్ణాటభారతమున నేతత్సంబంధికథ యుండుటఁ జూపిరి. అది యిది; అరణ్యపర్వమున యక్షప్రశ్నల సందర్భమున భీమాదులు నలుగురు సోదరులు యక్షునాజ్ఞ మీఱి నీరుద్రావి చెఱువుచెంత మృతప్రాయులై పడియుండిరి. అప్పుడు దుర్యోధనుని పురోహితుఁడు కనకస్వామి యనువాఁడు పాండవులఁ జంప నాభిచారిక హోమము చేసి పంపినకృత్యాదేవత పాండవహననార్థమక్కడికి వచ్చెను. ఆ చెఱువుదగ్గఱ నప్పుడు కృత్యకు యక్ష దేవత (యముఁడే) ప్రత్యక్షమై "నీవు జాతిగల దేవతవై తేని నాచే నిప్పుడు నిపాతితులయి యెంగిలిపడియున్న యీ నల్వురను నీ వారగింపరాదు. ఎంగిలితిండి తిందువా-నీవు నీచదేవత వగుదువు, నా మహత్త్వ్యముముందు నీ నీచదేవతాకార్యము సాగఁజాల"దని గద్దింపఁగా కృత్యాదేవత యప్రయోజకురాలై "అయ్యో, నే నాఁకలిగొని వచ్చితినే; ఆహారము కావలెనే" అనెను. "అకృత్యముగా ని న్నిట్లు ప్రయోగించిన యా కనకస్వామినే యారగింపు" మని యక్షుఁ డనెను. అట్లే యా కృత్య దుర్యోధనపురోహితునిఁగనకస్వామినే యారగించెను.

"కనకన బేల్వె తగుఖ్ఖదు
కనకననెం బొందు మాతు ధర గెసెయ సుయో
ధననపురోహిత నప్పా
కనకస్వామియనె మునిదు కృత్తిగె దిందళ్."

(పంపభార. ర ఆశ్వా. ౪౬ ప.)

ఈకథ సంస్కృతాంధ్ర భారతములలోఁ గానరాదు. కర్ణాటభారతరచనమునకుఁ బూర్వమే "కనకనివేల్మి కనకనికే తగిలిన" దన్న సామెత యేర్పడియున్నదని పద్యము తెల్పు చున్నది. తొలుత నీ నాసుడి రసవాదకారునిఁబట్టి పుట్టి వాడు కలో నుండఁగా బంపకవి దానినిఁ గొని, దుర్యోధనపురోహి తునిఁ గనకస్వామిని సృష్టించి తత్పరము గావించి యుండఁ బోలును.

౭. ఉప్పుతోఁదొమ్మిది

రామాభ్యుదయమున "ఉప్పుతోఁదొమ్మిదియును బెట్టి కల్పణరహణము గావించునే గుణసముద్రుఁ" డని యున్నది. 'ఉప్పుతోఁ దొమ్మిది' యనఁగా—

"ఘటః, పటం, జలం, కాష్ఠం, తండులం, తైలమేవచ:
శాక, మగ్నిసమాయుక్తం, లవణం నవ సంయుతమ్"

౮. కోహళి

"మౌళిం గోహళి సంఘటించిన క్రియన్
మధ్యాహ్నవేళన్ మహా
కాళంబైన నభోవిభాగమున వీఁ
కంగాసె బీఱెండ...." (హరవిలాసము)

ఇందు 'కోహళి' పదమున కర్థము తెలియదు.

"పార్వతీపతికిఁ బ్రభాతభూపతి గొన్న
యలరుఁగెందమ్మికోహళి యనంగ."

(ఉత్తరహరివంశము)

పయి రెండు ప్రయోగములు తక్కఁ దెలుఁగున నీ పదము నా కిఁక నెక్కడను గానరాలేదు. కుమారవ్యాస కృత షట్పదీభారతమున 'కోహళె' పద మున్నట్టు కన్నడ నిఘంటువున చెప్పఁబడినది. దానికి Cover, Envelope అని అర్థము వ్రాయఁబడినది.

"ఎనుత దివ్యావయవకాంతియ
మినుగుమోహరదేళ్గె మూడిద
వనిమిషాంగద లురగ కాయద
కోహళెయ నుగిదు." [కుమారవ్యాస]

నహుషుఁడు సర్పశరీరపుటాచ్ఛాదనమును తొలఁగించు కొనుట యిక్కడ చెప్పఁబడినది. కాన కన్నడనిఘంటుకారు లట్లర్థము వ్రాయుట సంగతమే. కుమారవ్యాసునికంఱె జాలఁ బ్రాచీనులగు మన తెల్గుకవులప్రయోగములు 'ఆచ్ఛాదనము' అన్న యర్థమునకు ససిపడ వనుకొనెదను. తెల్గుప్రయోగములు రెండింటికి ('ఉల్లడ' ఒండె 'ఆలవట్టము') ఛత్రము అర్థము కాఁదగు ననిపించును. హరివంశపుఁ బ్రయోగముఁ బట్టి చూడఁగా నది వేల్పులకు రాజులు మొదలగువారు పూజాచిహ్నముగా ధరించు ఛత్రచామరధ్వజాదులవంటిదిగాఁ గానవచ్చును. పార్వతీపతి గగనకేశుఁడుగాని నాదేవుని తల మీఁదికి వచ్చునట్టు ప్రభాతరాజు పైకెత్తిన యాలవట్టమువోలె భానుబింబ మున్న దన్నవర్ణనము సంగతము కాఁదగును. హరవిలాసప్రయోగము నిందు కనుకూలించును. రాగిడివంటి యలంకారవిశేషమో, కిరీటమో యనుకొందమన్న 'నలరుఁ

గెందెమ్మి' పదమునకు తామరపూవునాకృతిగలది యని చెప్ప వచ్చునుగాని ప్రభాతభూపతి 'కొన్న' యన్న పదమునకు సార్థక్యము కుదురదు. ఆలవట్టనుకాని ఉల్లడకాని 'యలరుఁ గెందమ్మి' యాకృతిగల వని యన్వయింపవచ్చును. ఇట్లెల్ల యోచించితిని; గాని 'కోహాళె' పదమునకు సమానార్థకముగా మహారాష్ట్రమున 'ఖోళె' పదము కలదని కిట్టెల్ ప్రాసినాఁడు. మహారాష్ట్రపు 'ఖోళె' సులువుగాఁ దెలుఁగున 'కుళా' అయి యుండవచ్చును. 'కోహళి' శబ్దమునకు 'కోహాళె, ఖోళె, కుళ్లా పదములు క్రమపరిణామరూపములు కావచ్చును. కాఁగా 'కోహళి' శబ్దమునకు 'కుళ్లాయి, టోపి' అర్థమగును. తెలుఁగు ప్రయోగములు రెండును 'కుళ్లా' అర్థమునకు సరిపడఁగలవు. 'కుళ్లా' శీర్షాచ్ఛాదనమే కదా! అది యలరు కెందమ్మియాకృతి గలది గావచ్చును.

కన్నడపు కుమారవ్యాసప్రయోగము 'శిరఆచ్ఛాదన' మనుటకు ససిపడదు. అతఁ డౌపచారికముగా శరీరాచ్ఛాదనమునకే దానిని ప్రయోగించియుండఁబోలును.

శక ౧౨౧౪ నందనపుష్య శు ౫ సో... నాడు

శ్రీమన్మహామండలేశ్వర శ్రీవిక్రమోత్తుంగ రాజేంద్రచక్ర
వర్తి స్వస్తిశ్రీ త్రిపురాంతక శ్రీమన్మహాదేవరకుం బుత్తెంచిన
పహిండిచతుర్ముఖకోహళి. దోర్దండద్వయ నిర్మదీకృత
చతుర్ద్వీపాధిపస్థాపనాచార్య సూర్యసమప్రతాపమహిమా
శ్రీ విక్రమోత్తుంగరాట్, పాయచ్ఛత్రిపురాంతకాయ

వసుధాభర్తాపహర్తా ( ) హేమమయం చతుర్దశ పలోనాభ్యాం తులాభ్యాం మితమ్. (నూర్కాపురం తాలుకా త్రిపురాంత కేశ్వరాలయ శాసనము.)

శక ౧౩౪౪ - శుభకృత్కార్తికకృష్ణతృతీయ — శ్రీ విష్ణువర్ధనమహారాజు లయిన శ్రీ నరసింహాదేవర చక్రవర్తులు ..... ధర్మలింగానకు పంచవక్త్రికోహళి భంగారానం జేయించి సమర్పించిరి. (విశాఖపట్నం జిల్లా-పంచదారులో ధర్మలింగేశ్వరాలయశాశనము.)

ఈ రెండు శాశనములవలనను, శివలింగమునకు అయిదు ముఖములతో జేయించిన 'టోపి' - 'కుళ్ళా' - శిర ఆచ్ఛాదనము కోహళి ఆగుట స్పష్టపడినది. తొలి శాసనము సంస్కృతశ్లోకమున ప్రధానభాగము స్పష్టముగా లేదయ్యెను. అచ్చో ఉష్ణిషపద ముండు ననుకొనెదను. శాసనప్రతిబింబము సరిగాఁ బరిశీలింపవలెను.

౬. ఇట్టికసూఁడినవాఁడు

ఉత్తరహరివంశమున నరకాసురున కోడి దిక్పాలురు పారిపోవుటను వర్ణించుటలో యమునిఁ గూర్చి యీ క్రింది పద్య మున్నది.

"ఇట్టిక సూఁడినవాఁడో
యెట్టిడుకొన్నాఁడొ యనుచు నుల్లసమాడన్

బట్టగుచు మగిడి చూడక
పట్టణమున కేఁగె లజ్జబండతనమునన్."

పై పద్యమున కనేకు లర్థము నడిగిరి. లోకాచారము గొంత యెఱిఁగినవారుగాని దీని యర్థము వివరింపఁజాలరు. నరకున కోడిపోయి యముఁడు తన పురమునకుఁ బరుగువాఱుచున్నాఁడు. అట్లు పరుగువాఱుటలో ముందరిచూపే కాని వెనుకచూపు లేదు. అది చూచినవారు "ఈతఁడేమి యిటిక యావమునకు నిప్పంటించి వెళ్లుచున్నాఁడా? మఱి, వెనుకకుఁ దిరిగి చూడనే చూడనని యొట్టువెట్టుకొని వెళ్లుచున్నాఁడా" అని పరిహసమాడఁ దగినట్లున్నది. ఇటిక యావమునకు నిప్పుముట్టించువారు ముట్టించిననిప్పు అంటుకొన్నదా, లేదా అనియేని వెనుకకుఁ దిరిగి చూడకుండ వడిగా ముందుచూపుతోనే వెడలిపోవలెను. అట్లు వెనుకకుఁ దిరిగిచూచిన నా యావము కాల్పు సరిగా సాగక చెడు నని లోకప్రతీతి. ఈ లోకప్రతీతి దెలియకున్న పద్యార్థ మెఱుకపడదు.

మఱియు నీ పద్యము నాల్గవచరణమున 'లజ్జబండ తనమునన్' అని యున్నది. దీనికి 'లంజెబందతనమునన్' అనియు, 'లంజెబండతనమునన్' అనియు పాఠాంతరము లున్నవి. కవికర్ణరసాయనమునను, గౌరన హరిశ్చంద్రచరిత్ర మునను ఈపదము ప్రయోగింపఁబడినది. లజ్జబండ=సిగ్గుమాలిన వాఁడు.

★

[మనుచరిత్రము శ్రీకృష్ణదేవరాయలవారి కాలమున వెలసిన యాంధ్రప్రబంధములలో బేరెన్నిక గన్నది. విద్వాంసు లెందఱో దానిపయి విమర్శనముల వెలయించి యున్నారు. దాని ఘనత కవి తార్కాణములు. జాగ్రత్తతో నే నీనడుమ నాగ్రంథమును జదువఁగా గొన్నిసందేహములు, తన్నివారణకై పరిశీలింపఁగాఁ గొన్ని చక్కనిపాఠములు, అర్థవిశేషములు గోచరించినవి. అందుఁ గొన్నింటి నిందు వెల్లడించుచున్నాను.]

౧౦. చేర్చుక్క

"చేర్చుక్కగా నిడ్డ చిన్ని జాబిల్లిచే
సిందూరతిలకంబు సెమ్మగిల్ల."

ఇది ముద్రితపాఠము. ఈ పద్యము సరస్వతీమూర్తి వర్ణనాత్మకము. సరస్వతీదేవి చేర్చుక్క యను నగగాఁ జంద్ర కళ నలంకరించుకొన్న దన్నయర్థము మీ ముద్రితపాఠమున. "చేర్చుక్కగా నుండు చిన్నిజాబిల్లిచే" నని కొన్ని వ్రాఁత ప్రతుల పాఠము. సొజముగానే సరస్వతీమూర్తి చంద్రకళా లంకృతమస్తక కావున తలపై నున్న యా చంద్రకళ చేర్చుక్క యన్న యలంకారపుసొంపును గూర్చుచున్న దన్నయర్థ మీ వ్రాఁతప్రతిపాఠమున. వ్రాఁతప్రతిపాఠము సుందరతర మగు నేమో!

౧౧. భరమై తోఁచు కుటుంబరక్షణ

"భరమై తోఁచు కుటుంబరక్షణకుఁగాఁ బ్రాల్మాలి చింతన్ నిరం
తరతాళీదళసంపుటప్రకరకాంతారంబునం దర్థపుం

దెరువాటుల్ గొని కొట్టి తద్ఙ్ఞపరిషద్విఙ్ఞాతచౌర్యక్రియా
విరసుండై కొఱఁతం బడున్ గుకవి పృథ్వీభృత్సమీపఙ్ఞితిన్."

కవీశ్వరులనే యధికముగా సత్కరించుచుందురుగాన శ్రీకృష్ణదేవరాయలవారి యాస్థానిలో కవిత చేతఁగానికుకవులు కవిసత్కారముఁ బడయగోరి, ప్రాచీనతాళపత్ర పుస్తకగతములయియున్న గ్రంథములనో, గ్రంథభాగములనో స్వరచితములఁగాఁ బ్రకటించుకొనుచుండుటయుఁ, బెద్దనాదులు వానిగుర్తించి రాయలసన్నిధి నవమానపఱుచుచుండుటయు జరుగుచుండెడిది గావలయు. జాలిమాలి పెద్దనామాత్యులవా రటువంటి చేతఁగానిదొంగకవుల నీ పద్యమునఁ జెంగనాడినారు.

ఈ పద్యమును విని కోపించి కావలయుము, పెద్దనగారియు, శ్రీకృష్ణదేవరాయలవారియు కాలమ్ముననే వర్తిల్లిన వాఁ డొక యసహాయకవితాశూరుఁడు, కవిరాజు (కవిరాజపదమిట తత్పురుష, కర్మధారయముల రెంటను సంగతమే.) పెద్దనామాత్యులవారిని వారిమాటలనే ప్రిప్పికొట్టినాఁడు.

"అతికుటుంబరక్షణాపేక్షఁ బ్రాల్మాలి
కృతులు మూఢభూమిపతుల కిచ్చి
చచ్చి నిరయమునకుఁ జనుకంటె హరిహరా
ర్పణము చేసి సుగతిఁ బడయరాదె?"

పెద్దనగారి "భరమై తోఁచు కుటుంబరక్షణకుగాఁ బ్రాల్మాలి" యన్నకూర్పు నీతఁడు "అతికుటుంబరక్షణా

వేఱు ప్రాల్మాలి"యని యనుకరించుట, పెద్దనగారు చేసిన కుకవినిందను గుర్తించి, వారిత్రోవనే సూటిగా వారికే తగులునట్లు ప్రతినింద చేసినాఁడుసుమా యని విజ్ఞులు వివేకించి తెలిసికొనుటకో యన్న ట్లున్నది. కుటుంబరక్షణకై ప్రాల్మాలి తెక్కలికవులు పాఠ్యచీన గ్రంథార్థముల హరించి రాజులదగ్గఱ వెల్లడించుకోఁబోయి కొఱఁతఁబడుదు రని పెద్దనగా రనఁగా నీతఁడు "కుటుంబరక్షణకై ప్రాల్మాలియే సుమండి సత్కవులు గూడఁ గొందఱు మూఢు లయిన (స్వయము రచింపను, ఒండె అన్యులు రచించినగ్రంథముల సారస్యము గ్రహింపను నేరని) రాజులకు స్వరచితకృతులను (కృతికర్తృత్వ రూపముననో, కృతిపతిత్వరూపముననో) అంటఁగట్టి (ఈలోకమున భోగ భాగ్యములతో నందలా లంబారీలు నెక్కి యూరేఁగిన నేమి) పరలోకమున బాధలు పడుదురు" అని పెద్దనగారి కెదురుదెబ్బ కొట్టినాఁడు. ఇట్లు నిబ్బరించి చెప్పిన మొనగాఁ డెవ్వఁడనఁగా బైచరాజు వెంకటనాథకవిరాజు. ఈతని కృతి పంచతంత్రము. తెలుఁగున దేశిరచనాచమత్కారము గల గ్రంథ మీతని గ్రంథమును బోలునది వేఱొకటి గానరాదు. "ఈ రాచకవిత్వబాధ పడరాదు పరామరిసింపు దైవమా" యని 'శారద నీరూప' మనఁబడిన గడుసరి కవిచేఁగూడఁ బలికించినవాఁడు. ఈతఁడు తన కృతిని తిక్కన, నాచన సోమనలవలె హరిహరార్పణము చేసినాఁడు.

"ఏ చనవు గలదు హరిహర
సాచివ్యము నొంద నన్యజనులకు మది నా

లోచింపఁ దిక్కయజ్వకు
నాచనసోమునకు నింక నాకుం దక్కన్ ?"

ఇతరరాజులతోపాటు కృతికర్తృత్వమును సొ మ్మిచ్చి తనపై వేయించుకొన్నవాఁడే యీ రాజుగూడ ననిలోకులనఁ బోపుదు రన్న భయమునఁ గాఁబోలు, స్పష్టముగా నీతఁడు—

"అసహాయసరసకవితా
రసికుఁడ వేంకటధరావరప్రభుఁడ, గుణ
ప్రసరప్రకాండమదవ
ద్భసలాయితవిద్వదఖిలబంధుప్రజుఁడన్."

అని చెప్పికొన్నాఁడు. మఱియు గద్యమున "నిస్సహాయకవితానిర్మాణభోజభూదార" అని తనకు విశేషణముఁ జేర్చుకొన్నాఁడు. "నిస్సహాయకవితానిర్మాణ చతురుఁ డానాఁటికి భోజదేవుఁడు, నీనాటికి మరల నేను" అని యీతఁడు గుండె సఱచికొని చెప్పుకొన్నాఁడన్నమాట.

౧౨. కొఱుత

పెద్దనగారి పయిపద్యమున 'కొఱఁతన్ బడున్' అనుచో 'కొఱఁతన్=న్యూనతను' అని యొక యర్థము, 'కొఱుతన్=కొఱ్ఱున' అని యింకొక యర్థము రావలెను. ఒక యర్థమున నా పదమున 'ఱ' అకారవిశిష్టము, సార్ధానుస్వారము; ఇంకొక యర్థమున ఉకారవిశిష్టము, నిరనుస్వారము. ఒక యర్థమున 'నా పదమున నరసున్నగలదు: వేరొకదాన లేదు. శ్లేషసఖుండ

నిర్బిందోవ్ రేళనం కుత్రచి న్మతమ్" అన్న శాస్త్రము చొప్పు నను, "లడయోర్నణయో శ్చైవ.....స్యా దభేదేన కల్పనమ్" అన్న శాస్త్రముచొప్పునను ఉఅసున్న కలిమి లేములు శ్లేషార్థమునకు బాధకములు గావుగాని, అకారోకార భేదము బాధక మనియు, ఇక్కడ శ్లేషార్థము దుస్సాధ మనియు పెద్దలందఱుఁ జెప్పుచున్న చొప్పునే నే నెప్పుడో వెల్లడించితిని. గుంటూరి విద్వాంసులొకరు ఈ భేదముకూడ పాటింపరానిదే యని, శ్లేషము చెల్లు నని కావ్యాలంకార సూత్రాంధీకరణమునఁ గాఁబోలును బ్రవాసిరి. తలుపు, తలఁపు ఇత్యాదులకు శ్లేష సంగతి చెల్లుననుట గదా యిది! విజ్ఞులు ప్రమాణము.

౧౩. శ్రీకృష్ణదేవరాయాగ్రిగణ్యుఁడు.

"ప్రబల రాజాధిరాజ వీరప్రతాప
రాజపరమేశ బిరుదవిభ్రాజి యెవ్వఁ
డట్టి శ్రీకృష్ణదేవరాయాగ్రిగణ్యుఁ
డొక్కనాఁడు..."

ఇందు "శ్రీకృష్ణదేవరాయగ్రిగణ్యుఁ" డచుచోట "కృష్ణరాయవీరాగ్రిగణ్యుఁ" డని పాఠ మున్నది. "శ్రీ కృష్ణ దేవరాయ" పదము సంజ్ఞావాచక మనుకొనుచో "అగ్ర గణ్యుఁడు" అన్నపదముతో సమాసము సనిపడిదు. 'శ్రీకృష్ణ రాయ వీరాగ్రగణ్యుఁ' డనుపాఠము సుందరమయినది.

తొలిపాఠమునే యభిమానించువారు 'కృష్ణదేవ' నామముగల రాజాగ్రగణ్యుఁ డని పొసఁగించుకొనవలసియుండురు.

౧౪. పాలింపఁగాను

".....భూవిభుని కృష్టరాయఁ డభ్యుదయ మంది-పెంపుమీఱంగ ధాత్రిపాలింపుచుండ" నని యచ్చుప్రతులలో నున్నది. పాఁతముద్రణమునందును, వాఁతప్రతులలోను "పెంపు మీఱంగ ధాత్రిఁ బాలింపఁగాను" ఉన్నది, ప్రాచీన కవులు కొందఱు 'పాలించుచు' అనియేకాని, 'పాలింపుచు' అని ప్రయోగము చేయరయిరి. పెద్దన యాత్రోపవాఁడు గావచ్చును.

౧౫. వామనస్తుతి

"ప్రత్యూషపవనాంకురములు పైకొనువేళ వామన స్తుతిపరత్వమున లేచి"—ఇక్కడ 'వామనమూర్తిస్తోత్రము నందలియాసక్తిచేత విష్ణుమూర్తిస్తోత్రపారాయణముతో ననుట' అని వ్యాఖ్య. కాని యిక్కడ వామనస్తుతి యనఁగా 'దధివామనస్తోత్ర' మను సంస్కృతస్తోత్రగ్రంథ మగును. శ్రీకృష్ణదేవరాయలవారు తెల్లవారుజామున నిద్ర లేవఁగానే యీ దధివామనస్తోత్రమును పారాయణముచేయుట పరిపాటి. రాయ వాచకమునఁ జూచునది. దధివామనుఁ డనఁగా 'వెన్నముద్ద బాలగోపాలకృష్ణమ్మ.' ఆంధ్రదేశ మంతటను సామాన్యముగా స్త్రీ పురుషులు తెల్లవారుజామున నిద్ర లేచి భూపాలరాగ

ముతో 'గుమ్మఁ డేఁడే గోపిదేవీ' ఇత్యాదిగా దధివామనస్తుతినే చేయుచుందురు.

౧౬. మండలిక తపన

"మండలికతపన శోభిత!
కుండలిపతిశయన కర్ణకుండలిత రసా
ఖండకవికావ్య! దిగ్వే
దండశ్రుతిదళనకలహతాడితపటహా!"

"మండలికతపనుఁ డను బిరుదుచే శోభిల్లువాఁడా! కుండలిపతిశయనునికిఁ గర్ణకుండలములుగాఁ జేయఁబడిన రసా ఖండము లగుకవికావ్యములు గలవాఁడా!" అని వ్యాఖ్య.

'మండలికతపనశోభిత' అని సమాసమగుచో 'మండలిక తపనుఁడు అను బిరుదుచే శోభిల్లువాఁడా' అని యర్థము నీయఁ గల శక్తి దాని కుండదు. వ్రాఁతప్రతిపాఠ మిట్లున్నది: "మండలికతపన! పూజితకుండలిపతిశయన!" 'మండలికతపన!' బిరుదాంకసంబోధనము. ఇఁక పద్య మీ క్రింది తీరు సంబోధన ములతో నుండును:

"మండలికతపన! పూజిత
కుండలిపతిశయన! కరకుండలితరసా
ఖండకవికావ్య! .... "

రసాఖండము లగుకవులకావ్యములను కృష్ణరాయలే కర్ణకుండలములుగాఁ జేసికొనుచుండువాఁ డని యర్థమగును.

౧౭. చతుర్విధ కవితలు

"శతకోపప్రసాదాసాదితచతుర్విధకవితామతల్లి కాల్లసాని"
అని యాశ్వాసాంతగద్యమునఁగలదు. 'చతుర్విధకవిత'
లనఁగా 'బంధము, చిత్రము, గర్భము, ఆశువు' అని వ్యాఖ్య.
ఇది సరిగాదు. ఆశు, మధుర, చిత్ర, విస్తరము లన్నవి
చతుర్విధకవితలు,

౧౮. రాచవారు

"వలరాచరాచవాఁ డలికాతు కనువెచ్చఁ గరఁగిన
యల కనికరపుఁజోటు." (౨–౧౦)
పైపాఠమచ్చులోనున్నది. 'రాచవాఁడు' అని యేక
వచనాంతముగా నా పదమున కెక్కడను ప్రయోగము గాన
రాదు. 'రాచవారు' అన్నపదము 'దొరవారు' అన్నపదము
వంటిది.

"ఒక చపలాక్షి లేఁజిగురుటూయెలఁ గోయలరాచవారి
నిక్కకు నెలయింపవచ్చు...."
(ఉత్తర హరివంశము)

"ఏనికమోముతా ల్వెలుకనెక్కినరావుతు రాచవారు"
(భీమఖండము)

కనుక నిక్కడఁగూడ 'వలరాచరాచవా రలికాతు
కనువెచ్చ' ననియే యుండవలెను.

౧౯. అనుకూలగతి

"అనుకూలవతి నాదు మనసులో వర్తించు కులకాంత మది నెంత గుందునొక్కొ."—ఇక్కడ 'అనుకూలవతి' యన్న పదము క్లేశపడి సమర్థింపవలసినది. అనుకూలపదమున కాను కూల్య మర్థముచెప్పుకోవలెను. 'అనుకూలగతి' యన్నపాఠము వ్రాతప్రతులలో నున్నది. దీని గ్రహించిన నే యసందర్భము నుండదు.

౨౦. కుఱంగలి, ఓసరించక

"గొంటుదనం బెఱుంగక కుఱుంగటనున్న య మ్మహీసుర .... గదురు మనంబున నోసరించక చంచల దృగంచలపక్ష్మలు....." (౨-౬౧)

పయివచనమున అనుప్రాససంగతిని బట్టి 'కుఱంగట కంటె 'కుఱుంగట' యుండదగు ననిపించును శబ్ద నిష్పత్తి కూడ (కుఱు+కలను) 'కుఱుంగలి' యగుటకే సనిపడును. వ్రాతప్రతులలో 'కుఱుంగట' అన్నరూప మున్నది. మఱియు నీ పదము సోమనాథుని యుత్తరహరివంశమునఁ గూడ 'కుఱుంగలి' యని యనుప్రాససంగతితోనే కలదు.

"చక్రింబు మొదలగు కైదువలు మెఱుంగులు గుఱుంగ లించిన రవిమండలంబు తెఱంగున."

(ఉ. హరి × అశ్వా.)

ఇట్లు చూడఁగా 'కుఱుంగలి' యనుపాఠమే సాధువని యేర్పడినది. 'కుఱంగలి' రూపపు సాధుత్వము చింత్యము. మఱియుఁ బయివచనమున ఓసరించక యిద్దాని సమ్మతించినది.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D. P. R. I.
Acc. No.

౨౧. ఉపాధ్యాయి

"ఈ పాండిత్యము నీకుఁ దక్క మఱి యెందేఁగంటిమే" అన్న పద్యములో 'కామశాస్త్రోపాధ్యాయివి" అనఁగా ఉపాధ్యాయుని పత్ని అనికాక, స్వయము వ్యాఖ్యానము చేయనేర్చిన యుపాధ్యాయురా లని యర్థము. వరూధిని యుపనిషన్మంత్రమునకు స్వయము క్రొత్తయర్థము కల్పించినది గదా!

౨౨. బాహామూలరుచి

పర్వరుఁడు రోఁతచెంది 'చెప్పకు మిట్టి తుచ్ఛసుఖముల్ మీసాలపైఁ దేనియల్' అని తెగడఁగా వరూధిని హృదయాబ్జము జల్లన, నీవీబంధ మూడఁగా; కొప్పు వీడఁగా, రతిసంరంభము మీఱఁగా, పైపాటున—

"పార్శ్వదూభషణబాహుమూలరుచితోఁ బాలిండ్లుపొంగారఁ బైయంచుల్ మోవఁగ గౌఁగిలించి యధరం బాసింప...."

ఈ పద్య మిట్లు ముద్రణములం దున్నది. వ్యాఖ్యాతలు "పార్శ్వదూభషణములయొక్కయు, బాహుమూలముల యొక్కయుఁ బ్రికాశముతో పాలిండ్లు పొంగారన్=ఉబ్బఁగా, పైయంచుల్=చనుమొనలు, మోవఁగన్=ఆనునట్లుగా, కౌఁగిలించి" అని వ్యాఖ్య వ్రాసిరి. కాని వ్రాఁతప్రతులలో పాలిండ్లు పొంగారి పైయంచుల్ మోవఁగ' అని పాఠ మున్నది.

పార్శ్వదూభషణములగు (పార్శ్వదూభషణపదము బాహులకుఁగాని, తన్మూలములకుఁగాని విశేషణము) బాహుమూలముల కాంతితో (ఆ కాంతి యలముకొనె ననుట) పాలిండ్లు పొంగారి, పై యంచుల్ మోవఁగ=దోర్మూలకూలం

కషములుకాఁగా ('పరితుణవిజృంభణా దుభయబాహుకూలం కషస్తనతుటితకంచుక' మిత్యాది పరియోగముల ననుసంధించునది.) అధరం బాసించినది. ఇక్కడ పైయంచుల్ = చూచుకములు అని వ్యాఖ్యానము సుందరము గాదు. రతిసంరంభము మీఱ పైపాటునఁ జేసిన కాఁగిలింత యట్టిదిగా నుండదు. ఈసందర్భము నింకను దెలిఁగించుట బాగుగాదు. కళాప్రపూర్ణులు శ్రీశేషాద్రిశర్మగా రిక్కడ నిట్లు వ్రాసిరి: "బాహుమూలరుచితోన్ = భుజశిఖరముల కాంతితో,..... మూలమనఁగా మొదలు, బాహుమూలము లనఁగా భుజశిఖరములు అను నర్థ మేర్పడును. బాహుమూలములందు కేయూరము లనుభూషణము లుండును. స్త్రీలకు నుండునా యని పర్యింతురేమో! స్త్రీపురుషసాధారణము లగుభూషణములే యవి యని యేర్పడును. కేయూరచతుష్టయము పరమేశ్వరికి భూషణములుగాఁ జెప్పఁబడినవి. కావున నా పేరుగల భూషణములతోఁ గూడిన బాహుమూలముల కాంతితోఁ బాలిండ్లు పొంగార, అనఁగా నా కేయూరరత్న కాంతులు వక్షోజములపై వ్యాపింపఁగా నని యర్థము సిద్ధమగును..... కంచుకము సడలించిన దని యంగీకరించినను రూఢ్యర్థమగు బాహుమూలకాంతి యసంగత మనవలయును. వీనికిఁ బ్రోద్బలముగాఁ బై పద్యమున 'నీవీబంధ మూడన్' అను మొదలగు రతిసంరంభచిహ్నములు చెప్పఁబడినవి. కనుక రూఢ్యర్థ మంత సరసము గాదని తోఁచెడిని."

విమర్శమిది యేమో నేఁ దెలియఁజాలకున్నాఁడను. సంస్కృతాంధ్రకవులు పలువురు భుజయుగము పయికెత్తిన సందర్భములందు స్త్రీ 'బాహుమూలద్యుతుల' వేలమువెట్టిగా వర్ణించిరి. ఆంధ్రమున నిట్టి సందర్భము వర్ణింపని యర్వాచీన కవి యుండఁ డనవచ్చును. వరూథిని భుజము లెత్తినప్పుడు వర్ణ్యము భుజశిఖరము లగునో, యిం కేమగునో చర్చ యెందుకు? పెద్దనామాత్యుఁడే తెనాలిరామలింగఁ డన్నట్టు లీ 'బాహుమూలరుచి' వర్ణనాభిమానము విడువఁజాలక కాఁబోలు మరలమరల నీ తీరుననే పంచమాశ్వాసమున వర్ణించినాఁడు:

"
.... ఉత్కంఠాగర్భమై నిక్క నా
థుని మౌళిక దలబ్రాలువోసె నవలాదోర్మూలకూలంకష
న్తనవిస్ఫూర్తికి నందిదండలధళల్ సాహోనినాదం బిడన్.

ముడివడు కంకణపర్భల ముత్తెపుసేసలు దోయిలించి యె
త్తెడు తటి బాహుమూలకుచదీప్తులపైఁ బతిదృష్టి పర్వినన్
బొడమిన లజ్జఁ బాణియుగమున్ వెసవంచియ మౌళిమీఁదికై
పొడవునఁ బల్లె—"

(మనుచరిత్ర, ౫ ఆశ్వా.)

రంగనాథరామాయణమందును ఇట్టి వర్ణన ఉన్నది, యిదిగో:

"పొంగారు కుచకుంభములు పదార్వన్నె
బంగారుపొడి రాలు బాహుమూలములు."

పెద్దనామాత్యుఁడు తాను తొలుతఁ జెప్పిన పద్యము
లోని 'పాించదూభషణము'లను స్పష్టముగాఁ బంచమాశ్వాస
పద్యమున 'సందిదండ'లని తెలియఁజెప్పినాఁడు గదా!

అవీ-ఇవీ

చెవపు

హరవిలాసమున 'చిఱుబంతిపసుపుతోఁజెవపు నలఁది' అని యున్నది. పసిబాలురమేన నుండు నెట్టిమచ్చలకుఁ దెలుఁగున 'చెవ, చెవ్వ' అని వాడుక. ఇక్కడకూడ నదే యర్థము కాఁదగునుగాని, 'చెవపు' వ్రాఁత ప్రతులలో నున్నది. అఱవమున ఎట్టిఁదనమునకు 'శివప్పు', 'సెగపు' అని వ్యవహారము. అఱవపు 'శివప్పు' తెలుఁగున 'చెవపు' అయినది కాఁబోలును.

చిగురుఁగొమ్మ

మనుచరిత్రములోని పద్యములకుఁ గొన్నింటికి నా కంటికిఁ గానవచ్చిన పాఠభేదములను, నా బుద్ధికిఁ దోఁచిన యర్థవిశేషములను ఇక్కడ వెల్లడించుచున్నాఁడను:

అరుణాస్పదపురవర్ణన మిట్లు గలదు;

"అచటి విప్రులు మెచ్చ రఖిలవిద్యా ప్రౌఢి
ముది మదిదప్పిన మొదటి వేల్పు
నచటి రాజులు బంటు నంపి భార్గపునైన
బింకానఁ బిలిపింతు రంకమునకు

నచటి మేటి కిరాటు లలకాధిపతినైన
ముసు సంచిమొద లిచ్చి మనుప దతు
లచటి నాలవజాతి హలముఖాత్తవిభూతి
నాదిభిక్షువుభైక్షమైన మాన్పు
నచటి వెలయాండ్రి రంభాదులైన నొరయఁ
గాసెకొంగున వారించి కడపఁగలరు
నాట్యరేఖాకళాధురంధరనిరూఢి
నచటఁ బుట్టిన చిగురుఁగొమ్మైన జేవ."

పై సీసపద్యము తొలి నాల్గుచరణములలో నాల్గువర్ణ ములవారి వర్ణన మున్నది. ఎత్తుగీతి మూఁడుచరణములు వెల యాండ్రి వర్ణనముగాను, నాల్గవచరణము "ఆయూరఁ బుట్టినది సర్వమును సారవంతమే" యని సర్వవస్తు సామాన్య వర్ణనాత్మకమునుగాను ప్రాచీనవ్యాఖ్యాతలు వ్యాఖ్యానించిరి. కాని యిట్టి యన్వయమునఁ గూర్పుసొంపు గొంత కొఱ వడును. సీసచరణములు నాల్గింట వేర్వేఱుగా నాల్గువర్ణ్యము లున్నట్టు, ఎత్తుగీతి నాల్గుచరణములను నాల్గువర్ణ్యములు వేర్వేఱుగా నుండుటగాని, రెండేసిచరణముల కొక్కటి చొప్పున నాల్గుచరణములకు రెండు వర్ణ్యము లుండుటగాని. లేక నాల్గింట నొక్కటే వర్ణ్య ముండుటగాని నేర్పుగల కూ ర్పనిపించును. ఎత్తుగీతిరెండవ చరణము తుదిని సమాపక క్రియ గలదు. వాక్య మక్కడికి సమాప్తమైనది. వ్యాఖ్యాతల వ్యాఖ్యానరీతికి మూఁడవచరణము నా సమా ప్తవాక్యములోని కీడ్చుకొనిపోయి యన్వయింపవలెను. పెద్దనామాత్యున కిట్టి యన్వయ మభిప్రేతమయేని అతఁడా మూఁడవచరణమును రెండవచరణముగానే నిలిపియుండఁగలఁడు. అప్పు డన్వయ

సారళ్యము పొసఁగును. పెద్దన పయిపద్యమున నొక్కొక్క వర్ణ్యమును 'అచటి' ఇత్యాదిగా వేర్పఱిచి వర్ణించినాడు. ఈ తీరును గుర్తింపవలసినదే.

ఇవి యెల్లఁ బర్యాలోచించినపై నాకుఁ దోచినయ న్వయపద్ధతి నిదె తెల్పుచున్నాఁడను: ఎత్తుగీతి నాల్గుచరణము లందును వర్ణ్యమొక్కటే—వెలయాండ్రే. కాని నాల్గుచరణ ములలోను తొలి రెండుచరణములు నొకవాక్యము; తుది చరణ మింకొక వాక్యము. మూఁడవచరణము దేహళీదీపన్యాయ మున రెండువాక్యములందును బొందుపడును. తొలి రెండు చరణములు వేశ్యా సామాన్యవర్ణనము; తుది చరణమునందుఁ దద్విశేషవర్ణనము. తొలివాక్యమునకు-అచటి వెలయాండ్రు (దేవలోకమునుండి దిగివచ్చి) రంభా ద్యప్సరసలనయినను వంతున కెక్కఁజూచినఁ దమ పృష్ఠభాగపుఁ గోఁక (గోచి) కొంగుతో వెనుకకుఁ దొలఁగఁద్రోచి తాము ముందడుగు వేయఁగలరు: కడవఁగలరు = ముండుగు వేయఁగలరు. ఇక్కడ 'కడప', 'కదుమ', 'కడవ'-పాఠము లున్నవి. ముద్రణమున 'కడప' గలదు. నేను 'కడవ" గైకొంటిని. ఇట్లీ రెండుచరణములందును వేశ్యాసామాన్యవర్ణనముచేసి పెద్దన కడపటి చరణమునఁ దద్విశేషవర్ణనము చేయుచున్నాఁడు. 'నాట్యరేఖాకళా ధురంధరనిరూఢి'ని'అచటఁ బట్టినఁ జిగురుఁ గొమ్మైనఁ జేవ' అచటన్=ఆయూర, పట్టినన్=పరీక్షింపగా—నాట్య మాడించి చూడఁగా—వంచిపట్టి చూడఁగా, చిగురుఁగొమ్మైనన్=పుష్పిత కాని, అంగసౌష్ఠవ మింకను సరిగా విరియని పసితనపు (వెల)

కొమ్మ—ఆడుదికూడ (కొనసాగుచున్న తలిరు (లేత)గొమ్మ కూడ), చేవ=చేవగలదే, గట్టితనముకలదే.

ఇంచుక వివరణము: ప్రౌఢలగు నాయూరి వెలయాండ్రు రసికులకలయికలం దాటితేటి యనుభవజ్ఞానము గడించినవారు గాన రంభాదులతో నొరసి శృంగారరససంప్ర దాయవిశేములను నాట్యాభినయములందుఁ జూపి నేర్పు మెఱయింపవచ్చును. ఆది విశేషముగాదు. రసానుభవమునకుఁ దగ్గవయసింకను రాక ముందే—పసిప్రాయమందె-ఆయూరి వెలకన్నెలు నాట్యాదులందుఁ గడు చతురలు. అర్థాంతరన్యాసముగా నాల్గవచరణము మాత్రము వేర్పఱిచిన నాయూరఁ బట్టి (వంచి) చూచిన లేఁత కొమ్మలుగూడఁ జేవగలవే. పసివారుకూడఁ గడుఁబ్రోడలే యనియు నేర్పడును.

ఈ పద్యమున 'కాసెకొంగున వారించి కడవఁగలరు' అన్న పాఠము 'గదుమఁగలరు' అన్నపాఠముకంటెను, 'కడ పఁగలరు' అన్న ముద్రితపాఠముకంటెను సుందరతమము. మఱియు 'అచటఁ బుట్టిన ఁచిగురు'అను పాఠముకంటె 'అచటఁ బట్టినఁ జిగురుఁ' అన్నపాఠము సుందరతరము. తెనుఁగున 'పట్టిన...కొమ్మ' పలుకుబడికల్మికి 'నేపట్టింది మునగకొమ్మ కాదులే' అని రామదాసుకీర్తన తార్కాణ.

ఈ పద్యమునుగూర్చి కడపవాస్తవ్యులు కళా ప్రపూర్ణులు శ్రీ శేషాద్రిశర్మగారు కడపమండలమున సిగరచెట్లని చెట్లు కలవనియు, వానికిఁ జేవ యుండదనియు, ఆ సిగర చెట్ల

కొమ్మలే చిగురుకొమ్మ లనఁబడెననియు, పెద్దన కడపమండ లమువాఁడు గాన, తదనుస్మరణమున వరణానదీతీరపు టరుణా స్పదపురవర్ణనమున వానిఁ బేరొక్కనె ననియు ననిరి. ఈ పద్య మున వేశ్యలుగూడఁ గడపమండలమువారు గావచ్చును. 'కడపఁగలరు' పాఠమున్నది గదా!

'ఆనందో బ్రహ్మ'

"ఎందే డెందము గందళించు రహిచే నేకాగ్రతన్ నిర్వృతిన్
డెందున్, గుంభగతప్రదీపకళికా శ్రీ దోఁప నందించుఁ బో
కెందే నిందిర్యముల్ సుఖంబు గను, నా యింపే పరబ్రహ్మ మా
నందో బ్రహ్మాయటన్న ప్రాఁజదువ్ నాంతం బర్థ మూహింపుమా!"

నాకు నచ్చిన పాఠప్రకారమునఁ బైపద్యము నుదహరించితిని. అచ్చులోను, వ్రాఁతలోను దీన మటికొన్ని పాఠాంతరములుగలవు, 'కందళింప', 'నేకాంతతన్', 'నెందెందుఁ బోక', 'సుఖింపఁగను', 'అంతుర్బుద్ధి' అనునవి యాపాఠాంతరములు.

ఇందు 'ఎందే డెందము' - ఆదిగా 'సుఖంబుగను' వఱకు రెండు వాక్యములు. తొలి వాక్యమున 'కందళించు'కు శ్రీ జయపురాధీశ్వరులు పొసఁగించిన ధాతుజవిశేషణత్వము సుందరము. ఈ విషయము కాదు ప్రధానముగా నే నీ పద్యమునఁ జెప్పఁబూనినది.

'ప్రాఁజదువు నంతర్బుద్ధి నూహింపుమా' అన్న పాఠముకంటె 'ప్రాఁజదువు నాంతం బర్థ మూహింపుమా'

అన్నపాఠము చాల సుందరమయినది. ఎట్లనఁగా: పయి పద్యోపన్యాసముఁబట్టి ఆనందమే బ్రహ్మమన్న యర్థము వ్యక్త పడును. కాని యింతమాత్రమున వరూథినివాదము నెగ్గదు. ప్రవరుఁ డనఁగలఁడు: 'ఇది యథార్థమే. ఆనందమే బ్రహ్మము. ఆయానందము నాకు గృహ్యాచారధర్మానుష్టానమువలన లభించును' అని. అట్లనుటకు వీలులేకుండ 'ఆనందమే బ్రహ్మము. ఆ యానందము సంభోగరూపము.' అని నిరూపించుటకు 'ఆనందో బ్రహ్మ' అన్న యుపనిషన్మంత్రప్రతీకము నిచ్చి యా మంత్రమును కడముట్టఁ జదువుకొని యర్థ మూహించి చూడు మనుచున్నది. ఆమంత్ర మిది:

"ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్,
ఆనందాద్ధ్యేవ ఖ ల్విమాని భూతాని జాయన్తే,
ఆనందేన జాతాని జీవన్తి
ఆనందం ప్రయ న్త్యభిసంవిశన్తీ తి."

దీనికి వరూథినితలఁపులో నున్న యర్థ మిట్టిది:

"ఆనందమే బ్రహ్మమని తెలిసికొనెను. అనందమున నుండియే (సంభోగానందమున నుండియే) భూతములు జనించుచున్నవి. పుట్టిన యా భూతములెల్ల నా (సంభోగా) నందముచేతనే వర్ధిల్లుచున్నవి.; ఆ యానందములోనికే ప్రవేశించుచున్నవి. ఆ యానందమునకే యభిముఖస్థితిని బొందుచున్నవి.' ఇంతకింకను బచ్చిగా వివరించి చెప్పఁదగినట్టిది వరూథినితలఁపులోని యర్థము.

వరూథిని యచ్చరపువ్వుఁబోఁడి; స్వాధ్యాయానుష్ఠాన పరు లగువిప్రవర్యు లెందఱో స్వర్గమునకు రాఁగా వారితోఁ బ్రసంగములు గావించి ప్రౌఢి కెక్కినది. అద్వైతులు జీవబ్రహ్మైక్యప్రతిపాదకశ్రుతులను, ద్వైతులు జీవబ్రహ్మ విభేదప్రతిపాదకశ్రుతులను, ఇంక నాయా వైదికమత ములవారు తమతమ మతముల కనుకూలము లగుశ్రుతులను నేకరించి యుంచుకొనునట్లు వరూథిని తృతీయపురుషార్థమే పరమార్థమని నిరూపించుటకుఁ దగ్గశ్రుతులను గూర్చికొని నేర్చుకొని యున్నది గావలయు. పయి శ్రుతికి వరూథిని నిర్ణయించుకొన్న యర్థముచొప్పుననే నన్నిచోడమహాకవి యొక పద్యము రచించినాఁడు.

"పృథులవిశ్వంభరా రథమున కెదురుగాఁ
బూన్పించె నెవ్వాఁడు పువ్వుఁదేరు,
కాంచనాచలకార్ముకమునకు సాటిగాఁ
జేపట్టె నెవ్వాఁడు చెఱకువిల్లు,
అవిరళ (తథ?) పాశుపతాస్త్రమ్మునకు వాఁడి
మిగిలించె నెవ్వాఁడు చిగురుఁదూపు
అతులితామరదానవాదిబలంబుల
గెలిపించె నెవ్వఁ డయ్యలిబలమ్ము
నట్టి జగజెట్టి మన్నుఁ డఖిలలోక
ములకు వెఱిగొంగ జీవులమూలకంద
మతని యిలుసొచ్చి వెడలనియతఁడు గలఁడె
యతని యమ్ములఁ బడకున్న యదియుఁగలదె?"

వరూథిని యుపనిషన్మంత్రమునకు గోచరింపించిన క్రొత్తయర్థమును బర్యాలోచింపఁగా ప్రవరునకు సిగ్గును, వెగటును బొడమినవి. సంభోగవిషయ మని సిగ్గు; పవిత్ర మైన మంత్రార్థము పాడుపడిన దని వెగటు.

పాత్యాగమసూక్తపంక్తి

"ఈ పాండిత్యము నీకుఁ దక్క మఱి యెం
దేఁ గంటిమే కామశా
స్త్రిపాధ్యాయివి నా వచించెదవు మే
లోహో త్రయీధర్మముల్
పాపంబుల్ రతి పుణ్య మంచు నిఁక నే
లా తర్కముల్ మోక్షల
క్ష్మీపథ్యాగమసూత్రిపంక్తి కివె పో
మీ సంప్రదాయార్థముల్."

అన్నాఁడు. ఈపద్యమున "మోక్షలక్ష్మీపాత్యాగమ సూక్త (త్ర) పంక్తి కివిలో మీ సంప్రదాయార్థముల్." అన్న పాఠము సుందరము. మోక్షలక్ష్మిని (అచ్చరపూఁబోఁడినికాదు) బడయుటకుగాను పాత్యమయిన యుపనిషన్మంత్రక్రమ మునకు మీ సంప్రదాయమువారు (తృతీయపురుషార్థమే పరమార్థమనువారు) చెప్పెడు నర్థ మిట్టిదియా యనుట నేఁ జూపిన పాఠమున కర్థము.

కృష్ణదేవుఁడు గాదు, బాలకృష్ణుఁడు

తెలుఁగు సకలకథాసారసంగ్రహము అయ్యలురాజు రామభద్రవిరచితము "శ్రీకృష్ణదేవరాయ ప్రేరణమున తదం

కితముగా రచితమయ్యె" అని వెనుక నొకప్పుడు వ్రాసితిని. అది కృష్ణరాయప్రేరణముననే రచింపఁబడెనుగాని శ్రీకృష్ణ దేవరాయనికిఁ గాక శ్రీకృష్ణదేవుని కంకితము సేయఁబడినది. అం దిట్లు గలదు:

"కనకవస్త్రంబుగల మృదుతనువువాఁడు
భర్మనూపురయుతసదాబ్జములవాఁడు
మించి వేదాంతముల సంచరించువాఁడు
ప్రౌఢి శ్రీ కృష్ణుఁ డనుపేరఁ బరగువాఁడు."

మదీయభాగ్యవశంబున స్వప్న కాలంబునఁ బ్రసన్నుండై పరమ మంత్రోపదేశపూర్వకంబుగా సకలకథాసారసంగ్రహంబునకుఁ గృతి నాయకునిఁ గావింపు మని హితోపదేశంబు చేసి యంతర్హితుం డయ్యె."

స్వప్న వృత్తాంతమును గవి కృష్ణరాయల కెఱిఁగించెను. ఆ రాజముఖ్యుం డిట్లనియె:

"నీవును బాలకృష్ణపదనీరజభక్తుఁడ వార్యచిత్తమో
దావహసద్గుణుండవు రమాధిపునిం గలలోనఁ గాంచి య
ద్దేవు హితోపదేశమునఁ దేజము నొందినవాఁడ విన్నిటన్
గావున నీ పరిబంధము ప్రకాశముగా హరి కిమ్ము నావుడున్."

ఇందు పురాణాదులనుండి పుణ్యకథలను రామభద్ర కవియే సేకరించిన ట్లున్నది. రాయలవారి సంస్కృత గ్రంథానుస్మరణము లేదు. ఉపలభ్యమానమగు గ్రంథము తుదిపద్య మిది:

"కడు వచియింపరానిఘనకష్టము లెల్లను గృష్ణ సత్కృపన్
గడచితి మింకమీఁదను ఘనస్ఫుటరాజ్యరమాభివృద్ధిచో
పుడు నని మీరు గోరుటలు బాపురె వ్యర్థము లాయె; నింక నే
నుడువఁగనేల మృత్యు వెడనూల్కొని కానఁగవచ్చు చోటులన్."

ఈ తుదిపద్యము కృతికర్తదో, కాదేని కృతిప్రేరకునిదో యవసానమును దెలుపుచున్న ట్లున్నది.

శ్రీకృష్ణదేవరాయలవారి కడపటికాలపుకడగండ్లకే యీపద్యము కడుంగడు సరిపడునదిగా నున్నది. ఏక పుత్త్రుఁడు చనిపోవుట, తిమ్మరుసుకన్నులు తీయించుట, తత్పుత్త్రుని తిరుగఁబాటు, తగవులు, ఈ సంక్షోభములో రాయల మరణము—ఇన్నింటి నీ పద్యము ధ్వనించుచున్నది.

శ్రీకృష్ణరాయఁడు రామభద్రకవిని 'నీవును బాల కృష్ణపదనీరజభక్తుఁడవు' అన్నాఁడఁట. ఇక్కడ విశేష మేమనఁగా, నుదయగిరిని జయించినప్పు డక్కడనుండి మిక్కిలి చక్కని బాలకృష్ణవిగ్రహమును శ్రీకృష్ణదేవరాయలు విద్యానగరమునకుఁ గొనివచ్చి దేవళము కట్టించి యందుఁ బ్రతిష్ఠించి పూజించుచుండుఁవాఁడట.

ఆయన బంగరునాణెములందుఁగూడ నాబాలకృష్ణుని విగ్రహము ముద్రితమయియున్నది. కృష్ణరాయలతోపాటు రామభద్రకవియు నా బాలకృష్ణమూర్తిని గొల్చుచుండు వాఁడు గాఁబోలును! దివ్యసుందరవిగ్రహ మగునాబాల

కృష్ణమూర్తి యిప్పుడు మద్రాసు మ్యూజియములో పూజా పురస్కారములు లేకున్నను దర్శనీయమై యున్నది.

దొరకినవఱకు శ్రీ కృష్ణరాయకృత మగుసకలకథా సారసంగ్రహ శ్లోకము లివి:—

"క్షీరాంభోధితపఃఫలేన మహతా నీరాజితోరఃస్థల
స్తారాధీశదినాధినాథనయనో ధారాధరశ్యామలః
యో వేదాంతగిరా మలభ్యమహిమా దేవేశముఖ్యైస్తుతః
సోఽయం తిష్ఠతు మామకీనహృదయే శ్రీ వేంకటాద్రీశ్వరః."

"సాందార్ద్రానందఘన స్సమగ్రకరుణాసంపూర్ణనేత్రాంచలః
మందాకిన్యధివాసమంజుళజటాజూటో.....
కళ్యాణాచలకార్ముకః కలయతాం కళ్యాణ మవ్యాహతం
చందార్ద్రాలంకృతమౌళి రద్రితనయాశ్శృంగారితాంగ శ్శివః."

"శ్రీమా నభూత్తుర్వసువంశమౌళి ర్శ్రీతిమ్మభూపో జగదేకవీరః
స దేవకీనామ్ని కళత్రరత్నే ప్రాసూత ధీరం సుత మీశ్వరాఖ్యమ్."

"స బుక్కమాంబాం పరిణీయ తస్యా మౌదార్య గాంభీర్య వివేక శౌర్యైః
దాక్షిణ్య కారుణ్య నయైశ్చయుక్తం లేభే తనూజం నరసక్షితీశమ్."

"సభాల్య పావావని మర్ణవాంతా మత్యర్థశౌర్యేణ నిరంకుశేన,
మాంధాతృముఖ్యాన్ మహితాన్ మహీపాన్ యశోవిశేషై
రఖిలా నజైషీత్."

"బాహ్వోర్బలే నార్జితవిత్తజాతై ఃకృతార్థయి త్వాఖిలమర్థిసార్థమ్-
కాశీప్రయాగాది మహార్హతీర్థే మహాంతి దానాని ముహుశ్చకార."

"కులేన శీలేన గుణేన భక్త్యా ప్రేమ్ణానుకూల్యేన చ సంయుతాయామ్,
నాగాంబికాయాం నరసక్షితీశః ప్రాసూత మాం న్యక్కృతవైరివర్గః."
"సోఽహం సుతంశ్లాఘ్యగుణాన్వితాయాం తిమ్మాంబికాయా మిహ
తిమ్మ భూపమ్,
ఉత్పాద్య నామాస్య సహోర్థజాతై స్సమార్పయం వేంకటశైలభర్త్రే."
"ఏవం చ చేతస్యనవాప్య తృప్తిం వాచాపి పూజాం కలయే కథం వా,
శ్రీవేంకటాధీశితు రిత్యుదారం చిత్తే విచారం కలయన్న వాత్సమ్."
"ఉత్సాహం మమ వీక్ష్య మద్గురు రథ శ్రీవ్యాసతీర్థో మునిః
పర్యాలోచ్య పురాణశాస్త్రవివిధామ్నాయేతిహాసాదికాత్,
లబ్ధా స్తత్ర కథా హరేః పశుపతే స్సామ్యం నిరూప్యా (రస్యా?)ధికం
విష్ణుం కీర్తయ సర్వధే త్యుపదిశన్ మహ్యం ముదా దత్తవాన్."

ఆహివెట్టు :

"ఆహివెట్టితి జొన్నగడ్డాగ్రహారవృత్తి యేనూఱురూకల వృత్తమునకు"
(క్రీడాభిరామము, పొ. ౯౦)

ఆక్షేపము :

"ఇందు 'ఆహివెట్టు=తాకట్టుపెట్టు' అని శ్రీ శాస్త్రిగారు (పీఠిక పొ. ౧౨౩)అర్థము వ్రాసినారు. ౯౦ పొరటలో మూలమునగూడనిచ్చి యున్నది. కాని 'ఆహివెట్టు' అను పదమే యెక్కడను గాన్పింపదు. కావున నిట 'ఆధివెట్టు'అని యుండవలయును. ఆధి శబ్దమునకుదాకట్టు అను నర్థము గలదు.

ఈ క్రింది ప్రయోగములోగూడ 'ఆధివెట్టు' పదము గలదు.

'గ్రహణసంక్రమణాదుల రాచనగరఁగాసువీసంబు పెడలమిగ్రాసమునకు
నాధివెట్టిరి క్షేత్రంబులందుఁగొన్ని-లెస్సయుండు నెగృహభర్త లేనిబ్రదుకు.'
(మనుచరిత్ర, ౩-౩౪)

దీనికి నేఁ జెప్పు సమాధాన మిది :

నిఘంటువులలో ఏకమాత్రప్రయోగముతో ఎన్నో పదములు పరిగృహీతము లయినవి.

ప్రాఁతప్రతిలో నున్న 'ఆహి వెట్టు' ప్రయోగము సరికా దన్న యపనమ్మకము నాకు లేదు. కాన దానిని నే దిద్దలేదు. 'ఆధి' పద మొకటి 'తాకట్టు' అర్థముగలది ఉన్నంతమాత్రాన 'ఆహి' ఉండ దనవచ్చునా?

గౌరన హరిశ్చంద్రోపాఖ్యానమున ఎల్లప్రాఁతప్రతులలో 'ఆహికంబులు వెట్టి' అన్న ప్రయోగము గానవచ్చుచున్నది- 'ఆహికంబులు వెట్టి యవి దక్కుమితులు సాహసంబునఁ బల్కి' (చూ. ఉత్తరభాగము). ప్రౌనుదొరగారిపండితులు ఇందు 'తాకట్టు పెట్టి' అని యర్థము ప్రాసిరి. తేవప్పేరు మాళ్లయ్యగారు ప్రాఁతప్రతులను, ప్రౌనుదొరగారు ప్రాయించిన టీకను బరిశీలించి 'ఆహికము' తాకట్టు అనునర్థముతో ప్రకటించిరి (చూ. ౧౯౪ పుట). పిదప శ్రీ వేంకటరాయ శాస్త్రిలుగారు మరల నాగ్రంథమును ప్రకటించుటలో ఆహికము శబ్దరత్నాకరాదినిఘంటూద్ధృతము గాకుండుటచేఁ గాఁబోలును 'ఆహితము' అని దిద్దిరి (చూ. ౧౩౧ పుట). తాకట్టు అనియే యర్థము ప్రాసిరి. ఆ పాఠము ప్రాఁతప్రతులలో లేదు. తెలుఁగున 'ఆయకము' అను పదము తాకట్టు అనునర్థమున వ్యవహారమునఁ గలదు. 'ఆయకము' రూపాంతరము 'ఆహకము' అని యుండునని కాఁబోలును ప్రౌను, సీతారామాచార్యులు తమ నిఘంటువులలో గౌరనప్రయో

గమును 'ఆహకము'గా గ్రహించిరి. వ్రాతప్రతులలో లేని 'ఆహకము' రూపము గ్రాహ్యముకాదు. గౌరన నవనాథ చరిత్రమునఁగూడ 'ఆహికము' కలదు — 'ఆహికంబులు వెట్టి యప్పులు వార, వృద్ధి కొసంగుదు...' (చూ.౧౫౬పుట). ఆహి, ఆహికము రూపభేదములు కాఁబోలును. ఆహిపద ప్రయోగము ఇంత సాధకసామగ్రి కలది. శ్రీనాథప్రయుక్త మయిన యీ 'ఆహి' ప్రయోగము విడనాడి యీ యర్థమున శ్రీనాథరచనముల నారగించి, జీర్ణించుకొని, కవితాబలము గడించినవాఁడు పెద్దనామాత్యుఁడు 'ఆధివెట్టిరి' అని ప్రయోగించుట యేల యని పరిశీలింతును గదా, మను చరిత్రమునఁ గూడ 'ఆహివెట్టిరి' అనియే యుండుట కాన వచ్చెను. ప్రాచ్యలిఖితపుస్తకశాలలో మనుచరిత్రప్రాఁత ప్రతులు ౧౫ ఉన్నవి. అందు ౧౧ ప్రతులలో 'ఆహివెట్టిరి' ఉన్నది. తక్కినవి కొన్ని కాగితపుఁబ్రతులు, ఇటీవలివి. అందు 'ఆధివెట్టిరి' ఉన్నది.

ఆహివెట్టు=తాకట్టుపెట్టు అనునర్థమునసే ప్రయోగాంతరము.

అప్పుడే గోవిందునికి—ఆహివెట్టితిఁ జిత్తము.
(తాళ్లపాకవారి యధ్యాత్మ సంకీర్తనములు, పుట.౬౯)

ప్రాకృతమున గాథా, కథా శబ్దములకు 'గాహా'; 'కహా' రూపములు కలవు. 'ఆధి' శబ్దమునకు 'ఆహి' ప్రాకృతరూపము కాఁబోలును! థ, ధ లకు హకారాదేశము కొన్ని ప్రాకృతములందు గాననగును.

తేఁడు :

"వీఁ డిదె తెల్లనాకులను వీడెము సేయుచు వీథి వచ్చుచు
న్నాఁడు మదించి తిండి తినినాఁడుసుమీ యిటమీఁద నేడకో
తేఁడఁగఁ బోయెడిన్ గరణదేశపుజాణఁడు గాఁగనోపు నీ
బాఁడు పణోపహారపరిపాటి యెఱుంగఁగవచ్చు వీనిచేన్."
(కీడా. ౫౩ పొ.)

ఆక్షేపము:

"ఇట 'తేఁడు=వెదకు' అని (పీఠిక, ౧౨౧ పొ.) శ్రీశాస్త్రిగా రర్థము వ్రాసినాడు. కాని తేఁడుధాతువున కీయర్థమును, తన్నిర్ణాయక ప్రయోగములును గాన్పింపవు. ఇదియేగాక ఈ పద్యమునఁగూడ వీరు వ్రాసిన యర్థ మేమాత్రమును సందర్భోచితముగా లేదు. శబ్దరత్నాకరములో నీపదమునకు 'తెండు, శయనించు' అనునర్థము వ్రాసి,

'అతివ పుఁర్ణేందుభీతిఁ దదశ్మశాలఁ
దేఁడి యతఁడందు నినుమడి తీండ్రి దోఁప
మింటిపై నుంట కా నని యింటిపైకిఁ
దెచ్చుకొంటి నటంచుఁ బెన్ జీచ్చ వెడలు.'
(ఆముక్త. ౫-౧౪౬)

ఉదాహరణముగా నీయఁబడినది. ఈయర్థమే క్రీడాభిరామ ప్రయోగమునఁగూడ నెంతయు సమంజసముగా నున్నది. ఈ బ్రాహ్మణుఁడు పూఁటకూటింట భుజించి తాంబూలము వేసికొనుచు నెక్కడకో శయనింపఁ బోవుచున్నాఁ డని యిట భావము. మఱియు,

'అనలునిఁ గాఁడుచుం జమునినాడుచు రాక్షసుఁ బాడుచుంగప
ర్దినొసలు చూఁడుచుం దనుజు వ్రేవులు దోడుచుగాడ్పు కడ్పులో

గునుకులు గోడుచున్ వరుణు గుండియఁ దేఁడుచు వాహనేంద్రు నం
దిని జన వేఁడుచున్ నృపతి నేర్పులు దీడుచు వెండి వాఁడిగన్.'

(కకుత్స్థ. ౫—౧౭౩)

'గుండియఁ దేఁడుచున్=గుండియయందు శయనించుచు'—ఇతరులను బెదరించునప్పుడు 'నీగుండెలలో నిద్రపోవుదును' అనుట వ్యవహారమునఁ గలదు. దానినే యీ కవి యిట గ్రహించినాఁడు. మఱియు 'తేఁడు' ధాతువుసమానార్థక మగు 'తెండు' ధాతువునకుఁ గూడ 'శయనించు' అను నర్థమే సపరిమాణముగాఁ గాన్పించుచున్నది. పై విషయములన్నియుఁ బరిశీలించి చూడఁగాఁ గిరిడాభిరామప్రయోగములో శిరిశాస్త్రిగారు వ్రాసిన యర్థము సమంజసముగా లేదని తోఁపకపోదు."

ఇందుకు నా సమాధానము:

'తేఁడు' కు 'వెదకు' అను నర్థముకూడఁ గలదనుటయే నా యాశయముగాని 'శయనించు' అను నర్థము లేదనుట గాదు. 'వెదకు' అర్థమున 'తేండుదల్' తేడుదల్. తేడి తేడి, ఇత్యాదులు దమిళమున సర్వసామాన్యముగా వాడుకలో నుండును. 'తెండు తేఁడులు రూపాంతరము లగుట అంగీకరించినవిషయమే కదా. తెలుఁగునఁగూడ "వాఁడు తెండుకు తెండుకు అవస్థపడుచున్నాఁడు నే నన్న మాటకు" ఇత్యాదివ్యవహారము నా జన్మదేశమగు కృష్ణా మండలమున నున్నది. 'తెండు'కు "తిరుగఁదోడు, కలఁబెట్టు' పెనఁగులాడు, వెదకు, తదేకవిచారముతో నుండు" ఇత్యాదివిధముల నర్థము సంగత మయియున్నది.

ఆముక్తమాల్యదా, కకుత్స్థవిజయ ప్రయోగములు నేఁ జెప్పిన యర్థమునకుఁ గూడఁ బొసఁగునవియే—"చంద్ర కాంత శిలాశాలలోఁ దాపము గొల్పని పట్టు వెదకి అనియు. "వరుణుని గుండెల వెదకుచుఁ (గలఁబెట్టుచు)" అనియు మీఁదిపద్యములలో నేఁ జెప్పిన యర్థము సరిపోవుచునే యున్నది. మఱియు నాముక్తమాల్యదాపద్యమున ప్రాచీన ప్రతులలోఁ గొన్నింట—

"అతివ పూర్ణేందుభీతిఁ దదశ్మశాలఁ
ద్రేణి యతఁ డందు నినుమడి తీంద్రఁ దోఁప"

అని కలదు (ఓరియంటల్ లైబ్రరీ ౧౧—౩—౧ వ్రాఁతప్రతి). దీనికి శ్రీనివాసీయవ్యాఖ్యలో "యువతి పూర్ణ చంద్రునిమీఁద భయపడి చంద్రకాంతశాలలో ప్రవేశించి, ఆ చంద్రకాంతశాలయందు చంద్రుడు మిక్కిలి వేండ్రముగా కానవచ్చేటప్పటికి" అని కలదు. సి. పి. బ్రౌనుదొరగారు కూడఁ దమ నిఘంటువున నీపట్టున ప్రయోగమును 'త్రేణి' యనియే గ్రహించిరి. బ. సీతారామాచార్యులవా రేలొకో, బ్రౌనుదొరగారి పాఠమును గ్రహించినవారు గారు. మఱియు, బ్రౌనుదొరగారు 'త్రేణి' కి ఆముక్తమాల్యదనుండియే ప్రయోగాంతరమును గూడఁ జూపిరి. అది యిదిఃఁ

"హత్తుకొని యొక్క కొందఱు
నత్తెరువుంగట్టఁ బనిచ యందఱక్రియఁ దాఁ
దిత్తి యొకటి గొని త్రేణి మ
ఱుత్తర ముత్తరమటంచు నొకపొగ్గిడుకడన్."

శ్రీ వేంకటరాయశాస్త్రిలవా రీ పాఠమునే గ్రహించిరి. మఱియు వ్యాఖ్యలో నిట్లు వ్రాసిరి:

"'తేండి' దొరికిన వ్రాఁతప్రతు లన్నింటను 'త్రేణి' అని యున్నది. 'త్రేణి' అని 'తెండి' (=శయనించి) అనుటకు ఈవ్రాఁత పుస్తకములలో తఱచుగఁ గలదు. 'తేఁడు' ధాతువు 'తెండు' ధాతువునకు రూపాంతరముగా శ. ర. లో నున్నది. కొన్ని దేశ్యశబ్దములందు తొలియక్కరమునందలి వ్రకార వడుఁలు అంతరించుట ప్రసిద్ధమే. డకారముతావున ణకారము నిలుచుటయు సిద్ధమే. ఉ: అణఁగు—అడఁగు, పోణిమి-పోఁడిమి ఇత్యాదులు. కావున నిట కవి ప్రయోగించిన పదము 'త్రేణి' అని యుండునని యూహింపఁబడినది. ఆ వ్రాఁతపుస్తకములలో టీకయుఁగలదు. అందు 'త్రేణిమటి' 'నిద్ర మేల్కాంచి' అని యర్థమును వ్రాయఁబడినది".

'తేఁడు'కు 'వెదకు' అర్థమును నిరాక్షేపముగా నిరూపించు ప్రయోగ మిది యొకటి గలదు:

"జూదంబుఁ బన్నిదంబును
వాదునుఁ బతితోడఁ దేఁడ వలవదు కడుఁ బో
రా దయ్యెనేని భృత్యులు
భేదము గాకుండు గెలుపు పెనుపఁగవలయుఁ."
(భోజరాజీయము)

ఆముక్తమాల్యదపీఠిక ౫౧–వ పుటలో శ్రీ వేదము వేంకటరాయ శాస్త్రిలవా రీ ప్రయోగమునుగూడఁ జూపి

యిట్లు బ్రవాసిరి: "తేఁడు అనఁగా వెదకుట అని యరవమునఁ బ్రసిద్ధము. ఆ యర్థమున శ. ర. లేదు."

'తేఁడు'కు 'వెదకు' అర్థము స్పష్టమగుచుండఁగాఁ, దదనుసారిగా క్రీడాభిరామపద్యమునకు నేఁ జెప్పిన యర్థము "ఏమాత్రము సందర్భోచితముగా లేదు", "సమంజసముగా లేదు" అఁట! ఏలో?

ఆ బ్రాహ్మణుఁ డొరుఁగంటికి వేడుకలమీఁద వేడుకలు దిలకించుటకు, విహరించుటకు వచ్చినాఁడు గాని యూరగించి నిద్రించుటకుఁ గాదు. దిట్టముగా తిండి దిని తాంబూలచర్వణము సేయుచు వేడుకపట్టులు వెదకఁబోవు చున్నాఁడను నర్థ మేల సమంజసముగాదు?

బెడంగు:

బసవపురాణమున-

"కోర బెడంగనో కుంచెఁడు లేవొ,
ఆరగింపఁగఁ బెట్ట నేరకుండితినొ"

అని గొడగూచికథలో ద్విపద గలదు. ఇందు 'బెడంగనో'కు అర్థము కుదురక తంటాలు పడితిని. శ. ర. బెడఁగు = అందగించు ఇత్యాద్యర్థములు పొసఁగవు. వెడఁగు=వికారము అర్థముగల దగుటచే, పాలగిన్నె పాలు బ్రాగుట కనువుగా లేక, మూతి వెడలై వికారముగా నున్నదని బ్రాగవైతివా అని యర్థము కుదురుట గుర్తించి,

'అని + ఓ (అనియో)' ఉండక, 'అనో' ఉండుట అత్యపి
గొల్పఁగా, సందేహచిహ్నముతో నా యర్థము పీఠికలోఁ
దెల్పితిని. ఆ నడుమ శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగా
రొకనాఁడు సంభాషణలో భీమకవి కన్నడగ్రంథమున
'గిన్నె తోమనైతినా' అని పరివర్తన ముండుటను దెలిపిరి;
తెలుఁగున బెడఁగు = శుభ్రపఱచు అనుటకు ప్రయో
గాంతరము లున్నఁగదా యా యర్థము చెప్పఁగుదురుట
అనిరి. శబ్దరూపనిష్పత్తిరీతిని పూర్వపూర్వము గుర్తించిన,
వెలుఁగు, బెడఁగు పదము లొక్కఁడాననుండి యేర్పడినవే
యగు ననుకొంటిమి. కాని భాషలో ప్రయోగము లుండ
వలదా? కొన్నాళ్లకు భారతిలో ప్రకటితమయిన త్రాళ్ల
ప్రొద్దుటూరిశాసనమున "తెలుపెక్కఁ గఱవోవ బెళగిన
పునుక మించిన వెండికోరగాఁ జేతఁ బట్టి" అని ప్రయోగము
గానవచ్చినది. ఇందు 'బెళగిన' అనుచో 'ళ, గ' ల నడుము
సున్న లేదు. బెళగు, బెడగు రూపభేదములే. సోమనాథుఁ
డీ ధాతువును సానుస్వారముగాఁ బ్రయోగించెను. శాసనము
ననుసరించి, 'కోరను బెడగనో' అని సోమనాథుని పాఠము
సంస్కరించుటా? అర్థము కుదిరినదిగాని అది సానుస్వార
పదమా, నిరనుస్వారపదమా? సందేహమే.

దోహరి:

క్రీడాభిరామమున "..... దాత్యూహవ్యూహంబులుం
గలిగిన మోహరివాడయందు...." — "కొలుచును జేనవెట్టి"
ఇత్యాదిపద్యము కుట్రపువాని వర్ణనముతో నున్నది. దానిఁ

బ్రకటించునాఁడు మోహరివాడ యనఁగా నా కర్థము తెలియదయ్యెను, "యుద్ధభటు లుండు వాడ యనుకొందును" అని పీఠికలో బ్రాసితిని. మోహరము=యుద్ధవ్యూహము అని అర్థముండుటనుబట్టి య ట్లనుమానించితిని. ఇటీవలఁ దెలియవచ్చిన కొత్తయర్థము:

కాళీఖండము సప్తమాశ్వాసమున–

"బ్రార్థింప నున్నాఁడు పాదాగ్రముల బ్రాలి
వెలివాడవాఁడు తద్విప్రకులుని"

ఇత్యాదిపద్యమున,

"దీవింప నున్నాఁడు తెలిసి దోహరిబంటుఁ
జెవి నఱుమాలికఁ జెరివి ద్విజుఁడు"

అన్నచోట 'దోహరిబంటు' ఉన్నాడు. ఈతఁ డిక్కడ మటియు చండాలుఁడు, మాల, వెలివాడవాఁడు అనియుఁ జెప్పఁబడినాఁడు.

మటియు నాముక్తమాల్యదలో, "అనినఁ గహకహ నవ్వి యద్దోహరికి సురదోగ్ధిహి యిట్లనియె" (౯–౩౧వచనము) అని కలదు. ఇక్కడ 'దోహరి' యనఁగా మాల (దాసరి), చండాలుఁడు – వెలివాడవాఁడే. అచ్చుపుస్తకములలో "అ ద్దాసరికి సురదోగ్ధిహి యిట్లనియె" నని కలదు కాని, ఓరియంటల్ లైబ్రరీలోని బ్రాఁతప్రతులలో ఒక్కదానఁ

దక్కఁ దక్కిన యన్నింటను 'దోహరి' అనియే కలదు. బ్రౌనుదొరగారును, సీతారామాచార్యులవారును 'దాహరి' యని గ్రహించి నేఁ జూపిన యాముక్తమాల్యదాప్రయోగమునే యుదాహరించిరి. 'దాహరి- దాసరి' రూపభేదము లని వారి తలఁపు. కాని యా పదము 'దోహరి' యే. ఆముక్తమున 'దోహరికి సుర-ద్రోహి' యని 'దో- ద్రో' యతిసంగతి యుండుటఁ బ్రాఁతప్రతు లన్నింట దోహరి యనియే కానవచ్చుట, కాశీఖండమునను 'దోహరి బంటు' ఉండుట—అది 'దోహరి' యే యనుటకు సాధకములు. మఱియు, బసవపురాణమునను, పండితారాధ్యచరిత్రమునను 'దోహరి కక్కయ్య' యను శివభక్తుని చరిత్ర మున్నది.

శివభక్తులయిన మాలలతో ద్విజులు సరిగా రని చెప్పు కథాసందర్భములో—

"ముక్కంటిగణము దాఁ గక్కయ్య నాఁగ—
నీ ద్విజులకు వైరి...

[విష్ణుమాహాత్మ్యము వర్ణించు పురాణభట్టును ముక్కలుగా నఱకి చంపెను.]

దోహరి కక్కయ్య మాహాత్మ్య మెఱిఁగి
యూహింప భక్తుల నొండనఁదగునె" [బసవపురా. ౩ ఆశ్వా]

అని కలదు. పండితారాధ్యచరిత్రమున—

"కలసె నంత్యజుఁ డనఁగా నెట్లు వచ్చు-
నికఁ మట్లునుగాక కక్కయ్యగణము, [బసవపురాణకథయే]

అటు గాన దోహరు లన నెటు వచ్చు-
పటుతరంబగు భక్తిపరుల వెండియును" [ప్రథమపరిక రణము]

అని కలదు. ఇన్నింటినిబట్టి 'దోహరి' మూల యని యెఱుఁగనగును.

మఱి యీయాయన్నింటికంటె వ్యక్తమగునట్లు ఓరియం టల్ లైబ్రరి ౧౪-౪-౨౮ నెంబరు పుస్తకమున—

"కళ్యాణమందు దోహర కక్కయ్య అనే భక్తుడు తోళ్ళ తిత్తులు కూర్చేవాడు, దోహరుల కులంయందు జని యించి తన పూర్వాశ్రమం ఖండించి వీరశైవదీక్ష...." ఇత్యాదిగాఁ గలదు.

దీనిఁబట్టి దోహరిపదము 'గొడారి'కి పర్యాయపదమని స్పష్టపడినది. గొడారులు తోళ్లతో చెప్పులు, తిత్తులు కుట్టు చుందురు. వారు మాలవారిలో నొక తెగవారు. 'మాలకు మాంసంబు, మఱి గొడారికిని దోలును' నన్నట్టు—బసవ పురాణము. ఈ ద్విపద శ. ర. లో భాగవతమున నున్న ట్టున్నది సరికాదు. క్రీడాభిరామమునఁగూడ 'మోహరివాడ'ను 'దోహరివాడఁ' జేయవలెనేమో! 'దోహరులు' చెప్పులు మొదలగు తోళ్లకుట్రమేకాక వెలివాడవారికి 'రవికలు' మొదలగు బట్టలకుట్రముకూడఁ జేయువారు గాఁబోలును! ఇట్టి యాచారము తెలుఁగునాఁటఁ గొన్ని యేండ్లక్రిందటి దాఁక సాగుచున్నట్టు వినికి.

ండి

తెలుఁగున ప్రథమావిభక్తి 'ండు'

ఎట్లు పుట్టినది?

తెలుఁగుభాషలో నేఁడు ప్రాయికముగా మహాద్వాచకము లయిన శబ్దముల తుద ప్రథమావిభక్తిప్రత్యయముగా 'ండు' గలదు. ఇది దీర్ఘపూర్వ మగునేని యరసున్నగా మాఱును. హ్రస్వపూర్వ మగునేని యరసున్నగాఁగూడ మాఱును. మఱియుఁ బ్రాయికముగా ప్రాతిపదిక మది తత్సమమో, తద్భవమో యగునేని 'ండు'కుఁ బూర్వమున్న హ్రస్వాకారమునకు ఉకారముగూడ వచ్చును. వాఁడు, మగండు, మగఁడు, రాముండు, రాముఁడు - అనునవి యుదాహరణములు. కాని యీ రూపము లర్వాచీనకాలము నాఁటివి. ప్రాచీనకాలమున నివి 'వాణ్డు' మగణ్డు, రామున్డు, అను విధమున నుండెడివి. లిపి యిట్లే యున్నను ద్విత్వ శైథిల్యముచే నివి తేలఁబలుకఁబడుచుఁగూడ నుండెడివి.

ఇఁక వీనిలో 'ణ్డు' ఎట్లు వచ్చినదో కనుఁగొనఁబ్రయత్నింతును. ప్రాయికముగా తెలుఁగుపదములు పెక్కులు ప్రథమావిభక్తిబహువచనరూపములను ముందు పడసి వాని ననుసరించి తర్వాత నేకవచన రూపములఁ బడయుట

కాననగును. ఈఁగలు, చిలుకలు, అడుగులు, చెఱువులు ఇత్యాది బహువచనరూపములు ముందు పుట్టిన పిదప వీని ననుసరించి ఈఁగ, చిలుక, అడుగు, చెఱువు ఇత్యాద్యేక వచనరూపములు తర్వాత పుట్టినవి.

ద్రావిడభాషా కుటుంబమున ప్రథమనిష్పన్నమైన యఱవమున అవన్, మగన్, రామన్ అనునవి ప్రథమా విభక్త్యంతపదములు, అఱవముతర్వాత పుట్టిన తెనుఁగున కీపూర్వభాషలోని ప్రథమావిభక్త్యంతపదములే ప్రాతిపది కము లయినవి. ఇట్లగుటసంగతమే. ఇట్లు అవన్, మగన్, రామన్ అనియున్న ప్రాతిపదికములకు బహువచనప్రత్యయ మగు 'ఱు' (ఇది బండి ఱ గా ప్రాచీన శాసనలిపి గలదు) పరము కాఁగా అవన్ఱు, మగన్ఱు, రామన్ఱు అను రూపము లేర్పడవలసి యుండెను. కాని యేకపదమున 'న' కార 'ఱ' కారములకు సంయుక్తత అఱవముననే కాని తెలుఁగున నెక్కడను లేదు. తెలుఁగుభాషాస్వభావమున కట్టియుచ్చారము విరుద్ధము. అట్లగుటచేఁ దెలుఁగున నకార ఱకారములు సంయుక్తములుగా నేర్పడవలసినచోట్ల నకార ఱకారములకు నడుమ, బహుప్రాచీనకాలమునఁ దెలుఁగున లిపియు నుచ్చారమును గలిగినట్టియు, క్రమముగా నా లిపియు నుచ్చారమును 'డ'గా మాఱిపోయినట్టియు నొక వింత హల్లు ఆగమమై వచ్చి చుండెను. అదియే నేను అహవనకరశాస నము, సత్యాదిత్యచోడమహారాజుశాసనము మొదలగు వానిలోఁ గుర్తించిన వింత లిపి గల హల్లు. అది

బండి అ కాదు. థ కాదు. ఆ వింత లిపియొక్క ప్రాచీన కాలోచ్చారము కొంత టవర్గాతురముల యుచ్చారమునకుఁ జేరిక గలదై యుండవచ్చును. అది పెక్కుచోట్ల 'డ' గా మాఱినది. కొన్ని చోట్ల 'ట'గాఁగూడ మాఱియుండునట్లు నే ననుమానించుచున్నాను.

ఇప్పుడు 'న'కారము, 'వింతహల్లు', 'ఱు' సంయుక్తమైన యతురముతో శబ్దరూపము లేర్పడఁగా, బహువచన ప్రత్యయమగు 'ఱు' లోపింపఁగా హలంతము లయిన పదముల చివర 'ఉ' చేరఁగా, నేకవచనమున అవను, మగను, రామను (న క్రింద నున్నదే వింతలిపి గల వింతహల్లు.) ఇత్యాదిరూపములు కలిగెను. ఈ హల్‌రూపములే సత్యాదిత్యచోళమహారాజాదుల శాసనములందు లెక్కలేనన్ని యున్నవి. క్రమముగా నీ వింతహల్లు 'డ'గా మాఱఁగా 'డ'కుఁ బూర్వమున నున్న 'న' 'ణ'గా మాఱఁగా, 'అవణ్ణు, మగణ్ణు, రామణ్ణు' ఇత్యాదులు బహువచనరూపములును, 'అవణ్ణు మగణ్ణు, రామణ్ణు' ఇత్యాద్యేకవచనరూపములును నేర్పడినవి. ఉరల్ రోలుగా మాటినట్లు 'అవణ్ణు' 'వాణ్ణు'గా మాటినది. తర్వాత వాణ్ణు వాఁడుగాను, మగణ్ణు మగఁడుగాను అర్వాచీనభాషలో మాటినవి. ఇట్లే నేటి ప్రథమావిభక్తి 'ండు' ప్రత్యయములకెల్ల సమన్వయము గుదురును.

తెలుఁగుభాసలో నకార ఱకారములకు సంయుక్త ప్రసక్తించునపుడు నడుమ వింత హలాదేశము వచ్చునను టకు 'పఱ్ఱెణ్ణు, ఎనుబఱ్ఱు' ఇత్యాదిపదములఁ గూడ నుదా హరణముగాఁ జూచుకోవచ్చును. తెలుఁగున పది పఱ అయి, ఇరండు రెండు అయి సంధి యేర్పడినది. ఆఱవమునఁగూడ పత్తు పఱ అయి ఇరండుతో సంధింపఁగా పన్నిరండు అని రూప మేర్పడినది. తెలుఁగున పఱ + రెండులో నడుమ వింత హల్లు వచ్చి, అది డగా మాఱి, 'న' 'ణ' అయి 'పఱ్ఱెణ్ణు' అను రూప మేర్పడినది. కాని 'పన్నెన్టు' అను రూపము తెలుఁగున నెన్నఁడు నున్నట్లు కానరాదు. వాణ్ణు (ణ్డ్ఱు), పఱ్ఱెణ్ణు (ణ్డ్ఱె) అను పదములలోని రెండవ సంయుక్తాక్షరములలో రెండవ యక్షరము డకారము, డకారపుఁ బూర్వరూప మగు వింతహల్లు కాఁదగునే కాని బండిఱ ఎన్నఁటికిని గానేరదు. ఏలనగా మూఁడుహల్లుల సంయోగములో రెండు బండిఱ లుండవు. అట్టి యుచ్చార ముండదు.

సరికాని, యింతవఱకును జెప్పిన పద్ధతియ చొప్పున రాముణ్డు-రామఁడు, కొణ్డ్డు—కొండఁడు ఇయ్యది రూప ములు సిద్ధించును గాని రాముణ్డు-రాముఁడు, పుత్తుణ్డు-పుతుఁడు, చందురుణ్డు ఇత్యాదివిధముల రామ, పుత్త, చందురేత్యాది ప్రాతిపదికముల తుదియకారమునకు ఉకా రాదేశము కలదుగదా, ఇది యెట్లు సమర్థిత మగును? అను ప్రశ్న మున్నది. దీని కిట్లు బదులు:

సంస్కృతభాషలో అకారము రెండుదెఱఁగులు గలది. 'అ అ' అనుసూత్రమున పాణిన్యాచార్యులు సంవృతము వివృతము అని అకారము రెండువిధము లనియు, ప్రక్రియాదశలోని అకారము వివృత మనియు, ప్రయోగదశలోని అకారము సంవృత మనియుఁ జెప్పిరి. తెఱపినోటితో నుచ్చరించిన అకారము వివృతము. ఆంధ్రద్రవిడకర్ణాట దేశములందు అకారము ప్రయోగదశలోఁగూడ నిట్లు తెఱపినోటితో వివృతముగానే ఉచ్చరింపఁబడుచున్నది. ఈ యుచ్చార మపాణినీయము. ఆంధ్రద్రవిడకర్ణాటభాషల సంపర్దాయము సంస్కృతప్రాకృతభాషలసంప్రదాయమునకంటె వేరయిన దనుట కిదియు నొక సాధనము. ఓఢ్రదేశము మొదలగు నుత్తరదేశములందు హ్రస్వాకారము సంవృతముగానే ఉచ్చరింపఁబడును. వారు నోరిని గొంత ముడిచియే అకారోచ్చారము జరుపుదురు. ఆ సంవృతోచ్చారము మనకు ఉకారమునకు, ఒకారమునకు నడిమిదిగా వినవచ్చుచుండును.

సంస్కృతప్రాకృతసమములు, తద్భవములు నగు పదముల తుదిహ్రస్వాకారము ఋష్యాకులు మొదలగు నౌత్తరాహారాజుల శాస్త్రీయసంవృతోచ్చారణరీతి ననుకరించుటలోఁ దెలుఁగున కా రీతి యపరిచిత మగుటచే ఉత్వముగా మార్పు చెందినది. ఈకారణముచేతనే విభక్తి 'ండు'కు పూర్వమున నున్న అకారమునకు ఉకారాదేశము వచ్చుట పార్శ్వికముగా సంస్కృతప్రాకృతసమభవ శబ్ద

ములకే కానవచ్చుచున్నది. దేశితెలుఁగుశబ్దముల కట్టు లేదు. కొండఁడు, తిక్కఁడు, మారఁడు, రేచఁడు ఇత్యాది శబ్దముల కుత్వము రాలేదు గదా? ఇవి ద్రావిడభాషా కుటుంబసంప్రదాయోచ్చారము గల శబ్దము లగుటచే వీనికి సంవృతోచ్చారము లేదయ్యెను. ఉకారాదేశము రాదయ్యెను.

ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణము

—

చదలువాడ యెఱ్ఱాప్రగ్గడ భారతారణ్యపర్వశేష మును, రామాయణమును, నృసింహపురాణమును, హరి వంశమును రచియించెను. హరివంశమున నిట్లున్నది:

శా. "నాతమ్ముండు ఘనుండు మల్లరథినీనాథుండు ని న్నాతత
శ్రీతోడన్ సముపేతుఁజేసి యొలమిన్ జేపట్టి మా కిచ్చుటన్
జేతోమోద మెలర్ప రామకథ మున్ జెప్పించి యత్యుత్తమ
ఖ్యాతిం జెందితి నింకనుం దనియ నేఁ గావ్యామృతాస్వాదనన్."

దీనిఁబట్టి రామాయణము హరివంశమునకుఁ బూర్వ కృతి యనియు, నది ప్రోలయ వేమారెడ్డిగారి ప్రేరణమునఁ రచితమయ్యె ననియుఁ దెలియనగును.

"వల్మీకభవు వచోవై ఖరి రామాయణంబు నాంధ్రీప్రబంధంబుఁజేసె"

నని యెఱ్ఱాప్రెగ్గడవంశమువాఁ డిటీవలివాఁడు చదలు వాఁడ మల్లయకవి చెప్పినాఁడు. దీనిబట్టి యా రామా యణము సంగ్రహరూప మయినదిగాక సకలవర్ణనాపూర్ణ మయిన, సంస్కృతరామాయణానుసారియయిన ప్రశస్త ప్రబంధముగాఁ దెలియనగును.

ఇట్టి యెఱ్ఱాప్రెగ్గడరామాయణ మిప్పుడు గాన రాదు. లక్షణగ్రంథములలో నెఱ్ఱాప్రెగ్గడరామాయణ పద్య ములు పెక్కు లుదాహృతము లయియున్నవి.

౨

కూచిమంచి తిమ్మకవి సర్వలక్షణసారసంగ్రహమున ఎఱ్ఱాప్రెగ్గడరామాయణములోనివని యీ క్రింది పద్యముల నుదాహరించినాఁడు:

ఉ. "అంగముతోడఁ గట్టు మిట యజ్ఞవిఘాతకచోరు నెందు వో
వంగలవాఁడ వింక నిటు వైళమ తాపసవేషధారివై.

ఉ. సందడి యద్వరక్రియ కసంగతమేని బలంబుతోడఁ జెన్
గ్రం దదియేల యేన తగఁ గార్ముకహస్తుఁడనై కడంగి మీ
ముందఱ నిల్చెదన్ గ్రతువు ముట్టకయుండఁ బ్రచండదైత్యరా
జిం దగ దవ్వుదాల వెసఁ జించెదఁ బెంచెద మీకు మోదమున్.

చ. అనుటయు మంత్రిమాటకుఁ బ్రియంపడి యాతని నాదరించి య
మ్మనుజ కులేంద్రుఁడు....

ఉ. నూర్వురు నొక్కచందము మనోగతి సైరణచేసి నన్ను నా
సర్వకులంబు నుత్తమయశంబున నుంచితి రమ్మలార, మీ
కుర్విని సాటి యే యబల లొండొరు దేవతలున్ బటుక్రమా
నిర్వహణం బొనర్చుటకు నేరరు మర్త్యులఁ జెప్పనేటికిన్?

చ. అనఘ యకంపమై విమలమై పరిపూర్తియు లోఁతుఁ దియ్యమున్
ఘనతయుఁ గల్గి సజ్జనమనస్సదృశస్థితిఁ జాల నొప్పు మీ
జినయది యన్నదీజలము జేవును మంచిది....

ఉ. కోటలు నుగ్గునుగ్గయిన క్రూరఫణీంద్రుగతిన్ దరంగముల్
మాటిన భూరివారిధిక్రమంబున రాహుకరాళవక్త్రిమున్
దూటిన తీవ్రభానుకిరియ దుర్బల సైన్యతఁ బుత్రహీనతన్
గీటి పరాభవాభిగతిఁ గీడ్పడి భూపతి నెమ్మనంబునన్.

శా. తాఱుంగ్రాఁగిననేల తంపటలఁ బాతాళంబు దాఁకన్ జనం
దూఱుం జల్మిరి మిన్ను దాఁకి తరఁగల్ తోరంబులై నల్గడల్
పాఱుం బెల్లుగ నేఱు లుబ్బటమునుగాఁ బైపైన నీరెక్కి పై
వాఱన్ జెర్వులు చెన్ను మీఱ నఖిలప్రాణుల్ ముదంబందఁగాన్.

క. నూఱు దెఱంగుల నెఱసులు
మీఱఁగ నీవిభ్రమములు మెఱయించి మునిం
గాఱఁగఁ జేయుము మేనక
చూఱకొనఁ దెయతని తెలివిసొమ్ములు మున్నున్.

మ. చెఱకుందోఁటలఁ బెంచి శాలిమయసుక్షేత్రస్థలుల్ నించి య
క్కఱ లేకుండఁగఁ బూగనాగలతికా కాంతారముల్ ప్రోచి యే
డ్తెఱ నంతం గుముదోత్పలాళివనవాటీకోటిఁ బాటించి పె
ర్నెఱువుల్ వొల్చెఁ బురంబునల్దెసలఁ బ్రస్ఫీతాంబుపూర్ణస్థితిన్."

కూచిమంచి తిమ్మకవి గోదావరిమండలమున పిఠాపురమునకు చేరువను కందరాడ, చంద్రమపాలెము అను గ్రామముల వసించెను. ఈ గ్రంథమును క్రీ. శ. ౧౭౫౦ సంవత్సరప్రాంతమున రచించెను. ఆతఁ డుదాహరించిన యెట్లాప్రెగ్గడరామాయణపద్యములు ఇతర లక్షణగ్రంథములనుండి సేకరింపఁబడినవి కావు. అతఁడు స్వయము గ్రంథమును బరిశీలించి యుద్ధరించినవే. ఇన్ని పద్యముల నితరలాక్షణికు లెవరు నుదాహరింపలేదు. ఇప్పటికి సుమారు ౧౯౦ ఏండ్లనాఁడు గోదావరిమండలమున, కూచిమంచి తిమ్మకవియింట ఎట్లాప్రెగ్గడరామాయణము సురక్షితమై యుండెనని దీనివలనఁ దెలియఁగలదు.

చదలువాడ యెఱ్ఱాప్రెగ్గడరచనముగా నీ కవిస్తుతి పద్య మొక ప్రాచీనపద్యసంకలనమునఁ గానవచ్చినది.

శా. "సారోదార సమంచిత స్ఫుర దురు స్ఫాయల్లసల్లాలిత
(స్ఫారంబుల్ వె?)సఁ ద్రిప్పి పెట్టుచును శబ్దద్రవ్యహీనుల్ సదా
తారుం జెప్పితి మంచుఁ జెప్పికొనుటల్ తప్పే నిరాఘాటవా
క్సౌరభ్యప్రతిభావిజృంభితులు మెచ్చర్ గాక యీచందముల్."

ఇది యెఱ్ఱాప్రెగ్గడరామాయణకృత్యవతరణిక లోనిది గావలెను.

ఈ క్రిందిపద్యమును 'ఎఱ్ఱనరామాయణములోనిదా?' అని యెప్పుడో నోటుబుక్కులో వ్రాసికొంటిని. ఎక్కడనుండి యుద్ధరించితినో యిప్పుడు గుర్తింపఁజాలను.

ఉ. "చువ్వన మేను వంచి రవి సోఁకఁగఁ దోఁక విదల్చిపాదముల్
వివ్వఁగఁ బట్టి బాహువులు వీచి మొగంబు బిగించి కొండ జా
జివ్వన నూఁగి ముందటికిఁ జూఁగి పిఱిందికిఁ దూఁగి వార్ధిపై
జివ్వన దాఁటె వాయుజుఁడు ఱెక్కలతోడి సురాద్రియో యనన్."

కూచిమంచి తిమ్మకవిగాక మఱికొందఱు లాక్షణికులును ఎఱ్ఱాప్రెగ్గడరామాయణములోని పద్యములను తమ లక్షణగ్రంథములం దుదాహరించినారు. అట్టివి మఱికొన్ని యీక్రిందివి:

గణపవరపు వేంకటకవి ప్రయోగరత్నాకరము—

"క. ధాత్రీ...సురసేవారతి-భ్రాతృ భృతి గురూక్తిపాలబంధురమతి దు
శ్శాత్రవహరణచణస్థితి-మిత్రానందకర విఖ్యాతి మీయందమరున్.

సీ. బాలసుధాంశునిటాలుని నసుధాలాపముల్ వివలె వనెడు నాస..

క. ఆదశరథసూనుండు ప-యోధిజలం భింకనేసి యొకశరమున ఁగ్ర
వ్యాదవిభుఁ దునిమి సీతను-మోదంబునఁ జేకొని కపిపుంగవుతోడన్."
(ఎట్టాప్రెగ్గడ సంక్షేపరామాయణము)

గణపవరపువేంకటకవి ఎట్టాప్రెగ్గడసంక్షేపరామాయణములోనివిగా నుదాహరించినపద్యములు పరిశ్తరచనము కలవి కావు. అతఁడు ప్రబంధరత్నాకరమున కొన్ని లక్షణములను గల్పించి వానికి లక్ష్యపద్యములను ప్రసిద్ధకవులగ్రంథములలోనివిగాఁ గొన్నింటిఁ గల్పించి యుదాహరించినట్లున్నాఁడు. ఈతఁ డుదాహరించిన ఎట్టాప్రెగ్గడరామాయణపద్యములు కల్పితము లైనను గావచ్చును; లేక, ఎట్టాప్రెగ్గడరామాయణములో గ్రంథారంభభాగ మగుసంక్షేపరామాయణములోని వయినను కావచ్చును. అంతేకాని ఎట్టాప్రెగ్గడ సంక్షేపరామాయణమని వేఱొకగ్రంథమును రచియించియుండఁ డనుకొందును. ఎట్టాప్రెగ్గడ తనతండ్రి సంస్కృతాంధ్రకవితావిశారదుఁడు సూర్య సుకవి యని తనగ్రంథములఁ జెప్పికొన్నాఁడు. సూర్యకవికృతము సంస్కృతమున సంక్షేపరామాయణ మొకటి యముద్రితము కలదు. ఆ సూర్య సుకవి మన యెట్టాప్రెగ్గడతండ్రి యగునేమో! ఆ సంస్కృత సంక్షేపరామాయణమునకు, ఎట్టాప్రెగ్గడరామాయణమునకు సంబంధ మేమైనఁ గలదేమో-ఎట్టాప్రెగ్గడరామాయణము దొరకినప్పుడు తెలియవలెను.

3

ఇప్పుడు సముద్రితమై వెలసియున్న భాస్కర రామాయణమునఁగూడ ఎఱ్ఱాప్రెగ్గడరామాయణపద్యము లనేకములు చేరియున్నట్లు తెలియవచ్చుచున్నది. పెక్కేండ్లకు పూర్వము మదరాసు ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారమున తెలుఁగుగ్రంథములకు డిస్క్రిప్టివ్ క్యాటలాగు (Descriptive Catalogue) వాయునపుడు భాస్కరరామాయణమును సామాన్యదృష్టిని పరిశీలింపఁగా పాఠభేదములు, గ్రంథ భేదములు చాలఁగాఁ గానవచ్చినవి. ఆ విషయ మప్పు డందు వెల్లడించితిని. ఆనందముద్రణాలయముయజమాని భాస్కరరామాయణముద్రణముకొఱకు వారియొద్ద పండితులుగా నుండిన కీ. శే. తంజనగరం తేవప్పెరుమాళ్లయ్య గారు ఆరణ్యకాండమున రెండు భిన్నరచనము లుండుటను గూర్చి కొంత నాతోఁ జర్చించిరి. భాస్కరరామాయణము నందలియారణ్యకాండమున ప్రధానపాఠముగా గ్రహింపఁబడిన పద్యము లనేకములు ఏ తాళపత్రప్రతిలోను గానరాకుండెను. పాఠాంతరములుగా పుటల యడుగున చిన్న టైపుతో ముద్రింపబడినపాఠములే తాళపత్రప్రతులలోనున్నవి. తొలుదొలుత భాస్కరరామాయణమును ముద్రించినవారు కరాలపాటి రంగయ్యగారో, నిశ్చింత తేవప్పెరుమాళ్లయ్యగారో యని మే మప్పుడు గుర్తించితిమి. వా రేప్రతులను చూచి అట్లు ముద్రించిరో యెఱుఁగ రాదు. కరాలపాటిరంగయ్యగారు గొప్పకవి. ఆయన

కొన్ని ప్రౌఢగ్రంథములను రచించెను. ఆరణ్యకాండమున పరిధానపాఠముగా గ్రహించినపద్యముల నాతఁడు రచించి చేర్చెనేమో యనికూడ మే మప్పు డనుకొంటిమి–తాళ పత్రప్రతులలో నా పద్యములు కానరాలేదు గాన.

ఇటీవల భాస్కరరామాయణమును పరిశీలించు చుండఁగా వావిళ్ళవారిముద్రణమున యుద్ధకాండములోని యీ క్రిందిపద్యము 'ఎఱ్ఱాప్రెగ్గడవారి పద్య మని ప్రసీతి' అను అధోజ్ఞాపికతో కానవచ్చెను.

ఉ. "తెగ్వెడు గంటులం గురువు డేఁబెడు నెత్తురు రాకమున్న యే
నొప్వియు నేవికారము మనోగతిఁ జెందకమున్న సాయకం
బవ్వలఁ బోకమున్న మకుటాగ్రవిఘట్టనరావ మొప్పఁగా
నువ్వున నుప్పతిల్లె నసురోద్వహ మూర్ధచయంబు గ్రిక్కునన్."

అది చూచి వాఁతప్రతులను పరిశీలింతునుగదా ఉదాహృతమైన యీపద్యము ఎఱ్ఱాప్రెగ్గడవారి దని యుండుట మాత్రమే కాక దీని పూర్వపద్యము—

ఉ. "ఉన్నవి యున్నయట్ల తల లుర్వికి డిగ్గె శిరఃప్రవాహముల్
మొన్నొకసారె నిండుఁదెగ మోపినసాయక మల్లె యుండఁజా
గె న్నెటిఁదూపువెల్లియని ఖేచరకోటి నుతించె నంచితో
త్పన్నదశాస్యరాఘవతపఃకరలాఘవచిత్రసంపదల్."

అనుపద్యము 'భాస్కరునివారి' దని కూడఁ గలదు. ఈ పద్యములు పెక్కుప్రతులలోఁ గానరావు. కొని ప్రతుల

లోనే కలవు. ఇవి రాముఁడు రావణునితలలు తెగఁ గొట్టు ప్రకరణమునందలివి. యుద్ధకాండములోని యీ భాగము పెదవేదగిరినాయనింగారి ప్రేరణమున అయ్యలార్యుఁడు పూరించినది. ఈ భాగమున భాస్కరరచనము నేఁడు కానరాదు. భాస్కరుఁడు కడమట్ట యుద్ధకాండము రచించినట్టు ప్రతీతియు లేదు. ఇందు భాస్కరరచనముగ పద్య ముండుటనుబట్టి చూడఁగా భాస్కరుఁడు యుద్ధ కాండమును కడమట్ట రచించెనని యేర్పడుచున్నది. ఇవే కాక, యుద్ధకాండమున మఱికొన్ని పద్యములు కొన్ని ప్రతులలో మాత్రమే యధికముగాఁ గానవచ్చుచున్నవి. దొరకినయుద్ధకాండప్రతులనెల్ల పరిశీలించినయెడల నట్టివి మఱికొన్ని పద్యములుగూడ భాస్కరునివిగనో, ఎఱ్ఱా ప్రెగ్గడవిగనో వేర్పడఁగల వనుకొందును. యుద్ధకాండ విషయ మిట్టుండె.

ఆరణ్యకాండమున ముద్రణములందు ప్రధానపాఠ ముగ గ్రహింపఁబడినగ్రంథభాగములు తాళపత్రప్రతు లలో సాధారణముగా దొరకుచున్నవియు, పాఠాంతర ముగా నధఃకరింపఁబడినవియు నగుగ్రంథభాగములకంఱె బ్రశస్తరచనము కలవి. ఒకవేళ నవియెల్ల ఎఱ్ఱాప్రెగ్గడ రచనమేమో యని యొక పెద్దసందేహము నాకుఁ గలిగెను. ఆ గ్రంథభాగములలో వాల్మీకిరామాయణానుసారులు కానివి కొన్ని రచనములు కలవు.

చ. "తపనుఁడు వేఁపఁజొచ్చె ననుఁదమ్ముఁడ, వృక్షముక్రిందఁబెట్టు; నాఁ
దపనుఁడు రేయి లేఁడు వసుధాపర! చంద్రుఁడుగాని; చంద్రునిన్
నృపసుత! యెె స్లెటింగితివి నీవు; మృగాంక ము చూడనున్కఁ; హా
చపలమృగాక్షి! చందర్రిముఖ! జానకి! యెక్కడ నున్న దానవే"?

"సౌమిత్రే, నను సేవ్యతాం తరుతలం చండాంశు రుజ్జృంభతే
చండాంశో ర్నిశి కాకథా రఘుపతే, చంద్రోఽయ మున్మీలతి,
వ త్సైతద్విదితం కథన్ను భవతా ధత్తే కురంగం యతః
క్వాసి ప్రేయసి, హా కురంగనయనే, చంద్రాననే, జానకి"
(ప్రసన్న రాఘవము)

ఇత్యాదులు.

ఇట్టి యీప్రధానపాఠరచనముకూడ ప్రాచీనకవి కృతమే కావలెను. కాని, యిది భాస్కరరామాయణ మనుపేర లభ్యమగుచున్నగ్రంథములోనిది కాదు— భాస్కరరామాయణతాళపత్రప్రతులలోఁ గానరాదు కాన. ఇట్టి సందేహములతో నేను చీకాకుపడుచుండఁగా డాక్టరు నేలటూరి వెంకటరమణయ్యగారు తమ కానెగొం దిలో నొక భాస్కరరామాయణపుఁదాళపత్రప్రతి దొరకె ననియు, అం దారణ్యకాండమున ఎఱ్ఱాప్రెగ్గడకృతము లుగా కొన్ని పద్యములు గానవచ్చె ననియు తెలిపి ఈ క్రిందిపద్యములను నాకుఁ జూపిరి:

"ఉ. ఆ నెఱజోదు కేలు దొనఁకై నిగుడించుట యమ్ము మౌర్వి సం
ధానము సేఁత నిండఁదెగఁ దార్కొని లక్ష్యము సేయుడేయుడున్
గాన నజస్రమండలితకార్ముక మొక్కటి గంటిఁగంటి న
ద్దానవదీర్ఘ దేహసముదాయనిరంతరపాదవేగముల్.

స్రగ్ధర.

కరిణీయానంబు నవ్వున్ గతి నవలతికాకార మంగంబు చంద్రున్
బురుణించున్ ముద్దుమో మంబురుహాదళములంబోలుఁ గన్నుల్వి
పంచీ స్వరసంకాశంబు పల్కున్ జలదళినిచయస్పర్థియెయుండు
వేణీభర మాతన్వంగి కిందస్పరిముఖ నిఖలదిక్పాల కాభీలశౌర్యా.

చ. అలినిభవేణి చందస్సదృశానన యుత్పలపత్రనేత్ర కో
మలలతికాభిరామభుజ మంజులవృత్తలసత్కుచద్వయీ
కలితసుమధ్య హృద్యకటి కామ్యతకోరువు రమ్యజంఘ యు
జ్వలచరణాబ్జ తద్వనిత జానకినా విలసిల్లు రావణా."

వా రిందుకై మదరాసులోని యితరతాళపత్రప్ర తుల నెల్లఁ బరిశీలించిరట! ఆ విషయము నిట్లు చీటిలో వ్రాసి పంపిరి :

"ఈ పద్యాలు నేను ఆనెగొందినుంచి తెచ్చిన పత్రితిలోనివి. అందు 'ఎట్లాపర్గడ పద్యాలు' అను శీర్షికతో గూడియున్నవి. ఇది గాక అడయారు లైబ్రరి G. No. XXXII T. 13 G. 'యెరపర్గడ వారి పద్యం' (తాళ. ప ర్‌ఆ ఏం. ౧) అనుమాటకు తరువాత పైమూడుపద్యాలు కలవు. ఇంకను మదాసు యూనివర్సిటీ కలెక్షన్ (ఎట్లాపర్గడ పేరులేకున్నను) $\frac{౧}{౧౫౦}$ నంబరు పత్రితియందు మూడుపద్యములును గానవచ్చుచున్నవి. అట్లే $\frac{౧}{౪౨౬}$ లో కూడా పద్యాలు పేరులేకుండా కాన్పించుచున్నవి. G. Or. Mss. Madras. 14-10-7 దీనిలో 'ఎట్లాపర్గడ పద్యాలు' అన్నమాటలేదు కాని ఆ పద్యాలలో "కరిణీయానంబు", "అలినిభ వేణి" అన్న పద్యాలు కాన్పించుచున్నవి."

ఈ మూఁడుపద్యములతోపాటు తక్కిన ఆరణ్య కాండరచనాభేదము లెల్లఁగూడ ఎఱ్ఱాప్రెగ్గడ రచన ములు కావచ్చునేమో యనికూడ నే ననుమానించు చున్నాను.

అయోధ్యాకాండమునఁగూడ రచనాభేదములు చాలఁగాఁ గలవు. అందుఁగూడఁ గొన్ని యెఱ్ఱాప్రెగ్గడ పద్యము లుండునేమో! ఇట్లు భాస్కరరామాయణగ్రంథ భాగము లెన్నోచిక్కులతో నున్నవి. అవి యెల్ల జాగ్రత్తగాఁ బరిశీలించి యిదమిత్థమని నిర్ణయింపవలసియున్నది. భాస్కరరామాయణమున ఎఱ్ఱాప్రెగ్గడ రచనములు గొన్ని చేరియుండుట తథ్యము.

౪

ఆ నడుమ నేను ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోని యొక సంకీర్ణపద్యముల తాళపత్ర సంపుటమును పరిశీలించు చుండఁగా అందు రామాయణయుద్ధకాండమున పద్యములు ముప్పది కానవచ్చినవి. చదువఁగా నవి ప్రసిద్ధములైన భాస్కరరామాయణాది గ్రథములలోనివిగా తోఁచ లేదు. భాస్కరరామాయణమును, భారతారణ్యపర్వాంతర్గతరామాయణమును, భాగవతాంతర్గతరామాయణమును, మొల్లరామాయణమును, రామాభ్యుదయమును, ఘనగిరిరామకవి సకలవర్ణనాపూర్ణరామాయణమును పరిశీలించి చూచితిని. ఆ కానవచ్చిన ముప్పది పద్యములు నందెందును గానరాలేదు. ఆ పద్యములుగూడ ఎఱ్ఱాప్రెగ్గడ

రామాయణములోనివి కావచ్చుననుకొనుచున్నాను. వానిలో-

మ. "నిను సేవించినఁ గల్గు మానవులకున్ వీటీవధూటీఘటీ
ఘనకోటీశకటీకటీతటీపటీ గంధేభవాటీపటీ
రనటీహారిపటీ సువర్ణమకుటీ పర్యంకటీకాపేటికల్
కనదామ్నాయమహాతురంగ శివలింగా నీలకంఠేశ్వరా!"

ఈ అ-వ పద్యము నీలకంఠేశ్వరస్తుతిరూప మయినది. ఇది వేఱొకగ్రథంములోనిది యయినను గావచ్చును. కాని, యీ సంకీర్ణపద్యసంపుటమున నుదాహృతరామాయణ పద్యములతో నున్నది కాన రామాయణములోనిదియే కావచ్చు ననుట సంగత మగును. ఎఱ్ఱాప్రెగ్గడ నెల్లూరుమండలమందలి గుడ్లూరి నీలకంఠేశ్వర స్వామిభక్తుఁడు. ప్రోలయ వేమారెడ్డిగారి ప్రేరణమున నాతఁడు రామాయణము నా నీలకంఠేశ్వరస్వామి కంకితముగా రచించెనేమో! ఈ పద్యము గుడ్లూరి నీలకంఠస్వామి స్తుతిసందర్భములోనిది గావచ్చును!

ఆ పద్యములలో ఎఱ్ఱాప్రెగ్గడ రచనాగౌరవము కానవచ్చుచున్నదా యని సందేహము తోఁచును. పద్యము లన్నియు సలక్షణములై యున్నవి. గొప్ప రచనాప్రౌఢిమ కానరాకున్న దనవచ్చును కాని యెట్టాప్రెగ్గడ తొలుతటి కూర్పుకాన యిందు రచనమునఁ గొంత వెన్నాటు గలదేమో!

శ్రీనాథుఁడు 'పరిధవింతుఁ బ్రబంధపరమేశ్వరునితేవ
సూక్తివై చిత్రి నొక్కొక్కమాటు' అని తన యెఱ్ఱాప్రెగ్గడ
రచనానుకరణాభిమానమును వెల్ల డించుకొన్నాఁడు. ఈ క్రింది
పద్యద్వయమున ఎఱ్ఱాప్రెగ్గడ సూక్తివైచిత్రియు, శ్రీనాథుని
తదనుకరణమును గాననగును:

ఉ. "కందక గాజువాఱక మొగంబు వికాసమునొందఁ జేతు లీ
యందములైన కాళ్లు నరుణాంబురుహాంబులలీలఁ గాంతిఁ జె
న్నొందెడు జీవహీను లిటు లుండరు ప్రాణముతోడనున్నవా
డిందు సహోదరుండు ధరణీశ్వర నీకు విషాద మేటికిఁ?"

ఉ. "కందక గాజువాఱక వికాసము డిందక మందహాసని
ష్యందము చెక్కుటద్దముల నాఱక నెమ్మది నిద్రవోవున
ట్లందమునొందె ధాత్రి సిరియాలకుమారకువక్త్రి చంద్రుఁ డా
నందము నొందె నప్పు డెలనాఁగమనంబును భర్తచిత్తముఁ."

(శ్రీనాథుని హరవిలాసము)

ఎఱ్ఱాప్రెగ్గడ 'సూక్తివై చిత్రి' శ్రీనాథుని సమకాలపుఁ
బ్రసిద్ధకవి జక్కనకూడ—

"ఈతనియిఁ దాఁ బ్రబంధపరమేశ్వరుఁ డై విరచించె శబ్దవై
చిత్రి నరణ్యపర్వమున శేషము....."

అని ప్రశంసించెను.

సంస్కృత వాల్మీకిరామాయణమునకును, ప్రాచీ
నాంధ్రరచనములగు రంగనాథభాస్కరరామాయణముల

కును జాల భేదములు గలవు. రంగనాథభాస్కరరామా
యణములుగూడఁ గొన్నికాండములందుఁ బోలికలు
గలిగి, కొన్నికాండములందు లేక యున్నవి. రంగనాథ
రామాయణమున విశిష్టాద్వైతవిషయములు గొన్ని యధి
కముగాఁజేరినవి. కొన్ని కథాభేదము లున్నవి; అధికకథ
లున్నవి. అందుఁ గొన్నిటికి సంస్కృతమూలము గాన
రాదు. దేశికథాసంప్రదాయముల ననుసరించి వానిని కవి
చేర్చియుండవచ్చును. ఎఱ్ఱాప్రెగ్గడరామాయణాంధ్రీకర
ణము హరివంశాంధ్రీకరణమును బోలియుండు నసఁదగును.
ఇప్పు డుపలబ్ధము లయిన పద్యములు సంస్కృతానుసారు
లుగా నున్నవి. ఆయాపద్యములపట్టులను సంస్కృత
వాల్మీకిరచనలతోను, తెలుఁగు రంగనాథ భాస్కర
రామాయణ రచనాభాగములతోను బోల్చి చూచిన నీ
యెఱ్ఱాప్రెగ్గడపద్యములు సరిగా సంస్కృతానుసారులుగా
నుండుట వ్యక్తమగును.

రంగనాథ భాస్కరరామాయణములు ఎఱ్ఱాప్రెగ్గడ
రచనముసకంబుఁ బూర్వము వెలసిన వనఁదగినవి. ఎఱ్ఱా
ప్రెగ్గడ కించుకతర్వాతికాలమువాఁడగును భాస్కర
రామాయణయుద్ధకాండశేషమును బూర్తి చేసిన అయ్యలా
ర్యుఁడు. ఇంచుమించుగ నాతని కాలమునసే తెలుఁగున
మఱొక రామాయణాంధ్రీకరణము వెలసినది.

క. రామాయణకృతి కృతియై-తా మెఱయుచు నాంధ్రకవిపితామహుఁ
డనఁగా
భూమిం బినభీమన యను-నామంబున వెలసె సత్యనారనఘునుఁడై.
(సింహాసనద్వాత్రింశిక)

'పిన భీమన', యని 'ఆంధ్రకవిపితామహుఁ' డని పేరందిన, రామాయణకృతికర్తయైన యీ సత్యనారన అనపోతకుమారసింగభూపతి (వెలుగోటి వెలమరాజు) కాలమువాఁడు. అయ్యలార్యున కీతఁ డించుమించుగా సమకాలమువాఁ డగును. ఈ రామాయణముగూడ నిపుడు గానరాదు. ప్రాచీన లక్షణగ్రంథకారులుగాని, యితరప్రాచీనకవులుగాని యీ సత్యనారనను స్మరించినట్లు గాన రాదు.

ఎఱ్ఱాప్రెగ్గడరామాయణము ఎఱ్ఱాప్రెగ్గడనాఁటి నుండి కూచిమంచి తిమ్మకవినాఁటిదాఁక సుప్రచారము గలదిగాఁ దెలియవచ్చుచున్నది. నూటయెనుబదియేండ్ల క్రిందటిదాఁక సురక్షితమై యున్న యీ గ్రంథ మీనాఁడు గూడ నెక్కడనేని అపరిజ్ఞాతముగా నుండవచ్చును. గోదావరీమండలమున కందరాడ, చంద్రమపాలెముల (కూచిమంచి తిమ్మకవి యూళ్లు) చుట్టుపట్టులఁగాని, కృష్ణా గుంటూరు నెల్లూరు కడప కర్నూలు మండలములలోఁగాని అది దొరకఁదగు ననుకొందును. నెల్లూరు కర్నూలు కడప మండలములలో ప్రాచీనగ్రంథపరిశీలన మింకను సరిగా జరుగవలసియున్నది. ఆయా చోట్ల నపరిచితముగా నున్న

తాటియాకుకట్టలను పరిశీలించి యెఱ్ఱాప్రెగ్గడరామాయ
ణము నే పుణ్యాత్ముఁడేని యుద్ధరింపఁగల్గునని విశ్వసించు
చున్నాను. ఎఱ్ఱాప్రెగ్గడ నృసింహపురాణము తప్పులతో
నొక్క ప్రతిమాత్రమే ప్రాచ్యలిఖితపుస్తకశాలలోఁ గలదు.
దానికిని మంచి ప్రత్యంతరము కావలెను. ఆంధ్రవిశ్వవిద్యా
లయోపాధ్యక్షులగు శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు
ఎఱ్ఱాప్రెగ్గడరామాయణమును సంపాదింపఁ గల్గితిమేని యది
మన కొక భాగ్యవిశేష మనియు, దాని నార్జింపఁగలవారి
కెంత సాహాయ్యమేని చేయ నుత్సహింతు మనియు ఆ నడుమ
రాజమహేంద్రవరమున జరిగిన రెడ్డిసామ్రాజ్యవర్ధం
త్యుత్సవమునఁ జెప్పిరి. శ్రీ రామలింగారెడ్డిగారిపవిత్రాశ
యము సఫలమగుట కపేక్షించుచున్నాను.

౧౪

కవితాపారమ్యము

శ్రీ వేంకటపార్వతీశ్వరకవుల 'యేకాంతసేవ'ను, దాని యనుకార్య మగు 'గీతాంజలి'ని బురస్కరించుకొని 'కవితాపారమ్య' మనువిషయమునుగూర్చి నేను తల పోయుచుండువిషయముల నిక్కడ నించుక ప్రస్తావింతును.

శ్రీ వేంకటపార్వతీశ్వరకవులు రచియించిన యేకాంతసేవాకావ్యము రవీంద్రనాథటాగూరుగారి 'గీతాంజలి' చ్ఛాయగలదిగా విఖ్యాతి గాంచినది. 'గీతాంజలి'యు, 'నేకాంతసేవ'యు వ్యంగ్యప్రధానకావ్యము లనియు, అవాఙ్మనసగోచరమైన యీశ్వరతత్వమునుగూర్చి యన్వేషము జరుపువారి నవి యొకానొక యవ్యక్తానుభూతికిఁ దార్ఢ్యంగలిగి యున్న వనియు వాకొనుట సహృదయులకు ననుభవపునరుక్తి.

వ్యంగ్యప్రధాన మైనకావ్య ముత్తమకావ్య మని యాలంకారికుల నిశ్చితసిద్ధాంతము. విరిసినపూవు సువాసనను, పుప్పొడిని, మకరందబిందువులను తన నెలవునకుఁ బెట్టుకొని యివి యింతవరకే యని గీటుగీయ నలవికానంత వింతగా చుట్టుపట్టుల కెంతదాఁకనో ప్రసరింపఁజేసి వేడుక గొల్పినట్లు, వ్యంగ్యవైభవముగూడ నిది యింతే యని గ్రుద్ది హద్దుగీటు గీయరానంతవింతగా వాచ్యలక్ష్యముల

కంఠె మించిన యర్థవిశేషముల నెన్నింటిసేని జలజల రాల్చుచు నానందము గొల్పును. వ్యంగ్యవైభవము వాచ్యాతిశాయిగనుక వాచ్యమున నిర్వహింపఁదగనివియుఁ, దరము గానివియు నగునర్థముల ననుమితపఱచు నద్దె సామాజికులను విశాలయోచనమునకుఁ బార్చును. అనిర్వచనీయానందమునకుఁ దార్చును.

లోకానుభూయమానములగు సామాన్యవిషయముల లోనే వ్యంగ్యవైభవ మింతచమత్కారజనక మగు ననఁగా, నిఁక నవాఙ్మనసగోచరము, సర్వజగద్వ్యాపారమూలాధారము నగు నీశ్వరతత్వమును నిర్వచించుటకో, నిరూపించుటకో పూనినపుడు దాని చిద్విలాస మిఁక నెంతేని వింత గొల్పునదై యుండి తీఱును గదా. క్రాంతదర్శియైన సుకవి తనలో దృశ్యాదృశ్యముగా వెలుఁగులు గొలుపుచున్న తత్త్వమును వ్యక్తావ్యక్తవాక్కులతో వ్యంగ్యమర్యాదతోనే సామాజికులకు పరిస్ఫురింపఁజేయవలసినవాఁ డగును. ఉత్తమ గాయకుఁడుగూడ నొక్కొకపు డంతరంగమున గానామృతము పొర్లువాఱుచుండఁగా నుచ్చస్థాయికిఁ బోయిపోయి కంఠశక్తి వెనుబడఁగా శిరఃకంపహస్తచాలనభ్రూభంగాదులచే గేయావశేషము నవగతపఱుచువాఁ డగును.

కవి తనలో నెక్కడో యనభివ్యక్తముగా నెప్పుడో గోచరించినపరతత్త్వము నాలంబముగాఁ గొని దాని యనుభూతివాసనచొప్పునఁ దన నేర్పుకొలఁది భాషతో నొక ప్రతి

కృతిని గల్పించి, సామాజికులకు దానిని ప్రదర్శించి పరమా
ర్థానందచ్ఛాయ ననుభవింపఁజేయును. కవీశ్వరునట్లు
సామాన్యజనుఁ డట్లు దాని దర్శింపనేని, ప్రదర్శింపనేని
చాలఁడు. అట్లే చిత్రకారుఁడును తన కెక్కడో - లోపలనో
వెలుపలనో గోచరించినదృశ్యమును దేశకాలాంతరములందు
తన భావవాసనాసంస్కారమువలనఁ గొనివచ్చి తన నేర్పున
కనుగుణముగా వన్నెచిన్నెలతో రూపు గల్పించి చూపి
సామాజికుల నానందపఱచును.

ప్రకృతిపుష్పము వెలార్చుసౌందర్యసౌరభ్యాదులు
చిత్రపుష్పమున లేవు. అయినను సామాన్యమానవు లీ చిత్ర
కారుని పుష్పము నధికానందముతో నాలోకింతురు. ప్రతికృతి
కంటె సాక్షాత్సత్యవస్తు వధికహృద్యము కావలయుట విస్పష్ట
విషయమే కాన, చిత్రపుష్పముకంటె మూలపుష్ప మధిక
హృద్యమే కావలెనుగదా? అయినను మూలపుష్పమున
నెప్పుడో యెక్కడో కొంతసేపే దృశ్య మగుట, దాని రచ
యితయు, రచనాప్రణాళియు నదృశ్యము లగుట యన్న
కొఱత లుండుటవలనను, చిత్రపుష్పమున సదా సర్వత్ర
దృశ్య మగుట, చిత్రకారుఁడును దద్రచనాప్రణాళియు
ప్రత్యక్ష మగుట యన్నగుణము లుండుటవలనను; అంతే
కాక, మానవత ప్రాయికముగా మాయాజ్ఞానావృతమై
సత్యానుభూతికిదూరమై తానే సత్యప్రతిబింబభూతమై
యుండుటవలనను, సులభమగు సత్యప్రతికృతికే మానవ
ప్రకృతి ముచ్చటపడును.

సామాజికాభిరంజనమునకై కవియు తాను కల్పించిన సత్యప్రతికృతికి వస్త్వలంకారశిల్పము, భాషాపరివేషము, శయ్యావైయాత్యము, ఛందస్సందర్భము పొసగించి స్వార స్యాతిశయము సంపాదింపఁజూచును.

సృష్టివ్యాపారకార్యమును స్పష్టముగా, సర్వదృశ్య ముగా సాగించుచుఁగూడఁ దత్కర్త యీశ్వరుఁడు తన్ను దాచుకొని తన కార్యములచేతనే తన్ననుమానిపించు చున్నట్లు ఉత్తమకవియు సత్యప్రతికృతియగు తన కవితా కల్పనలోఁ దత్పరమార్థమును గర్భితపఱచి వ్యంగ్యగోచ రము గావించును. కల్పితకవితలో నేదో పరమార్థ మంత ర్లీనమై వ్యక్తముగా ధ్వన్యర్థవేద్యము కాలేకపోయి నచో నట్టి కవి వట్టి యబద్ధాలకోరుగానే గర్హ్యాతుఁ డగును.

అనఁగా, కవిత యొకవిధముగా నసత్యకల్పనమే యైనను, కవితలో ననభివ్యక్తముగా సత్యానందము వ్యంజనావృత్తిగోచరమై సందర్భిత మయియుండఁబట్టియే యది హృద్య మగుచున్న దన్నమాట.

ఈశ్వరతత్త్వము అవాఙ్మనసగోచర మగుట తథ్యము. అట్లయ్యు దాని నాకళించుటకై లోక మెల్ల నటతటపడుచు ముందు కడుగువేయుచున్న దనుటయుఁ దథ్యము. అది యనివార్య మగుటయుఁ దథ్యము. మానవయత్నము లెల్ల సత్యార్థములు, జ్ఞానార్థములుఁ, నానందార్థములు నగుటను బట్టియు, నీశ్వరుఁడు నిరతిశయసత్యజ్ఞానానందాత్మఁకుఁ

డగుటను బట్టియు నిది యిట్లే యనవలెను. ఉపనిషత్తు "అసతో మా స ద్గమయ, తమసో మా జ్యోతి ర్గమయ, మృత్యో ర్మామృతం గమయ" అని భగవత్ప్రాప్తిని ప్రతిపాదించుచున్నది.

కాఁగా, ఎటిఁగియో, యెఱుఁగకయో యెటుపోయి నను ఘట్టకుటీప్రభాతన్యాయమున సర్వమానవగతియు, అంతే యేమి-సర్వప్రాణిగతియు నీశ్వరాభిముఖమే యగు చున్నది. కాన ఈశ్వరప్రాప్తి ప్రాణికోటి కెల్ల నని వార్య మేకదా!

సదసత్తులతో, జ్ఞానాజ్ఞానములతో, ఆనందదుఃఖము లతో, అపాయతన్నివృత్తులతో కలగలు పయి గజిబిజిగా నున్నప్రపంచవ్యత్తిలో తా ముపద్రష్టలై లోకసామాన్య మున కీ యీశ్వరప్రాప్తియత్నమున తాత్త్వికులు, శాస్త్ర కారులు, చిత్రకారులు, కవులు పురోగాములై యుందురు.

తాత్త్వికులు, శాస్త్రకారులు ఘోరదీక్షతో నంత రంగసముద్రమును మథించియు, బాహ్యమాయావరణారణ్య మును జీల్చికొని బాటలు త్రొక్కియు గుర్తించి తెచ్చిన దివ్యవిజ్ఞానపదార్థములను పరికరములుగాఁ గొనియే వారివెనుక నడచువాఁ డగుకవీశ్వరుఁడు వానిలో మే లేర్చి వారు గుర్తించిన మార్గములలోనే చలువపండిళులను, రసామృత ప్రపలను గల్పించుచు, నింకను వెనుక నడచు మానవ

సామాన్యమునకు వేడ్కఁగొల్పుచు వారి పయనము సుఖమయము గావించును.

తాత్త్వికునిలోఁ బరమార్థసాక్షాత్కార ముండును కవిలోఁ దదనుసారిగా ప్రసన్నమధురాంశచ్ఛాయాకల్పనము లుండును.

తాత్త్వికునిలో కవితాంశములును, కవిలో తాత్త్వికతాంశములునుగూడ ననుగతములై యుండవచ్చును.

తాత్త్వికుల తత్త్వజ్ఞానము పెరుగఁగా పెరుగఁగా తన్మూలమున కవితలో తాత్త్వికతాంశములు పెరుగఁగా పెరుగఁగా సంఘమున తాత్త్వికతాశుద్ధి పెచ్చుపెరుగును. అప్పుడు కవిత తేటదేరి క్రమపరిణామముతోఁ బరమార్థపరాయణ మగును. కృత్రిమకవితావిడంబనముల కపుడు తావుండదు. కవి కపుడు సత్యపరీతికృతికల్పన మనావశ్యకమగును. సౌందర్యసముచితమయిన యా పరమార్థమే, అనఁగా సత్యమే యప్పుడు వాఙ్మయాకృతిఁ దాల్చును. పదునాఱువన్నెబంగారమును మించినమేనిసొరు గల శుద్ధసాత్త్వికతేజోవిరాజితునకు బంగారపుటలంకారములతోఁ బనియేమి?

శాస్త్రికారుల శారీరకపదార్థవిజ్ఞానరసాయనాది శాస్త్రిప్రజ్ఞాతిశయమున గులాబిపువ్వును సువాసనతో, సౌకుమార్యముతో, పూవుదేనెతో, పుప్పొడితో సర్వసుల

భముగా శాస్త్రప్రక్రియచొప్పునఁ గల్పింపఁగల్గినపుడు గులాబిచిత్రికల్పనప్రయోజనము సమసిపోవును. శాస్త్రజ్ఞులు శబ్దస్పర్శరూపరసగంధములను జ్ఞానేంద్రియ వ్యాపారములతో నిప్పటికి శబ్దరూపములను సర్వత్ర సర్వదా సులభములు చేయఁగల్గినట్లు తక్కిన మూడింటినిగూడి చేయఁగలవచ్చును. అనఁగా మదరాసురేడియోలో పాడఁగా నపుడే గ్రామఫోనులో నెక్కించిన పాట, యెక్కడఁబట్టిన నక్కడ, ఎప్పుడు పట్టిన నప్పుడు వినఁదగినట్లు, చెన్నపురిలోనే రేడియోస్థానమునఁ బెట్టిన భక్ష్యభోజ్యముల చవియు, పూల వాసనయు, వస్తువుల స్పర్శయు సదా సర్వత్ర యాస్వాదింపఁదగినది, యాఘ్రాణింపఁ దగినది, స్పృశింపఁదగినది కావచ్చును గదా!

ఇట్టివి జరిగినచో ఇఁక ననుకరణములయ్యు. ప్రతికృతికల్పనములయ్యు. కవితాకల్పనములయ్యు ప్రయోజన మేముండును? సత్యజగదా నందమే కాని కవికల్పితజగదానందమప్పు డక్కఱలేక పోవును. కవి యప్పుడు దన కనుకార్యఁడగు నీశ్వరునికిఁ దాను బ్రతిబింబతను గాక తాదాత్మ్యమునే పొందును. ఇట్లు మానవతలో నీశ్వరతాదాత్మ్యము గోచరింపను గోచరింపను వాఙ్మయముకూడ నక్కృత్రిమమయి తాత్త్విక మగును. తాత్త్వికులయ్యు, సాత్త్వికులయ్యు దివ్యవిజ్ఞానము లిందుకు తార్కాణము. "తత్త్వ మసి" యిందుకు ప్రమాణము.

౧౫
ఆంధ్రలిపిసంస్కారము

నేఁడు వాడుకలో నున్నమనతెనుఁగులిపి మనకు మిక్కిలిచిక్కులు గలిగించునదిగా నున్నది. పసిబాలురకు లిపినేర్పుటలో క్లేశము గలదు. గ్రంథముల నచ్చొత్తించుటలో క్లేశము గలదు. టైపురైటింగునిర్మాణమున కసౌకర్యము గలదు. అంతేకాక వరోచ్చారణరీతికిఁగూడ విరోధము గలదు. ఇవి యెల్లఁ జిన్నచిక్కులు కావు. వీనిని గొంత వివరింతును:

౧. బాలురకునేర్పుటలో క్లేశము:

అచ్చులలో హ్రస్వదీర్ఘములగు అ, ఆ లు ఈషద్భేదముగల సమానలిపులై యుండఁగా ఇ, ఈలు పోలికయే లేనివిగా నున్నవి. అందు ఇ చవర్గాంత్యానునాసికమగు ఞ—తో పోలిక గలది. ఋు, ౠలు ఋు,ౠల పోలిక గలవై రెండుకొమ్ములు గలిగి పొందికలేక మోటుగా నున్నవి. ఒ, ఓ, ఔ లు జ—తో పోలిక గలవి. ఇఁక హల్లులలో కవర్గ మెల్లఁ బోలికయే లేని భిన్నలిపులతో నున్నది. ఖ—కు తలకట్టు లేదు. ఘ 'ఫ, ఫు, ష, షు' అక్షరముల పోలిక గలది. చవర్గమున చ ఛ లు పోలిక గలిగియున్నవి. కాని జ ఝ లు భిన్నములుగానే యున్నవి. ఙ—కు తలకట్టు లేదు. అది ఒ ఓ ఔల పోలిక గలది. ఝ ఝు,ఝు వర్ణముల పోలిక

గలిగి రెండుకొమ్ములు గలిగి యసందర్భనుగా నున్నది. ఈ ఇకారముతో బోలిక గలది. టవర్గమున ట,ఠలు పోలిక లేనివి. డ ఢ లు చ ఛ ల వలె బోలిక గలవి. ణ తలకట్టు లేనిది: క, చవర్గముల యంత్యానునాసికములు ఙ, ఞ లు తలకట్టు లేనివి. అవి చిహ్నము గలవై యుండగా ణ-కు అది లేదు. దీనితర్వాతివర్గానునాసికము లగు న, మ లకును నాచిహ్నము లేదు. తవర్గమున త మాత్రము భిన్నమై, తర్వాతి మూడక్షరములగు థ ద ధ లు పోలిక గలిగి యున్నవి. న స-తో బోలిక గలది. పవర్గమున ప ఫ లు, బ భ లును బోలియున్నవిగాని బ-కు తలకట్టు లేదు. మ-కు కొమ్ములున్నది. ఇద వ-పోలిక గలది. దీనితో భేదము గల్పించుటకిగాను వ-కు గొమ్ము ముడ్డికింద ఈయవలసెను. వ పలకుగూడ గొమ్మిచ్చుటలో నిట్టి చిక్కు కలదు. య కొమ్ము గలది. ర అలు. ల ళ లు, శ ష లు పోలిక లేనివిగా నున్నవి. స న-తో బోలిక గలది. హ వతో బోలికగలది.

ఉచ్చారణమున బోలిక యుండుటను బట్టి లిపిలో గూడ బోలిక యుండదగినయక్షరములు క ఖలు, గ ఘలు, జ ఝలు, ట ఠలు, త థలు, ర అలు, శ ష సలు, పోలిక లేనివై. పూర్వోక్తవిధమున నుచ్చారణమున నేమాత్రమును బోలికలేని యక్షరములు గొన్ని పోలికగలవై యుండుట చేతను, వర్గాక్షరాదులు సరియయిన నిర్మాణక్రమము లేనివిగా నుండుటచేతను బాలురకు లిపిని నేర్పుటలో నిక్కిలి చిక్కు గలదు. చ-కు ముడ్డికింద ఒత్తిచ్చినచో ఛ అగునని చెప్పు

టకు వీలులేదు. క ఖ, ట ఠ,త థ,లు అట్లులేవు గాన సాజాత్య బోధము కుదురదు. ఇంత వరుస వావి లేని లిపిరూప ములను బిన్నభిన్నముగా నేర్చుకొన కష్టమే కాదా? మఱియు నివిగాక అజ్గుణితము వేఱుచిహ్నములతో నేర్చుకొనవలెను: హల్గుణితము వేఱుచిహ్నములతో నేర్చుకొనవలెను. ఈ గుణితములలోఁగూడఁ బెక్కుచిక్కులు గలవు. ఇవి కొంత ఉచ్చారణరీతికి విరుద్ధముగాఁగూడ నున్నవి. హల్లుపై అజ్గుణి తమును జేర్చునప్పుడు తలకట్టు అకార మున్నప్పుడు మాత్రమే ఉండఁదగును. తక్కినయచ్చులు చేరునప్పు డుండరాదు. క, కా, కి, కీలు సరిగా నున్నవి కాని, కు కూలు తప్పుగా నున్నవి. తలకట్టు, కొమ్మ రెండును ఉండఁగూడదు. 'క్ర క్రా' లకును ఇట్టి చిక్కే కలదు ప్రైమరీస్కూళ్ల పంతులవార్లు కొందరు 'క్ర 'కు కకార అకార ఋకారములు 'క్ర' అని వర్ణక్రమము చెప్పుటను వింటిని. వా రట్లు చెప్పుట వింతగాదు. వట్రువ సుడి 'వ్య,వ్వ' ఒత్తులవలె హల్లుగాఁ దలఁపఁబడు ననియేకదా కొందఱు లాక్షణికులుగూడ అది యున్నహల్లు తక్కిన యచ్చులతోనున్న యా హల్లుతోఁ బ్రాసమునఁ జెల్లు నని చెప్పిరి! కనుక కొమ్మ, కొమ్మదీర్ఘము వట్రువసుడి, వట్రువ సుడిదీర్ఘము ఉన్నప్పుడుహల్లుకు తలకట్టు ఉండుట అక్రమము.

ఇక హల్గుణితములో 'వాక్స్వాతంత్ర్యము' అను పదము వ్రాయునప్పుడు 'క్ష్వా'లో కకార సకారములు

హల్మాత్రములు. వకారము ఆ కారముతో గూడినది. క్ష్వా
ను విడదీసినచో 'క్, ష్, వా' అగును. కాని మనము
లిపిలో ఆకారమును కకారముమీదనే ఉంచుచున్నాము.
సకారవకారములను క్రింద ఒత్తులనుగా ఉంచు
చున్నాము. బడిపంతుళ్లును, గొందఱు పండితులునుగూడ
'క–కు దీర్ఘమిస్తే కా, కా–కింద సావత్తిస్తే క్సా, క్సా–కింద
వావత్తిస్తే క్ష్వా' అనియు 'కకార ఆకార సకార వకార
ములు క్ష్వా' అనియు వర్ణక్రమము చెప్పుచున్నారు. ఇది తప్పు
గాదా! నాగరాక్షరములు ఈ విషయమున ఉచ్చారణ రీతి
ననుసరించి సరిగా నున్నవి. ఆ లిపిలో సంయుక్తాక్షరమునం
గడపటిహల్లుమీదనే యచ్చుండును. తత్పూర్వము గల్గు
హల్లులు అర్ధాక్షరచిహ్నములు గలవిగానే ఉండును. బాలు
రకు లిపి నేర్పుటలో నిట్టి చిక్కులు గలవు. అలవాటుపడి
యుంటిమి గనుక నేఁడు మన కివి యంతగాఁ జిక్కు గూర్చు
నవిగాఁ దోఁపకపోవచ్చునుగాని బాల్యమునఁ దొలుత
నేర్చుకొనునప్పుడు మనల నెల్లరనుగూడ నీ చిక్కు బాధిం
చియే యుండుట వాస్తవము. ఎంత యలవాటయినను
బ్రౌఢులనుగూడఁ గొందఱు నీ చిక్కులు బాధించుచునే
యున్నవి. తొలుత నేర్చుకొనునప్పుడు బాలురెల్లరును బాధ
పడుచునే యున్నారు. ఈ బాధ సరకుగొనరాని దనరాదు.
అక్షరములు వడిగా రాకపోవుటచే బాలు రెందఱో బండబాలీ
చదువున సన్నగిలుచున్నారు; బడి యన్న భయపడు
చున్నారు. ఈ లిపిక్లేశములు వారి హృదయప్రసాదమును

జెఱుచుచున్నవి. అక్రమపుక్లేశములకుఁ బాల్పడిచి వారిని బాధింపరాదు.

౨. అచ్చులో కష్టము:

ఇప్పు డున్నలిపిరీతినిబట్టి ముద్రణమున వేఱువేఱు లిపిసంకేతములు ఱంచుమించుగ అయిదునూఱులు కావలసి యున్నవి. వాని నీ క్రిందఁ జూపుచున్నాఁడను:—

అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ ఎ ఏ ఐ ఒ ఓ ఔ — ఇవి ౧౬.

క కా కి కీ కు కూ కృ కౄ కె కే కై కొ కో కౌ క్ ఇవి— ౧౨.

ఇట్టివి క మొదలు ఱువఱకు గల ౩౬ అక్షరము లకు మొత్తము ౪౩౨.

ఱ ఒ ఎ ఐ ఔ ళ ఴ ఘ ఞ ఝ ఠ ఢ ణ థ ధ ఫ ఙ ఛ ఝ ఞ ట ఱ ఴ ఘ ఞ ఝ ఠ ఢ ణ థ ధ ఫ ఙ ఛ ఝ ఞ ట

పట్టును. అఱవపుటచ్చుకూర్పు ఒక నెలలో నేర్చుకొనవచ్చును. ౫౦౦ గళ్లలోనుండి సంకేతముల నేర్పువలసియుండుటచే తెలుఁగులిపిని గూర్చుటలోఁగూడఁ జాల జాగగును. గంటకు ఒక 'గాలీ' అఱవము కూర్పఁగలుగఁగా, తెలుఁగున 'అర గాలీ' మాత్రమే కూర్పఁగలుగుదురు. ఇట్టికారణములచే తెలుఁగు కంపోజిటర్లు విరివిగా దొరకరు. తక్కినభాషలకంపోజిటర్ల కంటె వీరికి జీతము హెచ్చు. ఇదిగాక అచ్చుకూర్పులో సౌందర్యము తక్కువ. ఒత్తక్షరమున ౨, ౩, ౪ లిపిచిహ్నములు ఒకదానిక్రింద నొకటిగాఁ జేర్పవలసియుండుటచే బంతులు తీర్చినట్లు సాగవు. 'వాక్స్వాతంత్ర్యము' అక్షరముక్రింద నక్షరముఁ జేర్పవలసియుండుటచే 'ఫుల్ బాడీ', 'ఆఫ్ బాడీ' యను భేదములతో వేఱుతీరుల యక్షరముల నెక్కువగాఁ బోఁత పోయవలయును. ౫౦౦ లిపిసంకేతములను నిర్మింపవలసియుండుటచే వ్రాఁతమోడి, పరిమాణము భిన్నభిన్నములుగా నుండునట్లు అనేకవిధములగు లిపిభేదములను గల్పింప సాధ్యపడకున్నది. (మాటవరుసకు) మద్రాసులో అఱవమున డెమ్మీఫారము ముద్రణమునకు నాలుగురూపాయలు ఛార్జి చేయఁగా తెలుఁగున నదేమాదిరి ఫారమునకు ఆఱు, ఎన్మిది రూపాయలు చార్జి చేయుదురు. ఇట్టి వింత నెన్నో చిక్కులు తెలుఁగు ముద్రణవిధానమునఁ గలవు. ఇంతకుముందు మొదటిప్రకరణములఁ జెప్పిన వానిచిక్కులెల్ల నీ ముద్రణమునకును గలవు.

VARLA RAMAMOORTHY MEMORIAL LIBRARY V.R.M.A.R.L. D.P.R.I. Acc. No.

౩ సైపుసైటింగు :

అచ్చునకే యిన్నిచిక్కు లుండఁగా నింక సైపు సైటింగు కుదురునా? ఇంగ్లీషున, అఱవమున ఉన్నట్లు లిపి సంకేతములు ప్రక్కప్రక్కనే (ఒకదానిక్రింద నొకటి యుండకుండ) యుండుట, ఆ సంకేతములుగూడ నలువదింటికంఁటె మించకుండుట ఉన్నఁగాని సైపుసైటింగు సాధ్యము గాదు, కాన ఇప్పటి లిపిరీతికి సైపుసైటింగు కుదురనేకుదురదు.

౪. సంస్కార మెట్లుండవలయును?

మీఁద వివరింపఁబడినచిక్కులెల్లఁ దొలఁగునట్లు, అనఁగా బాలురకు సులభముగా నేర్పఁదగియుండునట్లు. అది విస్పష్టముగా నొక నిర్మాణవిధానముతో నుండునట్లు, ఉచ్చారణరీతికి భిన్నము గాకుండునట్లు, అచ్చులో సౌకర్య మేర్పడునట్లు, సైపుసైటింగుకుఁ గుదురునట్లు సంస్కరించుట సాధ్యమేని యది యవశ్యకర్తవ్యము గాదా? తాతలు ప్రవ్విన నూయిగదా యని యందుండి యుప్పునీటినే యెప్పుడును ద్రాగుచుండఁదగునా- దగ్గఱనే మంచినీటిబావి ప్రవ్వఁదగి యుండెనేని? అదిగాక, నేఁటి లిపిరీతిమాత్ర మే మంత నిశ్చలము? అయిదువందలయేండ్ల పూర్వమునఁ గల లిపికిని, మననాఁటిలిపికిని నెంతేని భేదము గలదు. నేఁటిలిపికూడ బహుపరిణామములఁ బొందుచు వచ్చుచున్నదే.

లిపిలో నిప్పు డున్న కీళ్లను దొలఁగించుకొనుట ఆవశ్యకమే కాని, వానిఁ దొలఁగించుకొనుటకై చేయు మార్పు

లలో నున్న మేళ్లుగూడఁ గొన్ని యూడుట యగునేని యా విధాన మంగీకారార్హ్యము గాఁగూడదు. మఱియు నా మార్పులు సులువుగా జరపఁదగినవై యుండవలెనుగాని మూంచ్చేదులుగాను, సర్వము తారుమారుపఱుచునవిగాను, అమితవ్యయాపాదులుగాను, జనసామాన్యమునకు ఆరంభమున నేని ఉక్కిరిబిక్కిరిగా అర్థముగానివిగా నుండునవిగాను గారాదు. అట్టివానివలన అలజడి, అశాంతి యేర్పడును. నేఁటి తెలుఁగక్షరములనే తీసివేసి వానికిబదులు ఇంగ్లీషక్షరములనో, నాగరాక్షరములనో పెట్టుద మనువారు కొందఱు గలరు. ఈ సూచన లనర్థదాయకములు. ఆ మార్పులు సులువైనవి గావు. ముత్తెపుసరులను జూచి పట్టినట్టు తెలుఁగు వ్రాఁతబంతులు గుండ్రని వ్రాలు గలవై యందముగా నుండును. ఇది మన లిపి కున్న యున్నతసుగుణము. దీనిని గోల్పోరాదు. ఇంగ్లీషునాగరలిపుల కీ యందము లేదు.

మఱియు, చేసిన సంస్కారము, ఇప్పు డున్న లిపికి అలవాటు పడియున్నవారి కెల్లరికి క్షణములో గుర్తింపఁదగినదై, యనుసరింపఁదగినదై యుండవలెను. అది వాక్రితలో, అచ్చులో, టైపులో మూఁడిటను భేదము లేక ఒకే తీరుగా నుండవలెను. వ్రాఁతలిపి వేఱు, అచ్చులిపి వేఱు, టైపులిపి వేఱు అన్న ట్లుండరాదు. మహారాష్ట్ర గుర్జర దేశములందు నాగరిలిపి కిట్టి చిక్కు గలదు. అందు వాక్రిత మోడిలిపి వేఱు; అచ్చులిపి వేఱు. అట్టి విభేదము మనకుఁ గల్గరాదు.

౫. సంస్కారవిధానము:

మీఁద వివరించిన దోషము లెల్లఁ దొలఁగునట్లును, గుణములెల్లఁ గూడియుండునట్లును గుదిరియున్నదని నేను విశ్వసించిన సంస్కారవిధానము నిక్కడ చూపుచున్నాఁడను.

అచ్చులు:

అచ్చులలో అకార మొక్కటి తక్కఁ దక్కిన యకుర ముల నెల్ల విడిచిపెట్టవలెను. అకారముమీఁదనే దీర్ఘము, గుడి మొదలగు అజ్గణిత చిహ్నములను (చిత్రము చూచునది.) జేర్చినచో అచ్చులెల్ల నేర్పడును. అకారమును మాత్ర మ్లేయుంచునది. హల్లులమీఁద నీ అకారము '్' తల కట్టు రూపమును బొందును. ఆకారాది స్వరములు హల్లుల మీఁద నున్నప్పుడే గుణితము లగునుగాని అకారముమీఁద నున్నప్పుడు గావు—అచ్చులకు గుణితము లేదుగాన.

అ,ఆ, ఇ,ఈ, ఉ,ఊ, ఋ,ౠ, ఌ,ౡ, ఎ,ఏ,ఐ, ఒ,ఓ,ఔ అను విధములఁ గల బదునాఱులిపులకును చిహ్నముల నుంచవలెను. (చిత్రము చూచునది.)

ఇట్లు మార్పఁగా, బాలురకు ఒక్క అకారము మాత్రము నేర్పి, తర్వాత దీర్ఘము గుడి మొదలగు అజ్గణితపు చిహ్నముల నేర్పినచో నచ్చు లెల్ల వచ్చును. కకారాదుల మీఁద నిఁక వేఱుగా అజ్గణితమును నేర్పఁ బనియుండదు, ఒక్క తలకట్టు మాత్రమే నేర్పవలసియుండును. దీర్ఘము.

గుడి మొదలగు నజ్ గుణితపు చిహ్నములు అచ్చులలో నేర్పుటచే నా చిహ్నములే హల్లులపై నుండును. కావున పదునైదు భిన్నాక్షరముల నేర్చుకొనవలసిన బాధ తగ్గినది. ముద్రణమున గూడ అచ్చులలో పదునైదు చిహ్నములు తగిపోయినవి.

ఁ

అ ఆ ఇ ఈ ఉ ఊ

అ ఆ ఁ ఇ ఈ ఁ ఉ ఊ ఁ

ఋ ౠ ఌ ఎ ఏ ఐ

ఋ ౠ ఌ ఎ ఏ ఐ

ఒ ఓ ఔ

ఒ ఓ ఔ

అ ఁ అం అఁ అః

(మటొక తీరు)

అ ఁ ా ి ీ ు ూ

అ ఁ ా ి ీ ు ూ

ృ ౄ ఌ ె ే ై

ృ ౄ ఌ ె ే ై

ొ ో ౌ

ొ ో ౌ

అ ఁ ా ి ీ ు ూ ృ ౄ ఌ ె ే ై ొ ో ౌ

అ ఁ ా ి ీ ు ూ ృ ౄ ఌ ె ే ై ొ ో ౌ

అ ఁ ా ి ీ ు ూ ృ ౄ ఌ ె ే ై ొ ో ౌ అం అఁ అః

అ ఁ ా ి ీ ు ూ ృ ౄ ఌ ె ే ై ొ ో ౌ అం అఁ అః

ఁ, ం, ఃలు అరసున్న, నిండుసున్న, విసర్గము పూర్వము వలెనే ఉండవలెను.

హల్లులు:

హల్లులలో క, చ, ట, త, ప- వర్గములు సమాన లిపినిర్మాణముగలవిగా నిట్లు మాఱవలెను. వర్గప్రథమాక్షరమునకు పక్కను ఒత్తిచ్చినచో ద్వితీయాక్షరమగును. వర్గతృతీయాక్షరమునకు పక్కను ఒత్తిచ్చినచో వర్గచతుర్థాక్షరమగును. వర్గతృతీయాక్షరమునకే తలమీద అనునాసికచిహ్నము చంద్రికళ (ఇప్పటి 'ఙ ఞ' ల కున్నది. ◌ం) ఉంచినచో వర్గపంచమాక్షరమగును. అకారముతోఁగూడిన హల్లులకెల్లఁ దలకట్టుండవలెను. తలకట్టు అక్షరమునంటియే యుండవలెను. అనఁగా, ప, స-లు తలకట్లతో నంటియుండవలెను. ఇట్లు తీర్చఁగా వర్గాక్షరము లి ట్లైర్పడును. (చిత్రము చూచునది.)

ఇందు బాలురకు వర్గ ప్రథమతృతీయాక్షరములను బదింటిని మాత్రమే వ్రాయనేర్చుకొనుటలోఁ బ్రయత్న మగును. ఒత్తుగల యక్షరములను ఒత్తి పలుకవలెనన్న విషయము తృటిలో బాలురహృదయమున నాటి నెలకొనును. క నేర్చినవానికి, దాని ప్రక్కనే ఒత్తుగీత గల యక్షరమును ఖ నుగా గుర్తించుట, ఉచ్చరించుట కడు సులభము. వర్గ ద్వితీయచతుర్థాక్షరములెల్ల నిట్లే సులువుగా నేర్వఁదగిన వగును. భిన్నభిన్న రేఖలతోఁ గొత్త లిపులను దిద్దుట, యుచ్చారణమును జ్ఞప్తియం దుంచుకొనుట యను కష్టము

క	ఖ	గ	ఘ	ఙ		ప	ఫ	బ	భ	మ
క	క్	గ	గ్	గ్		వ	వ్	బ	బ్	బ్

చ	ఛ	ఛ	జ	ఝ	ఞ	ఇ	య	ర	ఱ	ల	ళ
చ	చ్	చ్	జ	జ్	చ్	చ్	య	ర	ర్	ల	ల్

ట	ఠ	డ	ఢ	ణ		వ	శ	ష	స	హ
ట	ట్	డ	డ్	డ్		వ	శ	శ్	న	ధ

త	థ	ద	ధ	న		ఁ	ఀ	ఀ	ఀ	ఀ
త	త్	ద	ద్	ద్		ఁ	ఁ	ఁ	ఁ	ఁ

లుండవు. వర్గతృతీయాక్షరము ముక్క మూసికొని యుచ్చరించినచో వర్గపంచమాక్షరమగుట నుచ్చారణశక్త్యనుసారముగా బాలురకు నేర్పుటగును. దీనినిబట్టి యిరువదియైదు వర్గాక్షరములలోఁ బదిమాత్రమే దిద్ది నేర్పవలసినవి; తక్కినవి కడుసులభముగా జ్ఞాపకమునఁ బెట్టుకొని రెండు ఒత్తుగీఁతల భేదముతో, తలవీఁది చంద్రవంకతో వ్రాయఁదగినవియగును. వర్గాక్షరములెల్ల నొక్క నిర్మాణక్రిమము గలవగును.

ఇట్లు మార్పఁగా ముద్రణమునఁగూడ నిర్వదియైదు వర్గాక్షరములలోఁ బదునైదక్షరములు తగ్గిపోవును. వర్గద్వితీయచతుర్థాక్షరముల నచ్చునఁ గూర్పవలసినప్పుడు, వర్గప్రథమతృతీయాక్షరములఁ గూర్చి వానిపక్క నంటియొక్క నిలువుగీఁత (1) అంకెను జేర్చిన సరిపడుము. వర్గపంచమాక్షరమునకు వర్గతృతీయాక్షరము తలకట్టు నొట్టునట్టు చందికళ చేర్చినఁ జక్కఁబడును.

అంతస్థములు: ఊష్మలు:

య-కుఁ గల కొమ్మును దొలఁగింపవలెను. ర-కే పక్కను ఒత్తిచ్చినచో బండి అ అగును. ల—కు తలకట్టుండవలెను. ల-కే పక్కను ఒత్తిచ్చినచో ళ అగును. వ—ను ప-ను గాఁ జేసితిమి గాన వ స్థానమునఁ గొత్త యక్షరము వ్రాసి 'వ' చేర్పవలెను. శ యథాపూర్వమే. శ-కు పక్కను ఒత్తిచ్చినచో ష అగును. సస్థానమున న యుంచునది. హ స్థాన

మున నేఁటి ళను, అనఁగా కర్ణాటకపు హకారమును ఉంచు నది. హ తలకట్టు, దీర్ఘము కలిగియున్నదిగాన దానిని దొలఁగింపఁదగును. ఋకారము కష సంయుక్తాక్షరము గాన దానికి వేఱురూప మనావశ్యకము. ఇట్లు తీర్చగా నంతస్థ ములు, ఊష్మలు ని ర్లేర్పడును. (చిత్రము చూచునది.)

ఈ మార్పువలన యాదిళాంతమగు పది యక్షరము లలో మూఁడక్షరములు తగ్గినవి. ఒక నిర్మాణక్రమ మేర్ప డినది.

గుణితము

అజ్గుణితము:—అజ్గుణితచిహ్నము లెల్ల అచ్చులు నేర్చు కొనుటలోనే వచ్చినవిగాన బాలుర కిఁక హల్లులలోఁ దల కట్టు అకారస్థానీయ మనియును, తక్కిన యచ్చులకెల్ల అకారముమీఁదఁ బెట్టిన గుర్తులే పెట్టిన సరిపడు ననియుఁ జెప్పి ఋణములో అజ్గుణితమును నేర్పవచ్చును.

ముద్రణమున తలకట్టు, దీర్ఘాచిస్వరచిహ్నములు వేఱువేఱుగా నిర్మించి (కన్నడలిపికిఁబోలె) చేర్చవలెను. దీనిచే ఒక్కొక్క హల్లునకును అజ్గుణితముకింద నిప్పుడు పోయఁబడుచున్న ప్రత్యేకాక్షరములు పదేసి పదేసి తొలఁగి పోవును. దీనిచే అచ్చుపోఁతలోఁ గల యమితభారము తప్పి పోవును.

హల్గుణితము:—ఉచ్చారణరీతికి విరుద్ధముగాకుండ లిపిరీతి యుండవలెను గాన, హల్సంయుక్తాక్షరములందు కడ

పటి హల్లుమీఁదనే అచ్చు ఉండవలెను. కడపటిహల్లే పూర్ణాకారముగా నుండవలెను. తత్పూర్వపుహల్లులు తలకట్టు లేనివిగా (అనఁగా హలంతములుగా) నుండవలెను. (తలకట్టు తొలఁగిన హల్లులు హలంతములు.) ఒక యక్షరముకింద నొక యక్షరము నిటికించుట యను విధానము మానవలెను. లిపులెల్లఁ బ్రక్క పక్కలనే ఉండవలెను. అనఁగా నిట్లు. దివ్యధ్వని—అను పదమును 'దివ్యధ్వని' అని వ్రాయవలెను. రెండిటికంటె పెచ్చుగా హల్లులు సంయుక్తములైయున్నప్పుడు మాత్రము, కడపటి హల్లుగాక తత్పూర్వపు హల్లులు, తలకట్టు లేనివిగా నుండునుగాన, ఒకదాని కింద నొక దానిని బెట్టినను బెట్టవచ్చును. ఎట్లనఁగా—'వాక్స్వాతంత్ర్య' అను పదము 'వాస్వాతంత్ర్య' అని వ్రాయవచ్చును. ఇట్టి మార్పువలన బాలురకు హల్లుణితపు ఒత్తును నేర్చుకొనవలసిన శ్రమము తొలఁగును. ఉచ్చారణరీతి ననుసరించి లిపిరీతిని నేర్చుకొనుట యగును.

ముద్రణమున నీమార్పు బహుసుఖావహము. బంతిలో నక్షరము లెల్లఁ దీర్చినట్లుండును. ప్రతిపదము అక్షరము కింద నక్షరము వచ్చి బంతి వంకరవోదు. 'హాఫ్ బాడి, ఫుల్ బాడి' పైపుల గజిబిజి యుండదు. సమ్మతముగుచో రెండింటికంటె నెక్కువ హల్లులు సంయుక్తమైనప్పుడుమాత్రమే తలకట్టు లేని హల్లులు అక్షరము కింద నక్షరముగా నేర్పడును. అది యసాధారణముగా నెక్కడనో వచ్చును. కాన యంతచిక్కుండదు. కాని యిక్కడ నసౌకర్యమువలెఁ దోఁచఁదగిన

విషయ మొకటి యున్నది. ఏదనఁగా—సంయుక్తాక్షరములు హల్లుకింద హల్లుగాఁ గాకుండ పక్కపక్కగాఁ గూర్చుట చేత నిప్పటి లిపి యాక్రమించుకొను స్థలముకంటె నీ మార్పు లిపి పెచ్చుస్థల మాక్రమించుకొనును గదా అనునది. ఇది యోచింపఁదగినదే. ఒకానొక యాంగ్లాభిమాని ప్రము ఖుఁడు ఆంధ్రలిపిని దొలఁగించి తత్ స్థానమున నాంగ్ల లిపిని చొప్పింతుమేని నూఱుపుట లాక్రమించుకొను గ్రంథ మును ఏఁబదిపుటలలో సమకూర్పవచ్చు నని కొన్ని యేండ్ల క్రిందట వాదించుట వింటిని. ఇంగ్లీషక్షరములు నిలువునిలువు గానుండు గీఁత లగుటచే స్వల్పస్థలమునఁ బెక్కక్షరములను గూర్పనగు నని యా లిపిజ్ఞు లనిరి. అట్లు తలఁచువారుండఁగా నే నిపుడు పేర్కొను లిపిసంస్కారము ఇప్పటి లిపికంటె పెచ్చుస్థల మాక్రమించునదిగా నుండునేని యది ప్రాజ్ఞసమ్మ తము గాకపోవచ్చును. కాని యీ సంస్కారము నిజముగా నట్లు పెచ్చు స్థల మాక్రమించుకొనదు. వ్రాఁతలో నించు కంతస్థలము పెచ్చుతగ్గు లగుటలోఁ జిక్కుండదు. అచ్చులో స్థలము పెరుగుటమాత్రమే చిక్కు. అచ్చులో లిపికింద లిపి నుంచి కూర్చినట్టు కన్పట్టుచున్నదే కాని, వాస్తవమునకు (హాఫ్ బాడీతప్ప) పక్కనే ఉండును. వానిని గూర్చుటలోఁ గొంచె మించుమించుగా విడఁబఱిచి వ్రాసిన నెంతస్థల మాక్రమించుకొనునో యంత స్థలమును వెనుక ముందుల ఆ 'స్పేసు' ఆక్రమించుకొనుచున్నది. పైగా బంతి వంకరవోవుచున్నది. అట్టి సంయుక్తాక్షర ములు గల బంతికొఱకయి కొన్ని 'లెడ్లు' ఎక్కువ

వేయవలసివచ్చుచున్నది. కాన వీనిని గలిపి కట్టుకొని నచో నంతగా నీ మార్పు హెచ్చుస్థల మాకర్షించు కొనునది గాదని యేర్పడును. మఱియు ఋ, ౠ, ఘ, ఝ, ఢ, మ, య, ఱ, హ- లలో జరపఁబడిన మార్పులవలని స్ధ లాభము కొంత గలదు. కావున నిది యంత యనర్థావ హము గాదని నాతలంపు. అఱవలిపి యీవిధమననే కలదు. అందు లిపికింద లిపి చేరదు. దానివలన వారి కెట్టి యసౌ కర్యమును లేదు.

ఈ మార్పుచే హల్లుల యొత్తులు ర్య, ర్వ, ర్ఱ, ర్శ మొదలగునవి అక్కర లేకపోవును. అజ్గుణితచిహ్నములను వేఱుగాఁ బోఁతపోసి తలకట్టు లేకుండఁ బోసిన హల్మాత్ర ములమీఁదఁ జేర్చుటకు వీలు గలుగును. సంయుక్తాక్షర మందలి హల్మాత్రములు తలకట్టు లేకుండఁ బూర్వమునందు కడపటి హల్లు అచ్చుతోఁ గూడియుండుట గుదురును.

మొత్తము లిపియెల్ల నిట్లు మార్పఁగా నచ్చుకై పోఁత పోయవలసిన రేఖాచిహ్నములు ముప్పదియైదు మాత్రమే యగును. వర్గద్వితీయచతుర్థములకు, ళ, ఱ, ష – లకుఁ బెట్టవలసిన ఒత్తుగీఁత యొక్కటి, వర్గానునాసికములకుఁ బెట్టవలసిన చంద్రికళ ఒక్కటి గలవు. ఈ రెంటిని జేర్చు కొనఁగా ముప్పదియే డగును. ఇప్పుడు ముద్రణమునకై యుప యోగింపఁబడుచున్న చిహ్నములు ౫౦౦లలో ౪౬౩ తగ్గి పోయినవి. ముద్రణమున కీ మార్పు అమితోపకారకముగదా!

ఈ మార్పునుబట్టి నైపుమిషనును సృష్టించుట కడు సుకరముగదా!

దంత్యములగు చజలకు వేఱు లిపు లక్కఱ లేదు. ఇప్పుడు వాని భేదము నెవ్వరును లిపిలో పాటించుట లేదుగాని కావలెనని యభిమానించువారికై ప్రత్యేకలిపి కల్పించితిని. రేఫమునకుఁ బూర్వపులిపిలో వలపలిగిలక—ꣳ అను చిహ్నమును, నకారమునకు ꣳ అను చిహ్నమును గలవు. ఈ లిపు లభిమానింపఁ దగినవి. కాని వలపలిగిలక 'వగꣳము' అను విధమున వ్రాయఁబడును. ఇది 'వꣳగము' అనువిధమున మార్చుట ఉచ్చారణానుగుణము. అప్పుడది డాపలిగిలక యగును. ఇష్టమేని వీని నుంచుకొనవచ్చును. అనిష్టమేని మానవచ్చును. కర్ణాటాంధ్రలిపులకుఁ జాల సాన్నిహిత్య మున్నది గాన, ఉభయలిపులకు నైక్యము కలుగుట యుభయ దేశములవారికిని జాల లాభకరమని నా యీ సంస్కారములో కర్ణాటలిపిరీతిని కొంత చేకొనుటయ్యెను. ఉభయలిపులకు నైక్యము పొసగుట నాకోరిక.

[శ్రీ భోగరాజు పట్టాభిసీతారామయ్యగారు లిపిసంస్కారమును గూర్చి వ్రాసిన జాబు ఆనాటిదిది. తదుపరి యిందున్న విధమున మరి కొన్ని సంస్కారములనుగూడ శ్రీ శాస్త్రిగారు కావించిరి.]

బందరు

13/4/48

ఆర్యా,

తమరు భారతిలో ప్రచురించిన వ్యాసము చదివితిని. అయిదు బళ్లు 18 అక్షరములతోను, 17 పొల్లులతోను పూర్తి అగుటచే పైపుకు వీలుగ నుండును. కాని వకును యకును భేదము బహు తక్కువ.

చిత్తగించవలెను

భోగరాజు పట్టాభిసీతారామయ్య.

AOUA102B114

V.V.R. MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.

మువము ఫౌండేషన్ పుస్తకాల పంశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA102B114
పుస్తకం పేరు	తెలుగు మెఱుగులు
తారీఖు	31 December 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	219
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	4, BCI, 4,
లేని పేజీలు	no
తయారు చేసినది	M. Raju.
పేజీలు విడదీసినది	M. Raju
స్కాన్ చేసినది	Cataloged
పరీక్ష చేసినది	anusha
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good